# ప్రవక్త దూషణ

## మరణదండనార్హమైన

# నేరమా?

-మౌలానా వహీదుద్దీన్ ఖాన్

Shatm-e-Rasool ka mas’ala
(Telugu)

# ప్రవక్త దూషణ

మరణదండనార్హమైన

# నేరమా?


మూలం:
మౌలానా వహీదుద్దీన్ ఖాన్

అనువాదం:
ఎం.డి. ఆఖిల్ అలి

This book is aTelugu translation of some chapters from “Shatm-e-Rasool ka mas’ala, written by Moulana Wahiduddin Khan.

Telugu Translation by: Md Akhil Ali.
Mobile: 98488 20154, Mail:infoakhil1970@gmail.com

**First published in Urdu:1997**

**First published in Telugu: 2024**

**This book is copyright free**

**CPS International,**
Centre for Peace and Spirituality International,
1, Nizamuddin west market, New Delhi-110013, INDIA,
e-mail:info@cpsglobal.org www.cpsglobal.org

**Goodword Books:**
A-21, Sector 4, Noida-201301, Delhi, NCR, India,
e-mail:info@goodwordbooks.com www.Goodwordbooks.com

**Center for Peace and Spirituality USA**
2665, Byberry Road, Bensalem, PA 19020, USA,
e-mail:kkaleemuddin@gmail.com

**Goodword Books - Chennai**
324, Triplicane High Road, Chennai-600005, India,
e-mail:chennaigoodword@gmail.com
Mobile: +91 97908 53944 / +91 96001 05558

**Satyamarga Sandesa Sangham-A.P**
What's app: 93940 03049 / 95735 22690
Website:http://cpstelugu.com

# విషయ సూచిక

1. రుషీశ్వరుని దూషణ(కలానికి కలమే జవాబు)....................................................01

2. పరిస్థితులకు ప్రభావితం కాకూడదు.............................................................03
3. రుషీశ్వరుణ్ణి దూషించే అంశం....................................................................05
4. జీవన శైలి.................................................................................... 06
5. నిష్ఫల కార్యాచరణ.............................................................................08
6. ప్రవక్త దూషణా వ్యవహారం.....................................................................09
7. రెండు ఎంపికలు (Two Options)...............................................................11
8. ఖిసాస్(ప్రతికార)సూత్రం..........................................................................13
9. శాంతియుత నిరసన ..........................................................................14
10. శాంతియుత నిరసన..........................................................................15
11. హూందాగా వైదొలగటం.....................................................................17
12. ప్రకృతి విరుద్ధ కార్యాచరణ...................................................................25
13. రుషీశ్వరుని దూషణకు దండన..............................................................27
14. ముహమ్మద్ పేరుతో ముహమ్మద్ వ్యతిరేక చర్యలు.........................................29
15. రుషీశ్వరుని దూషణా సమస్య...............................................................30
16. సారాంశం......................................................................................34
17. కార్టూన్లను పట్టించుకోకండి...................................................................36
18. దూషణ మరియు భ్రష్టత్వం.....................................................................37
19. పరిస్థితులకన్నా ఉన్నతంగా ఎదిగి ఆలోచించాలి...........................................38
20. డైరి నుండి కొన్ని విషయాలు.................................................................47
21. ఆధునిక భావజాలం మరియు ఇస్లాం........................................................51
22. సమాచార వైఖరా? బలవంతపు వైఖరా?.....................................................53

23. శిక్ష దైవసంబంధితమైంది.........55
24. క్షమా దయాగుణాల ఆజ్ఞ.........56
25. రుషీశ్వరుని అవమానం.........57
26. రుజువా? లేక శిక్షా?.........60
27. అభిప్రాయ బేధపు వ్యవహారం.........64
28. కారుణ్యమూర్తి కార్యాచరణ విధానం.........65

# రుషీశ్వరుని దూషణ

## 1. కలానికి కలమే జవాబు

ఇబ్నేతైమియా(హిజ్రి661-728)కాలంలో సిరియాలో ఒక సంఘటన జరిగింది. చరిత్రకారుడైన ఇబ్నేకసీర్ ఈ సంఘటనను ఈ పదాలతో ప్రస్తావించారు. అసఫ్ నస్రానికి సంబంధించిన సంఘటనది. ఈ వ్యక్తి(డెమస్కస్లో దక్షిణాన ఉన్న ఒక పట్టణం అస్-సువీద)కు చెందినవాడు. ఇతడు రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించాడని ఒక సంఘంవాళ్ళు ఇతనికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చారు. అప్పుడతడు, నాయకుడైన ఇబ్నెఅహ్మద్ బిన్ హజ్జిని శరణు వేడుకున్నాడు. అంతే, అప్పుడు షేఖ్ తఖియుద్దీన్ ఇబ్నె తైమియా మరియు షేఖ్ జైనుద్దీన్ అల్-ఫారూఖి, వీరిద్దరు ఒకటైపోయారు. రాజ్యానికి ఉపనాయకుడైన అజుద్దీన్ అయ్బక్ అల్-హుమీమి వద్దకు వీరిద్దరు వెళ్ళారు. అక్కడ అతనితో ఈవిషయంలో చర్చించారు. అతడు వీరిద్దరి మాటను అంగీకరించి, నిందితుణ్ణి ప్రవేశపెట్టమని ఆదేశించాడు. ఇక వారిద్దరూ ఆ ఉపనాయకుని నుండి శెలవు తీసుకొని బయలుదేరినప్పుడు, వారిద్దరితోపాటు అనేకులు తోడయ్యారు. అలాగే, ఎప్పుడైతే అసాఫ్ ఎదురయ్యాడో అతనితోపాటు ఒక అరబివ్యక్తి ఉండటాన్ని వారు గమనించారు. ఆ అరబివ్యక్తిని వీరు నిందించటం ప్రారంభించారు. అప్పుడొక పల్లెటూరి వ్యక్తి ఈవిధంగా అన్నాడు: "ఈ క్రైస్తవుడు మీకన్నా ఉత్తముడు" అని. అప్పుడు అక్కడున్న ప్రజలు వీరిద్దరిని రాళ్ళతో కొట్టారు. ఆ సందర్భంగా అసాఫ్కు దెబ్బలు తగిలితే, అతడు బిగ్గరగా అరవటం ప్రారంభించాడు. అప్పుడు ఉపనాయకుడు, కబురు పంపించి, ఇబ్నె తైమియాను మరియు అల్-ఫారూఖి రప్పించుకొని తనయెదుటే వారిని దండించాడు. ఆ తరువాత వారిద్దరిని అల్- అజ్రావియాలో బంధించేసాడు. అప్పుడు ఆ క్రైస్తవుడు వచ్చి, ఇస్లామ్ను స్వీకరించాడు. ఈ సందర్భంగా ఒక సమావేశం ఏర్పాటు చేయబడింది. ఆ సమావేశంలో అతడు, తనకు మరియు సాక్షులకు మధ్యనున్న శత్రుత్వాన్ని బయటపెట్టాడు. ఈవిధంగా అతడు మరణదండన నుండి తప్పించుకున్నాడు. ఆ తరువాత ఉపనాయకుడు ఆ ఇద్దరు పండితులను పిలిపించి, వారు తనతో రాజీపడేలా చేసి, వారిని విడిచిపెట్టేశాడు. అప్పుడు ఆ క్రైస్తవుడు హిజాజ్ ప్రాంతానికి వెళ్ళిపోయాడు. అనుకోకుండా అతడు తన అన్నకొడుకు చేతుల్లో రుషీశ్వరుని మదీనా పట్టణానికి కొంతదూరంలో హతమార్చబడ్డాడు. ఈ సంఘటన విషయంలో షేఖ్ తఖియుద్దీన్ ఇబ్నె తైమియా ఒక పుస్తకాన్ని వ్రాశారు. దానిపేరు "అల్-సారిముల్ మస్లూల్ అల సాబిర్రసూల్" (ప్రవక్తను దూషించేవానిపై నగ్నఖడ్గము) - (అల్-బిదాయా వన్ నిహాయా, 13వ భాగం, 396వ పేజి)

ఇటువంటి ఘటనే స్వయంగా రుషీశ్వరుడైన ముహమ్మద్ కాలంలో మదీనా పట్టణంలో కూడా జరిగింది. ఆ కాలంలో దీనిని ఒక ఖండన(abuse)గా పరిగణించేవారు. అంటే, నిందించటం అని అర్థం. ఆ ఉల్లేఖనం ఈవిధంగా ఉంది: రుషీశ్వరుడైన ముహమ్మద్ చెప్పారని ఆయిషా ఈవిధంగా చెబుతున్నారు: "ఖురైషులను ఖండించండి. ఎందుకంటే, వారికి బాణాల దెబ్బకన్నా, కవిత్వరూపంలో ఖండించటం అనేది బలంగా తగులుతుంది కాబట్టి" అని అన్నారు. -(ముస్లిం, హదీసు నెంబరు:2490)

ఈ ప్రవచనం ద్వారా మనకు అర్థమౌతున్నదేమిటంటే, ఈ విషయంలో(ప్రవక్తను దూషించే విషయంలో) నిందితుణ్ణి హతమార్చేయటంకాదు. రుషీశ్వరుని సాంప్రదాయం ప్రకారం, కవిత్వంతో నిందించినవాణ్ణి, కవిత్వంతోనే ఖండించాలిగాని, ఖడ్గంకాదు అనేది.

పూర్వకాలం, ముద్రణా యంత్రాంగాల కాలం కాదు. అప్పుడు అటువంటి విధానమే అమల్లో ఉండేది. అయితే ఇప్పుడు వ్యాసం రూపంలోనే సమాధానం వ్రాసి, దానిని ప్రచురించి, ప్రజల్లో వ్యాపింపజేయాలి. ఇదే ఈనాటి కాలానికి సరైన విధానం. హర్తాళ్ళు చేయటం, హత్యలు చేయటం వంటి చేష్టలు రుషీశ్వరుని సాంప్రదాయానికి విరుద్ధమైన చేష్టలు. అంతేకాదు, రుషీశ్వరుణ్ణి నిందించేవారి విషయంలో ప్రార్థించటం అనేది రుషీశ్వరుని సాంప్రదాయం. అబూహురైరా తల్లి విషయంలో రుషీశ్వరుని ప్రార్థన ప్రవచనంలో ఈవిధంగా ఉంది:"నేను నా తల్లికి సత్యధర్మసందేశాన్ని ఇచ్చినప్పుడు ఆమె, రుషీశ్వరుడైన ముహమ్మద్ను నిందించింది. అప్పుడు నేను ఏడుస్తూ ఆయన సన్నిధిలో వచ్చి, యావత్ వృత్తాంతాన్ని ఆయనకు వినిపించి, నా తల్లి విషయంలో మీరు సర్వేశ్వరుణ్ణి ప్రార్థించండని వేడుకున్నాను. అప్పుడు ఆయనగారు నా మాటను మన్నించి, నా తల్లికి రుజుమార్గం ప్రసాదించమని ప్రార్థించారు. ప్రవచనం ప్రకారం, తన తల్లి ఆ తరువాత సత్యధర్మాన్ని స్వీకరించారు" అని అబూహురైరా తెలిపారు. -(ముస్లిం, 2491వ హదీసు)

# 2. పరిస్థితులకు ప్రభావితం కాకూడదు

ప్రజలు ఏవిధంగానైతే పూర్వపు రుషీశ్వరులతో ప్రవర్తించారో, అదేవిధంగా రుషీశ్వరుడైన ముహమ్మద్తో కూడా మక్కా ప్రజలు ప్రవర్తించారు(15:11). కాని రుషీశ్వరుడైన ముహమ్మద్ మాత్రం ప్రతికూల ఘటనలకు అనుకూల సమాధానాలనే ఎల్లప్పుడు ఇస్తుండేవారు. ఈసంధర్భంగా ఒక ఉల్లేఖనం, ప్రవచన గ్రంథాల్లో ఈవిధంగా చెప్పబడింది:"ఖురైషుల ఆగడాల నుండి మరియు వారి శాపనార్ధాల నుండి ఆ సర్వేశ్వరుడు నన్ను ఏవిధంగా రక్షిస్తున్నాడో అనే విషయం మీకు ఆశ్చర్యం కలిగించటంలేదా? వారు నన్ను ముజమ్మం(ఖండనార్హుడు)అని శపిస్తున్నారు. వాస్తవానికి నేనైతే ముహమ్మద్నే"(ముహమ్మద్ అంటే, ప్రశంసనీయుడు అని అర్థం) -(బుఖరి, 3533వ ప్రవచనం).

దీనినిబట్టి అర్థమౌతున్న విషయమేమిటంటే, ఖురైష్ ప్రజలు దినదినాభివృధి చెందుతున్న తమ వ్యతిరేకతలో భాగంగా నా అసలు పేరును ఉచ్చరించటానికి కూడా ఇష్టపడటం లేదనేది. అయితే నాకు వ్యతిరేకంగా ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు, నా పేరును ప్రస్తావిస్తూ చెప్పాలనుకుంటున్నారు కాబట్టి, నన్ను వ్యతిరేకిస్తున్న ఆనందంలో, నా పేరును ముహమ్మద్ కు బదులుగా ముజమ్మం అని పెట్టేసారు. ముజమ్మం అంటే, "ఖండించదగినవాడు" అని అర్థం. ఈవిధంగా వారు నన్ను శపిస్తున్నారు. అయితే వీరి శాపనార్థాలైతే ముజమ్మంఅనే పేరుగల వ్యక్తికి తప్పకుండా తగులుతాయి. కాని ఎవరి పేరైతే ముహమ్మదో అతనికైతే ఈ శాపనార్థాలు ఏమాత్రం తగలవు (ఎందుకంటే, నేను ముజమ్మం కాదుకాబట్టి).

మహోన్నత ఆలోచనకు ఇదొక సాటిలేని ఉపమానం. ఎందుకంటే, ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ స్వయంగా ఒక సంపూర్ణమైన అనుకూల(సకారాత్మక) ఆలోచనపై సుస్తిరంగా వుండే వ్యక్తి కాబట్టి. అందుకే ఆయనగారు, ఖురైషుల సమస్త చిల్లర వ్యవహారాలను ఒక సున్నితమైన శైలిలో సంహరించేసారు. ఇంకా ఆయనగారు ఏమన్నారంటే, "ఖురైషులు నా అసలు పేరుతో నన్ను ఏమీ అనకుండా, ముజమ్మం అనే పేరుతో తమ ఒక ఊహాత్మక వ్యక్తిని నిందిస్తున్నారు తప్పా, ఎవరికైతే అతని తల్లిదండ్రులు ముహమ్మద్ అని నామకరణం చేసారో అతణ్ణి మాత్రం వారు నిందించటంలేదు కదా" అని. రుషీశ్వరుని ఈ ఆదర్శాన్నిబట్టి, తన నిందారోపణల విషయంలో కోపేద్రేకులు కాకూడదని, నిందించేవాణ్ణి హతమార్చటానికి ప్రయత్నించకూడదని తెలుస్తుంది. దానికి బదులుగా అతనితో సున్నితమైన పద్ధతిలో వ్యవహరించాలి. నిస్సందేహంగా అదొక అత్యంత నైతికపరమైన వ్యవహారమేగాని, చట్టపరమైన శిక్షా వ్యవహారం కాదు.

ఇదే వ్యవహారం రుషీశ్వరుణ్ణి దూషించే వానికి విధించే శిక్షకు సంబంధించింది. రుషీశ్వరుణ్ణి నిందించటాన్ని విచారించదగ్గ నేరం(cognizable offence)గా యావత్ ముస్లిం ఫిఖ్హావేత్తలు భావించి కూర్చున్నారు. ఇలా దూషించే వ్యక్తిని క్రిమినల్ యాక్ట్ ప్రకారం హతమార్చటం జరుగుతుంది. ఇబ్నుల్ ముంజిర్ ఈవిధంగా చెబుతున్నారు: "ఏ వ్యక్తి అయితే రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషిస్తాడో, అతణ్ణి హతమార్చటం జరుగుతుందనేది అధికశాతం పండితుల ఏకాభిప్రాయం" - (ఇబ్నెతైమియ, 3వ పేజి). ఈ వ్యవహారం విషయంలో ఒకవేళ ఉద్దండ పండితుల పేర్లు ఉన్నప్పటికీ, ఈ వ్యవహారం నిస్సందేహంగా వివరణా లోపానికి సంబంధించిన అంశమని చెప్పవచ్చు. అయితే ఇప్పుడు ఇస్లాం పండితుల అత్యవసర ఆవస్యకత ఏమిటంటే, వారు బహిరంగంగా, "షరియత్ ప్రకారం రుషీశ్వరుని దూషణ, మరణ దండనార్హమైన నేరం కాదు. అదొక వివరణా లోపానికి సంబంధించిన అంశము. ఇప్పుడు మేము దీనిని ఇక్కడితో ఆపేస్తున్నాము" అని ప్రకటించటం. దూషణకర్త మహాఅయితే, ఒక సందేశగ్రహీత మాత్రమే. అతనికి శ్రేయోభిలాషతో కూడిన సత్యనిరూపణేగాని మరణదండన మాత్రం విధించకూడదు.

# 3. రుషీశ్వరుణ్ణి దూషించే అంశం

ఇస్లాంలో ధర్మభ్రష్టునికి మరణదండన అనే విషయం నిరాధారమైంది. ఎందుకంటే, దీని ఆజ్ఞ ఇటు ఖురాన్ గ్రంథంలోగాని, అటు రుషీశ్వరుడైన ముహమ్మద్ ప్రబోధనల్లో(హదీసులో)గాని మనకు దొరకదు కాబట్టి. కాని ఫిఖ్హావేత్తలు(పండిత వర్గం)మాత్రం సొంతంగా, ధర్మభ్రష్టునికి మరణదండన, రుషీశ్వరుణ్ణి దూషించేవారికి మరణదండన వంటి స్వీయ సిద్ధాంతాలను కల్పించుకున్నారు.

ఇటువంటి వ్యవహారాలు ఇస్లాం ఆత్మ(spirit)కు అత్యంత వ్యతిరేకమైనవి. (షరియత్)చట్టం పేరుతో బలవంతంగా రుద్దబడే ఇటువంటి విశ్వాసాలకు ఇస్లాంలో తావులేదు. ఇస్లాం అనేది, ప్రభుత్వచట్టం బలవంతం చేస్తే ఆచరించేది కాదు. స్వేచ్ఛాస్వతంత్రాలు కలిగి, స్వచ్ఛందంగా ఆచరించేదే ఇస్లాం. ఇస్లాం అనేది, వ్యక్తిగతంగా అన్వేషింపబడాలి. అలాగే, విశ్వాసం అనేది, స్వీయాన్వేషణా(self-discovery) పునాదులపై నిలబడేదై ఉండాలి.

ఎక్కడైతే ఒకవ్యక్తి "దూషణలో" లేక "ధర్మభ్రష్టత్వంలో" మునిగిఉంటాడో, ఇస్లాం ప్రకారం శ్రేయోభిలాషతో కూడుకున్న బాధ్యత ఏమిటంటే, అతని విషయంలో దైవాన్ని ప్రార్థించటం, మరియు అతనితో సంవాదం చేయటం మాత్రమే. ఒకవేళ అతనిలో ఏదైనా సందేహం ఉంటే, జ్ఞానయుక్తమైన సంవాదం చేసి, అతని సందేహాన్ని నివృత్తి చేయాలి. అతణ్ణి ఒక నేరస్తునిగా చూడకుండా, ఏవిధంగానైతే ఒక వైద్యుడు తన రోగిని చూస్తాడో, ఆవిధంగా చూడాలి.

వాస్తవం ఏమిటంటే, ఫత్వాలు జారీచేసి ప్రజలను హతమార్చటం ఇస్లాం ఉద్దేశ్యం కాదు. శ్రేయోభిలాషతో కూడుకున్న భావోద్వేగం ప్రకారం, వారిని ఆ సర్వేశ్వరుని కారుణ్యఛాయల్లో తీసుకురావటానికి కృషిచేయటమే ఇస్లాం అసలు లక్ష్యం. వాస్తవదృష్టితో చూసినట్లైతే, ఇటువంటి వ్యక్తుల వ్యవహారం(case) కేవలం అజ్ఞానం(unawareness)కారణంగానే అనేది మనకు తెలుస్తుంది. ఒక సందేశదాత లేక సంఘ సంస్కర్త యొక్క విద్యుక్తధర్మం ఏమిటంటే, ఇటువంటి వ్యక్తుల అజ్ఞానాన్ని దూరంచేసి, వారి నైజాన్ని (nature / conciousness)ను జాగృత పరచాలి. తన సృషికర్తతో దగ్గరయ్యే అవకాశాన్ని అతనికి ఇవ్వాలి. అతనిలో పాశ్చాత్తాప వైఖరి రావటానికి కృషిచేయాలి. అతడు స్వీయసంస్కరణ చేసుకొని, తిరిగి రుజుమార్గంపై స్థిరపడేలా కృషిచేయాలి. ఇస్లాంలో సామాజికనేరానికి(social crime)కు మరణదండన ఉందితప్పా, సైద్ధాంతిక నేరానికి(conceptional crime)కు మాత్రం మరణదండన లేదు.

# 4. జీవన శైలి

బహుశా, ముస్లిం నాయకులు(మార్గదర్శకులు), ముస్లిం సమాజానికి ఏది హరాం(నిషిద్ధం) ఏది హలాల్(ధర్మ సమ్మతం)అనే విషయాలు  నేర్పారుగాని, వారు(ముస్లింలు)సమాజంలో ఎలాంటి జీవనశైలి కలిగిఉండాలనే విషయం నేర్పించకుండా అతిపెద్ద పొరపాటు చేసారని అనిపిస్తుంది. ఏ విధానాన్నైతే ముస్లింలు సెక్యులరిజం అని ద్వేషిస్తున్నారో, అది, హలాల్ హరాంలతో సంబంధంలేని విషయం. పైగా అది, ప్రజలు శాంతియుతంగా ఏవిధంగా జీవించాలో తెలిపే ఒకచక్కటి వ్యవస్థకూడా. మీరు, జీవితంలో కేవలం హలాల్ హరాంలను తెలుసుకోవటం ఒక్కటేకాదు, సమాజంలోని ఇరుగు పొరుగు వారితో కలిసి ఎలా జీవించాలో తెలుసుకోవటం కూడా ఎంతో ముఖ్యం.

ఉదాహణకు, ఒకవ్యక్తి మీ ప్రవక్తకు వ్యతిరేకంగా మీకు ఇష్టంలేని ఏదైనా ఒకమాట చెబితే, అప్పుడు మీరు ఆ వ్యక్తిని వెంటనే "షాతిం"(దూషిణకర్త)అని అనేయకండి. దానికి బదులుగా, "అతని అభిప్రాయం నా అభిప్రాయానికి భిన్నమైనది" అని అనండి. ఒకవేళ ఎవరైనా ఒకవ్యక్తి మీ అభిప్రాయానికి వ్యతిరేకమైన అభిప్రాయం కలిగిఉంటే, ఆ వ్యక్తిని హతమార్చండనే ఫత్వా(తీర్పు)ను జారీచేయకండి. అతణ్ణి, కేవలం భిన్నాభిప్రాయల ఖాతాలో జమచేయండి. అంతేకాకుండా అతణ్ణి, శాంతియుత పద్దతుల్లో నచ్చజెప్పటానికి కృషిచేయండి.

చాలా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఎవరైతే ముస్లిం సమాజపు దశాదిశా నిర్దేశకులు (trendsetters)గా ఉన్నారో, వారే ఈ నేరానికి పాల్బడుతున్నారు. ఉదాహరణకు, పేరుగాంచిన ఒక పండితుడు(ఇబ్నెతైమియా)ఒక పుస్తకాన్ని వ్రాసారు. దాని మకుటం ఈవిధంగా ఉంది: "దూషణకర్తపై నగ్నఖడ్గం". ఈ పుస్తకం, ముస్లిం సమాజానికి ఒక సూత్రాన్ని ప్రతిపాదిస్తుంది. అదేమిటంటే, "ఒకవేళ ఎవరైనా ఒకవ్యక్తి మీ ప్రవక్తకు వ్యతిరేకంగా దూషణచేస్తే, మీరు వెంటనే ఆ వ్యక్తికి వ్యతిరేకంగా ఖడ్గాన్ని తీసుకొని నిలబడిపోండి" అనేది ఆ సూత్రం. నిస్సందేహంగా ఈ సూత్రం, ఇస్లాం శ్రేయస్కర ధృక్పథానికి పూర్తిగా వ్యతిరేకమైన సూత్రం.

ఒకవేళ ఎవరైనా ఒకవ్యక్తి మీ ప్రవక్తకు వ్యతిరేకంగా ఏదైనా ఒకమాట పలికితే, మీరు ఆ వ్యక్తిని కలిసి, అతని అసలు అభిప్రాయం ఏమిటో తెలుసుకోవటమే, సందేశకార్యం మీ నుండి కోరే కోరిక. ఆ తరువాత మీరు  రుజువులతోసహా మీ మాటను అతనికి తెలియజేయాలి. అతని ఆలోచనను సరిదిద్దటానికి

కృషిచేయాలితప్ప, అతని తలను అతని శరీరం నుండి వేరుచేయటానికి కాదు. శాంతియుత విధానం(peaceful method)మాత్రమే జీవితపు సరైన విధానం. దూకుడు, బలవంతం మరియు ద్వేషం వంటి విధానం, సదాచరణకు వ్యతిరేకమైన విధానం.

# 5. నిష్ఫల కార్యాచరణ

అమెరికాకు చెందిన ఒక చలనచిత్ర పరిశ్రమ ఒక చలనచిత్రాన్ని రూపొందించింది. దానిపేరు: "ముస్లింల అమాయకత్వం". సెప్టెంబర్ 2012లో ఈ చిత్రానికి సంబంధించిన ఒక చిన్న భాగాన్ని అంతర్జాలంలో ఆవిష్కరించటం జరిగింది. కొందరు ముస్లింలు దానిని చూసారు. ఆ తరువాత వారిలో పెద్దయెత్తున దీనిపై వివాదం తలెత్తి, ఈ చిత్రంలో రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించటం జరిగిందని గ్రహించి, యావత్ ముస్లిం ప్రపంచం ఒక్కసారిగా భగ్గుమంది. అలాగే వివిధ దేశాల్లో ఈ చిత్రానికి వ్యతిరేకంగా దూకుడుతో కూడుకున్న నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా ధనప్రాణాల నష్టం అత్యధికంగా సంభవించింది.

న్యూడిల్లీ నుండి వెలువడే ఆంగ్లపత్రిక టైంస్ ఆఫ్ ఇండియా(14.09.2012)లో ఒక రిపోర్ట్ ప్రచురింపబడింది. ఆ రిపోర్ట్లోని కొంతభాగం ఈవిధంగా ఉంది:"వాస్తవమేమిటంటే, కేవలం కొందరు వ్యక్తులు మాత్రమే ఆ చిత్రాన్ని కొన్ని నిమిషాలకన్నా ఎక్కువగా చూసిఉంటారు. అలాగే ఆ చిత్రం ఎప్పుడు పూర్తవ్వుద్దో కూడా ఎవరికీ తెలియదు. కాని ఆ చిత్రానికి సంబంధించిన కొంతభాగాన్ని మాత్రమే అంతర్జాలంలో పెట్టటం జరిగింది. అదికూడా ఎంతటి చెత్త(unprofessional) చలనచిత్రమంటే, ఏ ఒక్కరుకూడా దాన్నిచూసి ఇష్టపడరు. కాని ముస్లింల గుంపులు మాత్రం ఆ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా మంచి పేరును తెచ్చిపెట్టేసాయి - (page:26)

ఈవిధమైనటువంటి (ఫిత్నా)ఉపద్రవాన్ని ఖురాన్ గ్రంథం 14:26లో "చెడుజాతి వృక్షం" అని చెప్పటం జరిగింది. అంటే, ఆ ఉపద్రవం దానికదే అంతమైపోతుందని అర్థం. ఇటువంటి ఉపద్రవ(ఫిత్నా) పరిస్థితుల్లో వివేకవంతమైన పని ఏమిటంటే, దానిని పట్టించుకోకపోవటమే(take it easy). ఏదైతే దానికదే నశించిపోతుందో, దానిని చంపటానికి ఎందుకు కృషిచేయాలి? కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ముస్లింలు ప్రతిసారి ఇటువంటి మూర్ఖపు వ్యవహారాలకు బలైపోతున్నారు. ఈ వాస్తవాన్నే ఉమర్ ఫారూఖ్ ఈవిధంగా చెప్పారు: "అసత్యాన్ని నశింపజేయండి, దాని విషయంలో నిశ్శబ్దంగా ఉంటు".

# 6. ప్రవక్త దూషణా వ్యవహారం

2012 సెప్టెంబర్ నెలలో అమెరికాలో ఒక చలనచిత్రాన్ని విడుదల చేయటం జరిగింది. దానిపేరు: "ఇన్నోసెన్స్ ఆఫ్ ముస్లింస్"(ముస్లింల అమాయకత్వం). ముస్లింల ప్రకారం, ఆ చిత్రంలో ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ను కించపరిచే సన్నివేసాలు చూపించ బడ్డాయి. ఆ తరువాత యావత్ ప్రపంచంలోని ముస్లింలు ఆగ్రహోదగ్రులైపోయారు. తూర్పు నుండి పడమర వరకు ప్రతిచోటా దానికి వ్యతిరేకంగా దూకుడుతో కూడుకున్న ప్రదర్శనలు వెల్లువెత్తాయి. ప్రతిప్రాంతం కూడా నిరసన ప్రదర్శనలతో మరియు ప్రసంగాలతో ఉద్రూతలూగింది. ఎక్కడెక్కడైతే వీరు ప్రదర్శనలు నిర్వహించారో, అక్కడక్కడ ఈ క్రింది నినాదాలతో ప్రదర్శనా పత్రాలను (placards)ప్రదర్శించటాన్నిబట్టి, ఆ ప్రదర్శనలు ఎటువంటివో మనం అర్థం చేసుకోవచ్చు.

Obama, Obama, we like Osama!

Behead all those who insult the Prophet!

Insulting the Prophet is insulting 1.5 billion Muslims!

The Prophet is dearer to us than our lives!

ఓబామా, ఓబామా, మా ప్రియుడు ఉసామా!

ప్రవక్తను అవమానపరచిన ప్రతివాని తలను నరికివేయండి!

ప్రవక్తను అవమానపర్చటం నూటయాభై కోట్ల ముస్లింలను అవమానపరచటమే!

మా జీవితాలకన్నా ప్రవక్తే మాకు అత్యంత ప్రియుడు! వంటి నినాదాలు ప్రదర్శించబడ్డాయి.

ఈ సందర్భంగా ప్రపంచంలోని వివిధ దేశాల్లో దూకుడుతో కూడుకున్న ఏ ప్రదర్శనలైతే జరిగాయో, వాటిలో 28.09.2012లో పాకిస్తాన్లో "ప్రవక్త ప్రేమాదినోత్సవం" పేరుతో ఒక ప్రదర్శన నిర్వహించటం జరిగింది. దీనికి సంబంధించిన రిపోర్టు, లాహోర్ నుండి వెలువడే వారపత్రిక సండే మేగజైన్ నవాయే వఖ్త్ (30.09.2012)లో ప్రచురించబడింది. ఆ రిపోర్ట్లోని కొన్ని భాగాలను ఇక్కడ పేర్కొనటం జరిగింది. "పాకిస్తాన్ జాతీయులు శుక్రవారాన్ని "ప్రవక్త ప్రేమా దినోత్సవం"గా నిర్వహించారు. అవమానకరమైన ఆ

అమెరికా చలనచిత్రానికి వ్యతిరేకంగా "ప్రవక్త ప్రేమాదినోత్సవం"సందర్భంగా ప్రజలు నిర్వహించిన నిరసనప్రదర్శనల్లో అసాధారణమైన రీతిలో విధ్వంసకాండతోపాటు హింసాకాండ కూడా చోటు చేసుకుంది. ఈ హింసాకాండలో కేవలం ఒక్క శుక్రవారం రోజునే 32 మంది మరణించటమే కాకుండా సుమారు 200 మంది గాయపడ్డారు. కరాచీలో 5 సినిమాహాళ్ళు, 3 బ్యాంకులు అలాగే లెక్కలేనన్ని దుకాణాలు లూటీ చేయబడి, చివరికి అగ్నికి ఆహూతి అయిపోయాయి, వాహనాలు ధ్వంసం చేయబడ్డాయి, ప్రజలపై లాఠీలు కురిపించబడ్డాయి, పోలీసువారి 4 సంచార వాహనాలతోపాటు, కవచాలతో ఉండే వాహనాలుకూడా దహించివేయబడ్డాయి. ఈ సందర్భంగా ఆసుపత్రులపై కూడా దాడులు జరిగాయి. అంతేకాకుండా కోట్లాది రూపాయల ఆస్తులు బూడిదైపోయాయి" - (4వ పేజి)

"ప్రవక్తదూషణ" విషయంలో ముస్లింల తరపున ప్రతి ప్రాంతంలో, ఇటు పాకిస్తాన్లోనూ మరియు ఇతర దేశాల్లోనూ హింసాకాండ చోటుచేసుకుంటుంది. ఈ దుర్ఘటనలకు సంబంధించిన వార్తలు ప్రింట్ మీడియాలోనూ ఎలెక్ట్రానిక్ మీడియాలోనూ ఖచ్చితంగా వస్తాయి. ఈ పరిస్థితిని చూసి, యావత్ ప్రపంచంలో ఒక ప్రశ్న తలెత్తుతుంది. అదేమిటంటే, "శాంతియుత దూషణకు జవాబుగా హింసాయుత దూషణకు స్వతహాగా ముస్లింలు ఎందుకు ఒడిగడుతున్నారు?" ప్రవక్త ఔన్నత్యాన్ని కించపరిచేవాడు కేవలం ఒక పుస్తకాన్ని ప్రచురించటమో లేక ఒక కార్టూన్ను వేయించటమో లేక ఒక చలనచిత్రాన్ని నిర్మించి దానిని అంతర్జాలంలో వేయటమో చేస్తున్నాడు. ఇలాచేయటం ఒకవేళ దూషణగా భావించబడితే, అప్పుడది నిస్సందేహంగా శాంతియుత దూషణగా భావించబడుతుంది. కాని దీనికి జవాబుగా ఏ కార్యాచరణ అయితే ముస్లింలు చేపడుతున్నారో, అది, అత్యంత స్పష్టంగా "హింసాయుత కార్యాచరణ" లేక "హింసాయుత దూషణ"గా పరిగణింపబడుతుంది.

కలియుగపు ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ ఏ ధర్మశాస్త్రాన్నైతే ప్రసాదించారో, దానిలో అత్యంత స్పష్టంగా ఇటువంటి పరిస్థితుల్లో ఒకసూత్రాన్ని చూపించారు. అది, ప్రతికారన్యాయపు సూత్రం (2:178). అంటే సరిసమానమైన బదులు(Equal Retribution)అని అర్థం. ఈ బదులుకు సంబంధించిన పరిచయం ఖురాన్ గ్రంథంలో ఈవిధంగా చేయబడింది: "ఒకవేళ మీరు ప్రతికారం తీర్చుకుంటే, కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతికారం తీర్చుకోండి..."(16:126). ఇటువంటిదే మరో వాక్యాన్ని కూడా చూడండి: "చెడుకు ప్రతిక్రియ అదేరకమైన చెడు. కాని ఎవరైనా క్షమించి రాజీపడితే, దానికి ప్రతిఫలం ఇవ్వటం సర్వేశ్వరుని బాధ్యత. దుర్మార్గులంటే, ఆయనకు ఇష్టంలేదు"(42:40).

# 7. రెండు ఎంపికలు (Two Options)

పై ప్రస్తావిత ఖురాన్ వాక్యాలనుబట్టి అర్థమౌతున్న విషయమేమిటంటే, ఇటువంటి పరిస్థితుల్లో ఇస్లాం అనుయాయులకు రెండిటిలో ఒకఎంపిక(option)చేసుకునే అవకారం ఉంది. అందులో ఒకటేమిటంటే, క్షమించి సహనం వహించటం. రెండవది, బదులు తీర్చుకోవటం. ఇటువంటి పరిస్థితుల్లో ముస్లింలు ఈ రెండిటిలో కేవలం ఒక దానిని మాత్రమే ఎంపిక చేసుకోవాలి. అంతేతప్ప, ఇక మూడవ ఎంపిక(option) ఏమాత్రం వీరికోసం ధర్మసమ్మతం కాదు. హతమార్చే విషయంలో కూడా ఇస్లామియా ధర్మశాస్త్రం (షరియత్)ఒక నిర్వివాద చట్టాన్ని నిర్దేశిస్తుంది. అదేమిటంటే, యుద్ధసందర్భంలో కూడా కేవలం యుద్ధంలో పాల్గొన్న వ్యక్తి(combatant)నే హతమార్చాలితప్ప, యుద్ధంలోలేని వాళ్ళను(non-combatant)ను హతమార్చటం ధర్మవిరుద్ధం. కాబట్టి ఇటువంటి సందర్భంలో, అమాయకులైన ప్రజలను హతమార్చమని ఇస్లాం ఏవిధంగా అనుమతిస్తుందని?

ఇక్కడ, క్షమించి సహనం వహించండనే ఏ ఎంపిక(option)/ఆజ్ఞ అయితే ఉందో, దానిని, జరిగిన దుర్ఘటన(ప్రవక్త దూషణ)ప్రాతిపదికన చూడకుండా, దూషణకర్త యొక్క సంస్కరణా ప్రాతిపదికన చూడాలనేది. ఎవడైతే ఈ దూషణకు పాల్పడ్డాడో, అతడు కూడా ఒక మనిషేఅని, ఏవిధంగానైతే ఇతరుల నైజం ఉంటుందో, అదేవిధంగా ఇతని నైజం కూడ అలాగే ఉంటుందని మీరు భావించాలి. ఈవిధంగా మీరు శ్రేయోభిలాషతో కూడుకున్న పద్ధతిలో అతని నైజాన్ని ప్రభావితం చేయటానికి తీవ్ర కృషిచేయాలి. బహుశా అప్పుడు అతని సంస్కరణ జరిగి, పశ్చాత్తపం చెంది, అతడు సర్వేశ్వరుని ఆ సద్భక్తుల్లో చేరిపోవచ్చు.

ఖురాన్ ప్రకారం ఇక రెండవ ఎంపిక(option)ఖిసాస్. అంటే, బదులు తీర్చుకోవటం. ఇదొక చట్ట పరమైన అనుమతి మాత్రమే. అయితే, ఇటువంటి విషయంలో ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ యొక్క ఆదర్శం ఏమిటంటే, క్షమించివేసి సహనం వహించటం. ఎందుకంటే, ఈ విధానమే మహోన్నతమైంది మరియు సర్వేశ్వరునికి కూడా అత్యంత ప్రీతిపాత్రమైంది కాబట్టి -(42:43).

గాయాలు(harm)రెండు రకాలు. ఒకటి శారీరక గాయం(physical harm)అయితే, రెండవది మానసిక గాయం(psychological harm). ఈ రెండు రకాల గాయాలు పరస్పరం భిన్నమైనవి.

ఖురాన్లో ప్రస్తావించబడిన వాక్యాల ప్రకారం, శారీరక గాయం విషయంలో, బదులు తీర్చుకోవటం లేక క్షమించివేయటం అనే రెండు ఎంపికలు (options) ఉన్నాయి.

మనకు ఎవరు ఎంత నష్టం తలపెడితే, మనం కూడా వారికి అంతే నష్టాన్ని కలిగించటాన్ని ఖిసాస్ అంటారు. దీనికి బదులుగా, క్షమించివేయటమంటే, ఏకపక్షంగా సహనం వహించటమే కాకుండా ప్రత్యర్థికి వ్యతిరేకంగా ఏవిధమైన కార్యాచరణను చేపట్టకపోవటంతోపాటు, కనీసం నోటితో అతని విషయంలో ఫిర్యాదు చేయటంగాని లేక నిదర్శన ప్రదర్శనలు చేపట్టటంగాని చేయకూడదు. ఇస్లామియా ప్రబోధనల ప్రకారం, శారీరక గాయం విషయంలో విశ్వాసుల కోసం రెండు ఎంపికలు ఉన్నాయి. కాని, మానసిక గాయం విషయంలో విశ్వాసుల కోసం కేవలం ఒకే ఒక ఎంపిక (option) ఉంది, అదే సహనం.

# 8. ఖిసాస్(ప్రతికార)సూత్రం

పైన పేర్కొన్నట్టు, ఇటువంటి వ్యవహారాల్లో ఖిసాస్ను ఎంచుకోవటమనేది(ప్రతికారం తీర్చుకోవటమనేది) రెండవ ఎంపిక(option)గా పరిగణింపబడుతుంది. ఒకవేళ ముస్లింలు ఈ ఖిసాస్ విధానాన్నేగనుక ఎంచుకున్నట్లైతే, వారు ఖచ్చితంగా, తమ ప్రత్యర్థి ఎంతమేరకు నష్టం కలిగించాడో, వారు కూడా కేవలం అంతమేరకే ప్రత్యర్థికి నష్టం కలిగించాలి. ఎవరైన ఒకవ్యక్తి ఒక పుస్తకాన్ని రచించి, తమకు గాయపరిస్తే, ముస్లింలు కూడా దానికి జవాబుగా మరో పుస్తకాన్ని రచించి, అతనికి సమాధానం ఇస్తూ ప్రతికారం తీర్చుకోవాలి. ఒకవేళ ఏదైన ఒకవ్యాసం రాసినా లేక ఏదైనా ఒక కార్టూన్ ప్రచురించినా, అప్పుడు ముస్లింలు, తమ లక్ష్యాన్ని వివరిస్తూ మరో వ్యాసాన్ని ప్రచురింపజేయాలి. అలాగే ఒకవేళ ఎవరైనా ఒకవ్యక్తి వేదికపై నిలబడి ప్రశంగిస్తే, అప్పుడు ముస్లింలు కూడా వేదికపై నిలబడి, దానికి జవాబు ఇవ్వాలి. ఒకవేళ ఎవరైనా పత్రికాప్రకటన ఇస్తే, అదేవిధంగా అతనికి పత్రికాప్రకటన ద్వారా రుజువులతో కూడిన సమాధానం ఇవ్వాలి. ఇటువంటి పరిస్థితుల్లో ఒకవేళ ముస్లింలు గనుక రుషీశ్వరడైన ముహమ్మద్ ఆదర్శం ప్రకారం క్షమాగుణం కలిగి సహనం వహించలేకపోతే, అప్పుడు ఇస్లామియా షరియత్ ప్రకారం, ముస్లింలకు ఉన్న హక్కు ఏమిటంటే, కలానికి జవాబు కలంతోనే ఇవ్వటం, ఉపన్యాసానికి జవాబు ఉపన్యాసంతోనే ఇవ్వటంతప్పా, కలానికి జవాబు హింసాయుత నిరసన ప్రదర్శనలతో ఇవ్వటంగాని లేక శాంతియుత విమర్శలకు విధ్వంశకాండతో ఇవ్వటంగాని చెయ్యటమనేది ధర్మనిషిద్ధం(హరాం)దృష్ట్యా నిస్సందేహంగా ఖండనార్హం. రుషీశ్వరుడైన ముహమ్మద్ మరియు అతని అనుయాయుల ఆదర్శం ద్వారా ఇదేవిధానం నిరూపణ అవుతుంది. రుషీశ్వరుని కాలంలో అతని శత్రువులు, అతనిని భారీఎత్తున దూషిస్తూ హింసించారనే విషయం మనందరికి తెలిసిందే. కాని రుషీశ్వరుడుగాని, అతని అనుయాయులుగాని ఏనాడూ వాటికి జవాబుగా నిరశన ప్రదర్శనలుగాని లేక హంగామ సృష్టించటం గాని చేయలేదు. దానికిబదులుగా, హసాన్ బిన్ సాబిత్ అన్సారి తన కవిత్వాలతో వారి చేష్టలకు సమాధానం ఇచ్చేవారు. మనం గ్రహించవలసిన విషయమేమిటంటే, ఏవిధంగానైతే ఈనాడు జర్నలిజం ప్రముఖపాత్ర పోషిస్తుందో, అదేవిధంగా ఆనాడు కవిత్వం అనేది అభిప్రాయ ప్రకటనకు అత్యంత పటిష్టమైన మాధ్యమంగా అలరారుతుండేది.

# 9. శాంతియుత నిరసన

"నిరసన(protest)అనేది మా జన్మహక్కు. కాబట్టి ఇటువంటి పరిస్థితుల్లో ముస్లింలు తప్పకుండా నిరసనను ప్రదర్శించాలి, అయితే అది శాంతియుతంగా జరగాలి" అని కొందరు వాదిస్తుంటారు. కాని, శాంతియుతంగా జరగాలని ఏ షరతైతే వీరు పెడుతున్నారో అది ఎన్నటికీ కార్యరూపం దాల్చని షరతు. సామూహిక నిరసన ప్రదర్శనల్లో ఒకటి, చెడుగా ప్రవర్తించటం జరుగుతుంది. లేదంటే, ఆ శాంతియుత ప్రదర్శనకాస్తా ఒకానొక సందర్భంలో ప్రజలను కోపోద్రేకులుగా మార్చివేసి, వెంటనే హింసాయుత ప్రదర్శనగా మారిపోతుంది. ప్రారంభంలోనైతే అదొక శాంతియుత ప్రదర్శనగానే మొదలౌతుందికాని, చివరికది విధ్వంసకాండకు దారితీస్తుంది. దానికి చక్కటి ఉదాహరణ పాకిస్తాన్లో జరిగిన నిదర్శన ప్రదర్శనలే సజీవ సాక్ష్యం.

ఒకవేళ ఏదైనా ఒక నిరసన ప్రదర్శన  ఆద్యాంతమూ శాంతియుతమైన షరతులపైనే కొనసాగినప్పటికీ, నిస్సందేహంగా అదొక ఉపద్రవానికి దారితీస్తుంది. ఎందుకంటే, దాని పర్యవసానంగా పరస్పర విద్వేషమనే తీవ్రమైనచెడు జనిస్తుంది. విద్వేషమనేది నిస్సందేహంగా ఒక నిష్క్రియాత్మక హింస(passive violence)కు దారితీస్తుంది. హింస అనేది ఒక బాంబు (విస్పోటనం)వంటిదైతే, విద్వేషం అనేది ఒక టైంబాంబు(time bomb)వంటిదనే విషయం, నిరూపితమైన ఒక వాస్తవం.

# 10. నిరసన ప్రదర్శనల హక్కు

"రుషీశ్వరుని దూషణ" విషయంలో యావత్ ప్రపంచ ముస్లింలు అత్యంత ఉత్సాహంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. దీనికి సమర్ధనగా ముస్లింలు, "మానవహక్కుల(human rights)సార్వత్రిక సూత్రం ప్రకారం, నిరసన ప్రదర్శనలనేవి ఒక సమంజసమైన మా హక్కు" అని అంటున్నారు.

రోడ్లపై నిరసన ప్రదర్శనలు నిర్వహించటమనేది సాధారణమైన విషయం కాదు. మనం ఒకవేళ లోతుగా ఆలోచించినట్లైతే, రుషీశ్వరుడైన ముహమ్మద్గాని లేక అతని అనుయాయులుగాని చేపట్టని ఒక దుశ్చేష్ట అని అర్థమౌతుంది. ఈనాడు ముస్లింలు ఎలాంటి ఘటనలపై వివిధ ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారో, అటువంటి ప్రతికూల ఘటనలు స్వయంగా రుషీశ్వరుని కాలంలో మరింత తీవ్రస్థాయిలో ఆయనకు ఎదురయ్యాయి. ఉదాహరణకు, పవిత్ర కాబా గృహంలో దైవేతరారాధకుల తరపున వేలాది సంఖ్యలో విగ్రహాలను ప్రతిష్టించటం, ఆయనను బహిరంగంగా వెర్రివాడు అని నిందించటం వంటి చేష్టలు చేసేవారు. కాని ఏనాడూ ఆయనగాని లేక అతని అనుయాయులుగాని వారికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనల విధానాన్ని చేపట్టినట్లు హదీసు లేక జీవితచరిత్ర గ్రంథాల్లో ఎక్కడా మనకు కానరాదు. దీనినిబట్టి, నిరసన ప్రదర్శనల విధానం ఎట్టిపరిస్థితుల్లోకూడా ఇస్లామియా విధానం కాదని అత్యంత స్పష్టంగా మనకు తెలుస్తుంది.

అటువంటప్పుడు, ఈ నిరసన ప్రదర్శనల విధానం ముస్లింలకు ఎక్కడ నుండి దొరికిందని? ఈ విధానాన్ని ముస్లింలు మానవహక్కుల ఆధునిక షరియత్(చట్టం)నుండి గ్రహించారు. ఇది, మానవ నిర్మిత షరియత్కు(చట్టానికి)సంబంధించిన ఒక ప్రకరణ(article). 1948లో UNO కు సంబంధించిన ప్రపంచవ్యాప్త తీర్మానం(universal declaration) ప్రకారం దీనిని రూపిందించటం జరిగింది.

జీవితానికి సంబంధించి రెండు విధానాలున్నాయని ఖురాన్లో పేర్కొనటం జరిగింది. అందులో ఒకటి, సర్వేశ్వరుని శరణులో జీవించటం. ఇక రెండవది, మానవుల శరణులో జీవించటం (3:112). ఏదైన ఒక జాతికి దైవశరణులో జీవితం గడిపే భాగ్యం లభించటమనేది, అత్యంత మహత్భాగ్యం. అలాగే మానవుల శరణులో జీవించే భాగ్యం లభించటమనేది, దీనికి భిన్నమైనది. ఖురాన్లో, దైవశరణ్యానికి మరియు మానవ శరణ్యానికి సంబంధించిన పదాల ప్రస్తావన ఒక జాతియొక్క భిన్నమైన రెండు పరిస్థితులను సూచిస్తుంది. రుషీశ్వరుని అనుచర సంఘంపు ఒక స్థితి ఏమిటంటే, అది, తనలో దైవభీతి పరాయణతను కలిగియుండి,

దైవాదేశాలను(ఖురాన్ మరియు సున్నత్లను)తన ఆచరణగా చేసుకుంటుంది. ఇక మానవ శరణ్యంలో జీవించటమంటే, ఆ అనుచర సంఘం దైవభీతి పరాయణతకు దూరంగా ఉంటూ, తన కోరికల పరిపూర్తికి(19:59)కావలసిన విధానాన్ని, దైవమార్గదర్శకత్వాన్నుండి గ్రహించటానికి బదులు మానవ నిర్మిత మార్గదర్శకత్వాన్నుండి గ్రహిస్తుంది.

దైవశరణ్యానికి మరియు మానవశరణ్యానికి మధ్యన, ఖురాన్ చూపిస్తున్న ఈ వ్యతాసాన్ని దృష్టిలో పెట్టుకొని చూసినట్లైతే, మనకు తెలుస్తున్న విషయమేమిటంటే, ప్రస్తుత కాలంలోని ముస్లింలు, తమ నోటితో "ఈవిషయంలో మేము దైవశరణ్యానికి బదులు మానవశరణ్యంలో ఉన్నాము" అని స్వయంగా ప్రకటిస్తున్నారనేది. మార్గం తప్పిన స్వభావం ఆధారంగా వారు, తమ నిరసన ప్రదర్శనల విధానాన్ని సమర్థించుకోవటానికి, దైవశరణ్యానికి బదులు మానవశరణ్యాన్నుండి గ్రహిస్తున్నారు. అలాగే వారు, చెడిపోయిన తమ నైజాన్ననుసరించి, తమ ఇస్లామేతర ప్రవర్తనను సమర్థించుకోవటానికి దైవశరణ్యం నుండి కాక, తమ జాతీయ ప్రయోజనాలకు అణుగుణంగా ఉన్న మానవశరణ్యం నుండి ఆధారాన్ని చూపిస్తున్నారు. ఇటువంటి విధానాన్నే ఖురాన్ గ్రంథంలో గొంతెమ్మ కోరికల అనుసరణ అని చెప్పటం జరిగింది.

ఇదేదో సాధారణమైన విషయం ఎంతమాత్రం కాదు. ఖురాన్లో చెప్పబడిన ఈ 3:112 వాక్యాన్ని పరిశీలించి చూసినట్లైతే, ఏ వర్గమైతే తాను జీవించే హక్కును ఆ సర్వేశ్వరునికి బదులుగా మానవుల నుండి అర్థిస్తుందో చూపించటం జరిగింది. అయితే ఇదెంతో తీవ్రమైన విషయం. ఈవిధంగా ముస్లింలు తమకుతాము స్వయంగా ఆయావర్గాలతో(జాతులతో)సరిపోల్చుకుంటున్నారు, ఏఏ వర్గాలనైతే దైవాగ్రహానికి గురై, దైవశాపానికి బలైపోయిన జాతులుగా వారు స్వయంగా ప్రకటిస్తారో.

# 11. హుందాగా వైదొలగటం (Tolerance)

ఖురాన్ గ్రంథంలోని 73:10వ వాక్యం ఈవిధంగా ఉంది: "లోకులు కల్పించే మాటలపట్ల సహనం వహించి, హుందాతనంతో వారినుండి వైదొలగిపో" అని రుషీశ్వరుడైన ముహమ్మద్కు చెప్పటం జరిగింది. ఈ వాక్యం, రుషీశ్వరుని మక్కా కాలంలో అవతరించింది. అప్పుడక్కడ ద్వైవేతరారాధకుల (ముష్రిక్కుల)ఆధిపత్యం ఉండేది. ప్రవక్త మరియు అతని అనుయాయులు తమ పూర్వీకుల మతం నుండి వైదొలగిపోయారని ఆ ముష్రిక్కులు భావించేవారు. కాబట్టే వారు, రుషీశ్వరుణ్ణి మరియు అతని అనుయాయులను కూడా అనేక విధాలుగా బాధించేవారు. అప్పుడే ఈ ఖురాన్ వాక్యాలు అవతరించాయి. "మీరు సహనం వహిస్తూ హుందాతనంతో వైదొలగిపోయే విధానాన్ని అవలంభించండి" అనే ఆజ్ఞ ఈ వాక్యాల్లో ఇవ్వటం జరిగింది.

హుందాగా వైదొలగిపో అనే పదానికి అక్షరార్థం ఈవిధంగా ఉంది:"అందమైన పద్ధతిలో విడిచి పెట్టేయటం"అని. అంటే, మిమ్మల్ని బాధించే వాళ్ళతో మంచిగా వ్యవహరించండని అర్థం. వాళ్ళ విషయంలో మీ ప్రవర్తన ప్రతికూలమైందిగా కాకుండా, అనుకూలమైందిగా ఉండాలి. అంతే కాకుండా మీరు వారిని క్షమిస్తూ ఉండాలి. వారు మీతో చెడుగా ప్రవర్తించినప్పుడుల్లా, మీరు వారితో మంచిగా ప్రవర్తిస్తూఉండాలి అనేది.

"సహనం వహిస్తూ, హుందాతనంతో వైదొలగిపోండి" అనే దైవాజ్ఞ, "వారితో యుద్ధం చేయండి"అనే ఆజ్ఞ వచ్చిన తరువాత రద్దైపోయిందని చాలామంది వ్యాఖ్యానకర్తలు వ్యాఖ్యానించారు. కాని ఇదొక తప్పుడు వ్యాఖ్యానం మాత్రమే. హుందాగా వైదొలగిపోవటం (సత్ప్రవర్తన)అనేది, అదొక బలహీనత ఎంతమాత్రం కాదు. అదొక దైవభక్తుల అనుకూల ప్రవర్తన. వాస్తవమేమిటంటే, ఒక దైవదాసుడు ప్రతికూల కార్యాచరణను ఎన్నటికీ సహించలేడు. ఫిర్యాదుల మనస్తత్వం, కృతజ్ఞతాభావాన్ని సంహరించేస్తుంది. అందుకే ఒక నిజమైన దైవదాసుడు ఫిర్యాదుల భావోద్వేగాన్ని ఏకపక్షంగా తృంచివేసి, తనలో జీవిస్తున్న కృతజ్ఞతాభావం మరణించకుండా కాపాడుకుంటాడు. ఇదేవిధంగా, ద్వేషమనస్తత్వం కూడా ప్రేమ భావోద్వేగాలను హతమార్చేస్తుంది. అందుకే ఒక నిజమైన దైవభక్తుడు, ద్వేషమనస్తత్వం తనలో వర్ధిల్లకుండా చూసుకుంటాడు. ఎందుకంటే, అతనిలో ఆ సర్వేశ్వరుని ప్రేమ భావోద్వేగం సంపూర్ణంగా నిలిచిఉండాలి కాబట్టి. ఈ కార్యాన్ని ఒకొక్కప్పుడు ఎంతో బలవంతంగా చేయవలసిఉంటుంది, మరోకప్పుడు చక్కటి ప్రణాళిక(విజ్ఞత)తో చేయవలసి ఉంటుంది. హుందాగా వైదొలగటం(సులక్షణం)

అనేది, చూడటానికి ఇతరులకు సంబంధించినదిగా కనబడుతుంది. కాని దాని సంబంధం స్వయంగా తనతోనే ఉంటుంది. తనలో ఉన్నతమైన ఇస్లామీ అనుభూతి స్థిరంగా ఉండాలని ఒక దైవభక్తుడు ఎల్లప్పుడు భావిస్తూ ఉంటాడు. ఎట్టిపరిస్థితుల్లో కూడా ఈ అనుభూతి తగ్గకూడదని కూడా భావిస్తాడు.

ఖురాన్ ప్రకారం, ఆ సర్వేశ్వరుడు ఏ వ్యక్తిలో కూడా రెండు మనస్తత్వాలను పెట్టలేదు(33:4). అంటే, మనిషి హృదయంలో ఒకేసందర్భంలో రెండు భిన్నమైన వ్యక్తిత్వాలు వికశించజాలవు. ఏ హృదయమైతే మనిషి విషయంలో ద్వేషం కలిగిఉంటుందో, అదే సందర్భంలో అది దేవుణ్ణి కూడా ప్రేమించజాలదు. అలాగే ఏ హృదయంలోనైతే మనిషి విషయంలో ఫిర్యాదు(ఆరోపణ)లు నిండిఉంటాయో, ఆ హృదయం ఎన్నటికీ దైవకృతజ్ఞతతో నిండిఉండదు. ఏ మనిషి హృదయమైతే ప్రతికార భావాల కీకారణ్యంగా మారిపోతుందో ఆ హృదయం, సర్వేశ్వరునితో క్షమాపణను వేడుకోవటంలో ఉన్న మాధుర్యాన్ని ఆశ్వాదించజాలదు. అలాగే, ఏ వ్యక్తైతే దౌర్జన్యపు జ్ఞాపకాల్లో జీవిస్తుంటాడో, ఆ వ్యక్తి, కరుణామయుడైన ఆ సర్వేశ్వరుని జ్ఞాపకాల అనుభూతిని అనుభవించజాలడు.

వాస్తవమేమిటంటే, సహనం మరియు సత్ప్రవర్తనలనేవి, ఒక దైవభక్తునికి స్వీయరక్షణా కవచాలుగా ఉపయోగపడతాయి. తన హృదయంలో భక్తేతర భావాలు తాండవించకుండా అవి కాపాడుతూ ఉంటాయి. కాబట్టి, ఎప్పుడైతే ఇటువంటి దుర్ఘటనలు సంభవిస్తాయో, అప్పుడు ఆ దైవభక్తుడు, "నేను ఇటువంటి ప్రతికూల ఆలోచనలను సహించలేను" అని వెలుగెత్తి ప్రకటిస్తాడు. అయితే ఈ విషయంలో మరింత వివరణకోసం రుషీశ్వరుని మరియు అతని అనుయాయుల జీవితాల నుండి హుందాతనానికి సంబంధించిన కొన్ని కార్యాచరణల ఉదాహరణలను ఇక్కడ పొందుపరచటం జరిగింది.

1. ఇబ్నె ఇస్హాఖ్ ఉల్లేఖనం ప్రకారం, ఆ కాలం నాటి మక్కా ఖురైషులు రుషీశ్వరుడైన ముహమ్మద్ను ఎగతాళి చేస్తూ దూషించేవారు. ఈ సందర్భంగా వారు, ప్రవక్తవారిని ముహమ్మద్ అనే పేరుకు బదులు, ముజమ్మం అని పిలిచేవారు. ముహమ్మద్ అంటే, పొగడబడినవాడు అని అర్థం. ముజమ్మం అంటే, ఖండించబడినవాడు అని అర్థం. ఇదే ఉల్లేఖనం ప్రకారం, దానికి జవాబుగా రుషీశ్వరుడైన ముహమ్మద్ ఈవిధంగా జవాబు ఇచ్చారు: "ఆ సర్వేశ్వరుడు నన్ను ఏవిధంగా ఈ ఖురైషుల ఆగడాల నుండి రక్షించాడో అనే విషయం మీకు ఆశ్చర్యం కలిగించటంలేదా? వారు శపిస్తూ ముజమ్మం అని ఎగతాళి చేస్తున్నారు, వాస్తవానికి నేనైతే ముహమ్మద్ను"(సీరత్ ఇబ్నె హిషాం 356 / 1)

రుషీశ్వరుని ఈ పదాలను ఈవిధంగా అర్థం చేసుకోవచ్చు: ఉదాహరణకు ఖురైషులు, "ముజమ్మం పిచ్చివాడు"అని అన్నప్పుడు, ప్రవక్తవారు దాని ప్రతికూల ప్రభావాన్ని తీసుకోకుండా, "మీ ఈ మాటలు ముజమ్మం అనే పేరుగల వ్యక్తికే చెందుతాయి. నా పేరైతే మాత్రం ముహమాద్ కదా!" అని ఖురైషుల మాటలను త్రిప్పికొట్టారు. అయితే, ఇదొక హుందాతనానికి సంబంధించిన ఒక సున్నితమైన ఆదర్శం. ఈవిధంగా ఒక దైవభక్తుడు, ఇతరుల చెడుమాటల ద్వారా జనించే ప్రతికూలభావాల నుండి తనకుతాను రక్షించుకుంటాడు. అలాగే, "నేను ప్రతికూల భావోద్వేగాలను ఎప్పటికీ సహించలేను"అని కూడా ఆ భక్తుడు ప్రకటిస్తాడు.

ఇటువంటి హుందాతనానికి సంబంధించి ఆశక్తికరమైన ఒక సంఘటన డాక్టర్ జాకిర్ హుస్సైన్ (మాజీ రాష్ట్రపతి) (1897-1969)లో మనకు కనబడుతుంది. ఒకరోజు ఆయనగారు ఢిల్లీలోని ఒక రోడ్డుపై తన వాహనంలో వెళుతుండగా యాదృచ్ఛికంగా మరోవ్యక్తి వాహనాన్ని ఢీకొట్టటం జరిగింది. అప్పుడా వాహనం కొద్దిగా దెబ్బతింది. ఆ వాహనం అప్పుడే కొనుగోలు చేసిన వాహనం కాబట్టి, వెంటనే ఆ అవతలి వ్యక్తి దిగిపోయాడు. జాకిర్ గారు కూడా తన వాహనం నుండి దిగిపోయారు. అప్పుడా వ్యక్తి కోపంతో జాకిర్ గారిని "idiot" అనేసాడు. అంటే మూర్ఖుడా అని అర్థం. కాని జాకిర్ గారు మాత్రం కోపాన్ని ప్రదర్శించకుండా అతని తిట్టును వినీవిననట్లు వదిలేసి, ఎంతో వినమ్రతతో, "Sir, Iam not Mr.Idiot, Iam Zakir Husain అని అన్నారు. (అయ్యా! నేను మిస్టర్ ఈడియెట్ ను కాను, నేను జాకిర్ హుస్సైన్ను) అని అన్నప్పుడు ఆ అవతలి వ్యక్తి కోపం చ ల్లారిపోయింది. (sorry) నన్ను క్షమించండని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

2. హిజ్రత్(వలస)తరువాత హుదైబియా సంఘటన జరిగింది. మక్కా సర్దారులు రుషీశ్వరుడైన ముహమ్మద్ను మరియు అతని అనుయాయులను మక్కాలో ప్రవేసించకుండా అడ్డుకున్నారు. ఆ సందర్భలో హుదైబియా అనే ప్రాంతంలో ఇరువర్గాల మధ్య ఒక శాంతిఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం జరిగేటప్పుడు ఖురైషులు మంకుపట్టుతోపాటు హింసను కూడ కనబరిచారు. తమ ఏకపక్ష షరతులను అంగీకరించవలసిందేనని పట్టుపట్టారు. అప్పుడు రుషీశ్వరుని అనుయాయులకు అత్యంత బాధ కలిగింది. షరతులతో కూడుకున్న ఇలాంటి ఒప్పందం చేసుకోవటమనేది అవమానంగా భావించారు. అప్పుడు రుషీశ్వరుడైన ముహమ్మద్ ఈవిధంగా అన్నారు:"ఖురైషులు ఈరోజు రక్తబంధం(సిలారహ్మి)తో కూడుకున్న ఎలాంటి ప్రతిపాదనను పెట్టినా, నేను దాన్ని అంగీకరిస్తాను"-(సీరత్ ఇబ్నెహిషాం, 310/2)

శత్రువు ప్రతిపాదించిన ఏకపక్ష షరతులను అంగీకరించటమనేది అత్యంత సహించరాని విషయం. అయితే ప్రవక్త మాత్రం ఈ పైమాటను చెబుతూ, ఒక అసహ్యకరమైన దానిని ఆనందదాయకమైన వ్యవహారంగా మార్చివేశారు.

ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ యొక్క ఈ మాటలు, హూందాగా వైదొలగటం అనేదానికి జ్ఞానయుక్తమైన ఒక ఉపమానమని చెప్పవచ్చు. ఆనాటి అరబ్బుల్లో రక్తబంధం అనేది అతిపెద్ద మానవత్వపు గౌరవంగా పరిగణింపబడేది. అలాగే, తెగతెంపులను అత్యంత చెడ్డ విషయంగా పరిగణింపబడేది. కాబట్టే, ఆ ఒప్పందంలో దాని ప్రస్తావనేలేదు. వాస్తవమేమిటంటే, రుషీశ్వరుడైన ముహమ్మద్, ఎట్టిపరిస్థితుల్లో కూడా తాను ఖురైషులతో రక్తబంధాన్ని కొనసాగించటానికే పూనుకున్నానని చెప్పదలిచారు. ఈవిషయం గౌరవప్రదంగా చెప్పటానికే ఆయనగారు, "నేను ఖురైషుల తరపున రక్తబంధానికి సంబంధించిన ప్రతి ప్రతిపాదనను అంగీకరిస్తాను. అయితే దానిలో తెగతెంపులు మాత్రం ఉండకూడదు" అనేది. అయితే ఖురైషులు ఈ తెగతెంపుల షరతును ఎన్నటికీ ఉంచరనే విషయం రుషీశ్వరునికి ముందుగానే తెలుసు. ఎందుకంటే, ఖురైషులకు రక్తసంబంధాల సెంటిమెంటు చాలా ఎక్కువ కాబట్టి.

రుషీశ్వరుడైన ముహమ్మద్ మక్కా నుండి మదీనాకు వలస వచ్చేస్తే, అతిత్వరలోనే అక్కడి అధికశాతం ప్రజలు ఇస్లాంలో ప్రవేసించేస్తారు. ఆ కాలంలో మదీనాలో అబ్దుల్లాహ్ బిన్ ఉబై అనే ఒకవ్యక్తి ఉండేవాడు. అతడు ఆ కాలంలో ఒక నాయకునిగా ఉండేవాడు. తన వంశస్తులతోపాటు అతడు కూడా ఇస్లాంలో ప్రవేశించినప్పటికీ, అతని హృదయంలో రుషీశ్వరుని విషయంలో ఈర్ష్యాద్వేషాలు నిండిపోయి ఉండేవి. అందుకే, ఆయనగారికి వ్యతిరేకంగా భయంకరమైన అనేక మాటలు మాట్లాడేవాడు.

రుషీశ్వరుడైన ముహమ్మద్, ఈ వ్యవహారాన్ని మదీనాకు చెందిన ఒక ముస్లిం వ్యక్తి ఉసైద్ బిన్ హజీర్తో చర్చించినప్పుడు, ఆ వ్యక్తి ఈవిధంగా జవాబు ఇచ్చాడు:"రుషీశ్వరుడా! దయచేసి మీరు అతనితో మృధువుగా ప్రవర్తించండి. దైవసాక్షిగా ఆ సర్వేశ్వరుడు మిమ్మల్ని మా వద్దకు పంపించాడు. అబ్దుల్లాహ్ బిన్ ఉబై జాతీయులు అతనికోసం ఒక వజ్రాల కిరీటాన్ని తయారు చేయించి, అతణ్ణి తమ నాయకునిగా చేసుకునే తలంపు కలిగియున్నారు. మీరు అతని నాయకత్వాన్ని అతని నుండి లాగుకున్నారని అతడు భావిస్తున్నాడు" - (సీరత్ ఇబ్నె హిషాం, 292 / 2)

ఇది, హూందాతనానికి సంబంధించిన ఒక జ్ఞానయుక్తమైన ఉదాహరణ. ఒక సందర్భంలో, అబ్దుల్లాహ్ బిన్ ఉబై చేసిన దారుణమైన మాటలకు ధీటైన జవాబు ఇవ్వవచ్చు. కాని, ఈ వ్యవహారంలో ధీటైన జవాబు అవసరం లేదని, హూందాతనమే అతగాడికి సరైన జవాబు అని ఆ అనుయాయుని మాటల్లోని అర్థం.

4. పైన పేర్కొన్న వాటిలో హూందాగా వైదొలగిపోవటం అనేదానికి సంబంధించిన ఉదాహరణలు పంక్తుల్లో చెప్పబడితే, ఇప్పుడు పంక్తులమధ్య చెప్పబడిన ఉదాహరణలను చూడండి. ఎప్పుడైతే ఏదైనా ఒక విషయంలో హూందాగా వైదొలగిపోవటం అనే విధానాన్ని అవలంభించటం జరుగుతుందో, అప్పుడు దానిలో మరొక విషయం కూడ నిగూఢంగా ఉంటుంది. ఒకవేళ అది నోటితో చెప్పబడనప్పటికీ, తప్పకుండా లభించే విషయంగా అందులోనే నిక్షిప్తమై ఉంటుంది. ఇటువంటి దానికి సంబంధించిన ఒక ఉదాహరణే -హుదైబియా ఒప్పందానికి సంబంధించిన ఉదాహరణ అని చెప్పవచ్చు.

హుదైబియా ప్రాంతంలో రుషీశ్వరుడైన ముహమ్మద్, రెండు వారాలపాటు బసచేసారు. ఆ సందర్భంగా అక్కడ ఖురైషులు వివిధరకాల దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ఉదాహరణకు ఒక ప్రవక్త అనుయాయుణ్ణి ఒంటరిగా చూసి, బాణంతో హతమార్చేసారు. ఒక సందర్భంలో ప్రవక్తవారు తన అనుయాయులతో కలసి ప్రార్థన చేసుకుంటుండగా ఖురైషులకు చెందిన ఒక సమూహం ప్రవక్తవారిపై బాణాల వర్షాన్ని కురిపించారు. కాని ఇటువంటి రెచ్చగొట్టుడు చేష్టల తరువాత కూడ ఇస్లామియా రుషీశ్వరుడు మాత్రం ఖురైషులతో ఒకపది సంవత్సరాల శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

ఈ ఒప్పందానికి సంబంధించిన నిబంధనలు ఉమర్ వారికి అత్యంత అయిష్టంగా కనబడ్డాయి. అప్పుడు ఆయనగారు అబూబకర్ వద్దకువచ్చి, "ఓ అబూబకర్! ఏ ముహమ్మద్ సర్వేశ్వరుని సందేశహరుడు కారా? అని ప్రశ్నించినప్పుడు, అబూబకర్, అవును ఆయన దైవసందేశహరుడే అని బదులుచెప్పగా, ఏ మేము ముస్లింలము కామా? అని మరలా ప్రశ్నించారు. దానికి కూడా అబూబకర్, అవును మేము ముస్లింలమే కదా! అని జవాబుఇచ్చారు. మరలా ఉమర్, ఏ వారు దైవేతరారాధకులు కారా? అని అడుగగా, అవును వారు దైవేతరారాధకులే కదా! అని చెప్పగా, అటువంటప్పుడు ధర్మం విషయంలో మనం ఈ అవమానాన్ని ఎందుకు భరించాలి? అని ఉమర్, అబూబకర్ను నిలదీయటమే కాకుండా స్వయంగా రుషీశ్వరుడైన ముహమ్మద్ను కూడా ప్రశ్నిస్తారు.

అయితే ఇక్కడ గమనార్హమైన విషయమేమిటంటే, రుషీశ్వరుడైన ముహమ్మద్, ఖురైషుల దౌర్జన్యాల తరువాత కూడా వారి ఏకపక్ష షరతులను అంగీకరిస్తూ, పది సంవత్సరాలపాటు చేసుకున్న ఏ శాంతి

ఒప్పందమైతే ఉందో, అదొక అత్యంత ముఖ్యమైన ఇస్లామియా వ్యూహాత్మక పద్దతి ప్రాతిపదికన చేసుకున్న ఒప్పందం. ఆ వ్యూహం ఏమిటంటే, శత్రువుతో శాంతి ఒప్పందం చేసుకొని సాధారణ పరిస్థితులను నెలకొల్పాలి. తద్వారా ఇస్లాంసందేశ కార్యాచరణను సమర్ధవంతంగా నిర్వర్తించవచ్చు. అయితే ఈ విషయాన్ని ఇటు శాంతి ఒప్పందంలోనూ వ్రాయలేదు, ఉమర్ మరియు తదితర సహచరులు అభ్యంతరం చేసినప్పటికీ, అటు హుదైబియా ప్రాంతంలో బహిరంగంగా ప్రకటించనూ లేదు.

ఇది, హూందాగా వైదొలగిపోయే పద్దతికి(సులక్షణానికి) రెండవ పార్శ్వం. ఈ పార్శ్వం ఎల్లప్పుడూ అదృశ్యంగానే ఉంటుంది. దీనిని మాటల్లో వర్ణించలేము. ఒకవేళ దీనిని పదాల్లో వ్రాసినా లేక నోటితో చెప్పినా దీని పూర్తి అర్థమే నిర్వీర్యమైపోతుంది.

ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలకు కేవలం రెండిటిలో ఒకేఒక్క విధానాన్ని చేపట్టటం అత్యంత ఉత్తమం. వారు ఎంతటి అప్రమత్తులై ఉండాలంటే, పంక్తుల్లో(linesలో), వాటిమధ్యన ఉండే వాటిని చదువుకోగలి -గేంతటి(అంటే, గూడార్ధాన్ని గ్రహించగలిగేంతటి)సమర్ధులై ఉండాలి. ప్రకటించకుండానే వాటి ప్రాధాన్యతను తెలుసుకునే సమర్థత కూడా వారిలో ఉండాలి. ఇక ఎవరిలోనైతే ఇంతటి అప్రమత్తత ఉండదో, వారు, తమ నాయకుని సత్యసంధతపై నమ్మకం ఉంచాలి. వారు, కేవలం నమ్మకం మరియు చిత్తశుద్ధి ఆధారంగా తమ నాయకుడు ఏది చెప్పినా దానివెనుక ఖచ్చితంగా ఏదోఒక లోతైన వ్యూహం ఉంటుందని నమ్మకం ఉంచాలి. మన కర్తవ్యం ఏమిటంటే, మన నాయకుని విధేయత పాటించాలేతప్పా, అతని నిజాయితి (integrity)ని శంకించకూడదు.

5. హుదైబియా ఒప్పందమనేది చూడటానికి ఎటువంటి ఒప్పందమంటే, శత్రువుకు ప్రతిగా అణిగిమణిగి చేసుకున్న ఒక ఒప్పందం వంటిది. కాని అందులో ఒక అప్రకటిత కారణం(రహస్యం) దాగుంది. అదేమిటంటే, పోరాటాన్ని ప్రక్కనపెట్టి తమకోసం నిర్మాణపు విరామాన్ని (అంటే, తన లక్ష్యసాధన కోసం సమయాన్ని)సాధించటమనేది. ఒకవేళ ఈ విషయాన్ని (రహస్యాన్ని) గనుక ఒప్పంద పత్రంలో వ్రాసేసినా లేక రుషీశ్వరుడైన ముహమ్మద్ తన సహచరుల నడుమ అదేసమయంలో ఈ వ్యూహాన్ని బహిరంగ పరచేసినా, అప్పుడు ఈ ఒప్పందపు కారణాలన్నీ పూర్తిగా నీరుగారిపోతాయి. ఇలాంటి వ్యవహారాలన్నీ ఎల్లప్పుడూ అప్రకటితంగానే నిర్వహించబడతాయితప్పా, బహిరంగ చాటింపుతో మాత్రం కాదు. అందుకే రుషీశ్వరుడైన ముహమ్మద్, నిశ్శబ్దంగా ఉండిపోయారు. చివరికి, ఇలాంటి ఒప్పందంలో ఎంతటి

ప్రయోజనంఉందో అనుభవపూర్వకంగా తెలిసినప్పుడే ప్రజలు ఇందులోఉన్న రహస్యాన్ని గ్రహించ - గలిగారు.

ఈ వాస్తవాన్నే అబూబకర్ సిద్దీఖ్, ఆ తరువాతి కాలంలో ఈవిధంగా చెప్పారు:"ఇస్లాం చరిత్రలో హుదైబియా విజయం అన్నిటికన్నా అతిపెద్ద విజయం. కాని ఒప్పందం చేసుకునే సమయంలో మాత్రం ప్రజలు, ఋషీశ్వరుడైన ముహమ్మద్కు మరియు ఆ సర్వేస్వరునికి మధ్యనున్న రహస్యాన్ని గ్రహించటంలో విఫలమైపోయారు. మనుషులైతే తొందరపాటు నైజం ఉన్నవాళ్ళు. కాని సర్వేశ్వరుడు మాత్రం మానవుల మాదిరిగా తొందరపాటు గలవాడుకాదు. చివరికి ఆయన ఏది తలచుకుంటే, అదే జరుగుతుంది"

-(మఘాజి అల్ -వఖ్ది, 610/2)

6. హూందాగా వైదొలగటం(సులక్షణం)అనేది, తప్పించుకోవటానికి వేసిన ఒక ఎత్తుగడ ఎంతమాత్రం కాదుగాని, అదొక అర్ధవంతమైన మరియు మానవుని నిరంతర అనుభవపూర్వకమైన ఒక నైతిక ప్రవర్తన అని చెప్పవచ్చు. కారణజీవుడైన మనిషికి ఒక నిర్దిష్టమైన గమ్యం ఉంటుంది. అక్కడకు చేరటమే అతని అసలు లక్ష్యం(concern)అయి ఉంటుంది. కాబట్టే అతడు తన మార్గంలో ఎదురయ్యే అన్ని అడ్డంకుల నుండి తనకుతాను దూరంగా ఉంటూ, చివరికి తన గమ్యానికి చేరుకుంటాడు.

ఆనాటి మక్కా ప్రజలు ఋషీశ్వరుడైన ముహమ్మద్ను అత్యధికంగా బాధించారనే విషయం మనందరికి తెలిసిందే. ఆయన మరియు అతని సహచరులు చివరికి మక్కాను విడిచిపెట్టవలసి వచ్చింది. ఆయన స్వదేశాన్ని విడిచిపెట్టినప్పటికీ, ఆయనకు వ్యతిరేకంగా నిరంతర వేధింపులు కొనసాగుతూనే ఉండేవి.

చివరికి ఆ సర్వేశ్వరుని సహాయం ద్వారా ఋషీశ్వరుడైన ముహమ్మద్, మక్కా విజేతగా ఆవిర్భవించారు. ఇక తన పూర్వపు శత్రువులను శిక్షించే సమయం ఆయనకు దొరికింది. సాధారణ సూత్రం ప్రకారం, వారందరినీ హతమార్చటం జరుగుతుంది. కాని ఋషీశ్వరుడైన ముహమ్మద్ మాత్రం వారందరితో హూందాగా ప్రవర్తించే విధానాన్ని చేపట్టారు. చరిత్ర చాటిచెప్పేదేమిటంటే, మక్కా విజయం తరువాత, ఎప్పుడైతే ఖురైషుల ఈ నేరస్తులను ఋషీశ్వరుని సన్నిధానంలో నిలబెట్టటం జరిగిందో, అప్పుడు ఆయనగారు, "నేను మీతో ఏవిధంగా ప్రవర్తిస్తానని మీరు భావిస్తున్నారు?"అని అడిగినప్పుడు, వారు, "మీరు అత్యంత శీలవంతులు మరియు శీలవంతుడైన మా సోదర కుమారులు" అని అన్నారు.

ఆ తరువాత రుషీశ్వరుడైన ముహమ్మద్, "సరే! ఏవిధంగానైతే రుషీశ్వరుడైన యూసుఫ్ తన సోదరులతో ఆనాడు అన్నారో, అదేవిధంగా నేను కూడా  ఈనాడు మీతో అదే అంటాను" అంటే, మీపై ఎటువంటి నిందారోపణ లేదు(12:96)అని. ఈవిధంగా చెబుతూ,"ఈరోజు మీరందరూ స్వతంత్రులు". అని ప్రకటించారు. తనకు బద్ధశత్రువులైన వీరందరినీ ఆయనగారు క్షమించి, స్వతంత్రులుగా చేసేసారు. -(బహిఖీ,199 / 9, హదీసు నెంబరు:76 / 18275).

రుషీశ్వరుడైన ముహమ్మద్ యొక్క ఈ కార్యాచరణ, ఒక లక్ష్యంతో పనిచేసే వ్యక్తి కార్యాచరణ యొక్క మహోన్నత ఉదాహరణతో పోల్చవచ్చు. రుషీశ్వరుని యొక్క లక్ష్యం ఏమిటంటే, సర్వేశ్వరుని ఆలయమైన కాబాను విగ్రహాల నుండి విడిపించి పవిత్ర పరచటం. అలాగే మక్కా వాసులను ద్వైతారాధన నుండి తప్పించి, వారిని ఈశ్వరద్వైతారాధకులుగా మలచటం. ఇంకా, తన శత్రువులను మిత్రులుగా చేసుకొని, ఈశ్వరద్వైతారాధనా పునాదులపై తన నియామకపు లక్ష్యమైన విప్లవాన్ని తీసుకురావటం.

రుషీశ్వరుడైన ముహమ్మద్, ఏకపక్షంగా చూపించిన ఈ సత్ప్రవర్తన కారణంగా మక్కాలోని యావత్ ప్రజలు కూడా ఇస్లాం ధర్మంలో ప్రవేశించేసారు. ఉల్లేఖనకర్తలు ఈవిధంగా వ్రాస్తున్నారు: "అక్కడ మక్కావాసులు తమ గోరీలనుండిలేచి, నేరుగా ఇస్లాంలో ప్రవేసించినట్లు ఆనాడు ఇస్లాంలో ప్రవేశించారు" అని -(బహిఖీ,199 / 9, హదీసు నెంబరు: 76 / 18275)

ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ గనుక ఒకవేళ ఈవిధంగా కాకుండా, వారి దౌర్జన్యాలకు ప్రతిగా పగ తీర్చుకుంటే, ఆ తరువాత, ప్రతికారచర్యల పరంపర ఇప్పటికీ కొనసాగేదే. చివరికి పరిస్థితి ప్రతికూలంగా మారిపోయి, యావత్ నిర్మాణాత్మక ప్రణాళిక చిన్నాభిన్నమైపోయి ఉండేదే.

# 12. ప్రకృతి విరుద్ధ కార్యాచరణ

ఎప్పుడైతే నైజానికి వ్యతిరేకమైన ఒకచర్య ముందుకొస్తుందో అప్పుడు, దానికి ప్రతిగా మనిషి రెండు భిన్నమైన పద్ధతులను ఎన్నుకుంటాడు. అందులో ఒకటి, భావోద్వేగ కార్యాచరణ విధానమైతే, రెండవది భావోద్వేగరహిత కార్యాచరణ విధానం. ఇక్కడ భావోద్వేగ కార్యాచరణ అంటే, వైద్య పరిభాషలో అలెర్జీ (allergy) అంటారు. పరిమిత పరిస్థితుల్లో అపరిమిత కార్యాచరణను అలెర్జీగా అభివర్ణించటం జరిగింది (Abnormal reaction to normal things).

ఉదాహరణకు, తనకు వ్యతిరేకంగా చేయబడిన విమర్శను విన్నవెంటనే కోపోద్రేకమైపోవటమనేది ఒకరకమైన అలెర్జీ అని చెప్పవచ్చు. ఒకవేళ ఎవరైనా ఒకవ్యక్తి మీరు మాట్లాడిన ఏదైన ఒకమాటను విమర్శించినప్పుడు, దాని సున్నితమైన మరియు మానవ నైజపు కార్యాచరణ ఏమిటంటే, దానిని మీరు విశాలహృదయంతో విని, విశాలంగా ఆలోచించటం మాత్రమే. ఒకవేళ ఆ విమర్శ తప్పుడువిమర్శ అయితే, దానికి మీరు ఋజువులతో కూడిన జవాబును ఇవ్వాలి. ఒకవేళ విమర్శేగనుక వాస్తవమైతే, అప్పుడు దానిని స్వీకరించాలి. ఇలాకాకుండా విమర్శను విని రెచ్చిపోవటమనేది, అసున్నితమైన మరియు నైజానికి వ్యతిరేకమైన పద్ధతిలో జవాబు ఇవ్వటంవంటిది. ఇటువంటి విధానమే వ్యాధిగ్రస్థ మనస్తత్వానికి నిదర్శనం. ఇక దీనికి భిన్నమైన విధానం మాత్రం ఆరోగ్యకరమైన మనస్తత్వానికి నిదర్శనమని చెప్పవచ్చు.

ఇదేవిధంగా, వ్యతిరేక నినాదాలను విని కోపోద్రేకులైపోవటం, అవమానం జరిగినప్పుడు రెచ్చిపోవటం, తమ మార్గంలో ఏదైనా అడ్డంకి ఏర్పడినప్పుడు కుమిలిపోవటం, తమ ఆలోచనలకు వ్యతిరేకమైన ఆలోచనలను సహించలేకపోవటం వంటివన్నీ కూడా భావోద్వేగ కార్యాచరణలోని రకాలు. ఈ భావాలు కలిగిన వ్యక్తులు ఎల్లప్పుడూ ఇతరులకు వ్యతిరేకంగా ద్వేషం మరియు హింసలో మునిగిఉంటారు. ఇలాంటి వ్యక్తులు, జీవితంలో అనుకూల మరియు నిర్మాణాత్మక పార్శ్వాన్ని ఆశ్వాదించటంలో విఫలమైపోతారు.

దీనికి భిన్నంగా రెండవ విధానం ఏమిటంటే, భావోద్వేగరహిత కార్యాచరణ విధానం. దీనిని ఖురాన్ గ్రంథంలో హూందాగా వైదొలగటమని చెప్పటం జరిగింది. అంటే, తన నైజానికి వ్యతిరేకంగా ఏదైనా ఒకమాట తన ముందుకు వచ్చినప్పుడు, కోపానికి గురికాకుండా ప్రశాంత హృదయంతో ఆలోచించి, సరైన నిర్ణయంతో సున్నితమైన పద్ధతిలో దానికి జవాబు ఇవ్వాలి. ఇలాంటి సున్నితమైన జవాబుకు

సంబంధించిన అనేకవిధానాలు ఉన్నాయి. అందులో ఒక విధానం, సాధారణంగా దానిని చూసిచూడనట్లు విడిచిపెట్టేయటం. అంటే, "కుక్కలు మొరుగుతూనే ఉంటాయి, ఏనుగు నడుస్తూనే ఉంటుంది"అనే సామెత మాదిరిగా అన్నమాట.

ఇదేవిధంగా, శత్రువర్గంవారి దుశ్చేష్టలకు జవాబు సదాచరణ ద్వారా ఇవ్వటమనేది కూడా హూందా తనంతో వైదొలగిపోవటమనే ఖాతాలోనికే వస్తుంది. అలాగే ఆ వర్గంవారి అనైతిక ప్రవర్తనకు అత్యుత్తమ నైతిక ప్రవర్తనతో సమాధానమిస్తూ, దానిని లోబరచుకోవాలి. ఇదేవిధంగా కొన్ని సందర్భాల్లో పరిస్థితుల ఆవశ్యకత ఎలా ఉంటుందంటే, అణచివేత విధానాన్ని(pressure tactics) అవలంభించి ఆ వర్గాన్ని నోరుమెదపకుండా ఉండేలా కూడా చేయాల్సివస్తుంది.

హూందాగా వైదొలగిపోవటమనే ఈ విధానానికి ఒక నిర్ధిష్టమైన రూపమంటూ ఏదీలేదు. పరిస్థితులకు అనుగుణంగా వివిధ రూపాలు ఈ విధానానికి ఉంటాయి. కాబట్టి, మనం ఏ రూపాన్ని అవలంభించినా, అది జ్ఞానయుక్తమైనదే అయిఉండాలి తప్పా, ఆవేశపూరితమైన కార్యాచరణకు దారి తీయకూడదు. దీని అసలు కారణం కేవలం వివరణేగాని గందరగోళానికి గురికావటంకాదు. అది ఎల్లప్పుడూ శాంతియుత సూత్రాలపై మాత్రమే ఉండాలితప్పా, హింసాయుత సూత్రాలపై కాదు. దీనివెనుక, ద్వేషం మరియు ప్రతీకారాల భావోద్వేగం ఎన్నటికీ ఉండకూడదు. దానికి బదులుగా, అందమైన ప్రణాళిక ద్వారా ప్రతికూల వ్యవహారాన్ని ప్రక్కనపెట్టేసి, జీవితనౌక సాధారణంగా మరియు సాఫీగా తన గమ్యంవైపునకు కొనసాగేలా చూడాలి.

హూందాగా వైదొలగిపోవటమనే దాని(హిజ్ర్ జమీల్)యొక్క లక్ష్యం బాహ్యపరమైన సమస్యకు సంబంధించింది కాదుగాని, మనిషియొక్క స్వీయ వ్యక్తిత్వానికి సంబంధించింది. అలాగే దీని లక్ష్యం స్వయంగా దానికదే, సమస్యను రూపుమాపటం కాదుగాని, సమస్య తనకు వ్యతిరేకంగా మారకుండా చూసుకోవటమే దాని ప్రధాన లక్ష్యం.

# 13. రుషీశ్వరుని దూషణకు దండన

ఇమాం ఇబ్నె తైమియ(మ:క్రీ.శ.1328), ఇస్లామియా చరిత్రలో అత్యంత పేరెన్నికగన్న పండితులు. ఆయనగారిని, "షేఖుల్ ఇస్లాం" (పీఠాధిపతి)అనేవారు. రుషీశ్వరుని దూషణ అనే అంశంపై ఇతని ఒకపెద్ద పుస్తకమే ఉంది. దానిపేరు: "అస్-సారిం అల్-మస్లూల్ అలాషాతిమిర్ రసుల్"(రుషీశ్వరుని దూషణకర్తపై నగ్నఖడ్గం). ఏ వ్యక్తైతే ముహమ్మద్ను దూషిస్తాడో, ఆ వ్యక్తిని హతమార్చేయాలనేది ఆ పుస్తక సారాంశం. తన ఈ ఫత్వా(తీర్పు)ను సమర్ధించుకోవటానికిగాను ఆయనగారు, చాలా సుధీర్ఘమైన వాదనలే చేసారు. కాని వాస్తవంలో ఆయన వాదనలను సమర్ధించే ఒక్కగానొక్క ఋజువు ఇటు ఖురాన్లో గాని లేక అటు హదీసు(ప్రవక్త ప్రవచనం)లో గాని మనకు దొరకవు.

పుస్తకం ప్రకారం, కేవలం ఒకేఒక "ఉల్లేఖనం" ఉంది, దాని ఆధారంగా రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించినవానికి మరణదండన తప్పకుండా విధించాలనేది. కాని అత్యంత ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, స్వయంగా ఇమాం ఇబ్నె తైమియాయే ఈ ఉల్లేఖనాన్ని నిరాధారమైందిగా పేర్కొన్నారు. ఈ ఉల్లేఖనాన్ని ప్రవచించిన ఉల్లేఖనకర్త నమ్మదగినవాడు కాదనే విషయాన్ని ఆయనగారు అంగీకరిస్తారు. ఈ అంగీకరణ తరువాత ఆయన ఈవిధంగా వ్రాస్తున్నారు:"ఏ వ్యక్తైతే ప్రవక్తల్లో ఏ ఒక్క ప్రవక్తను దూషించినా, ఆ వ్యక్తిని హతమార్చటం జరుగుతుందఅనే ప్రమాణం ఆధారంగా ఈ ఉల్లేఖనం నిజమైనదే అవుతుంది"అనేది - (93వ పంక్తి)

ఇమాం ఇబ్నె తైమియా ఒకగొప్ప హదీసు పండితునిగా ప్రసిద్ధిగాంచారు. ఈయన విషయంలో ఇమాం జహ్బి ఏమన్నారంటే, "ఏ హదీసునైతే ఇబ్నె తైమియా ఎరుగరో అదసలు హదీసేకాదు" అని. ఇటువంటి పరిస్థితుల్లో ఎప్పుడైతే స్వయంగా హదీసు పండితులైన ఇబ్నె తైమియాయే ఈ ఉల్లేఖనాన్ని నమ్మదగినదిగా అంగీకరించటంలేదో, అలాంటప్పుడు ఈ ఉల్లేఖనం ద్వారా రుషీశ్వరుని దూషణకు మరణదండన అనే తీర్మానం ఏవిధంగా చేయగలరు? అనే ప్రశ్న ఉదయిస్తుంది. నిస్సందేహంగా ఇటువంటి కారణాలు(తీర్పులు)ధర్మవిరుద్ధమే కాకుండా అజ్ఞానం కూడా. వాస్తవమేమిటంటే, దూషణకర్తను హతమార్చండనే ఆజ్ఞ ఖురాన్లోగాని హదీసులోగాని ఎక్కడాలేదు. ఈవిషయంలో ముస్లింలు మాత్రం తమ వర్గ భావావేశాలను షరియత్ ఆజ్ఞగా మలచేసారు. ఇలాచేయటం ఖచ్చితంగా అవిధేయత (తలబిరుసుతనమే)అని చెప్పకతప్పదు. ముహమ్మద్ పేరుతో ఒక వ్యక్తిని అన్యాయంగా హతమార్చటం అనేది స్వయంగా ముహమ్మద్నే అవమానించటం అవుతుంది. దూషణ అనేది దాని వాస్తవికత ఆధారంగా

అదొక భిన్నాభిప్రాయం మాత్రమే.ఇటువంటి భిన్నాభిప్రాయాలకు జవాబు కేవలం జ్ఞానయుక్తమైన సంవాదనేతప్పా, తుపాకీకాదు ఖడ్గమూకాదు.

# 14. ముహమ్మద్ పేరుతో ముహమ్మద్ వ్యతిరేక చర్యలు

2012, జనవరి 20-24 మధ్యన రాజస్థాన్లో జైపూర్ సాహిత్య ఉత్సవాలు(Jaipur Literature Festival)జరిగింది. ఇదొక అంతర్జాతీయ పండుగని చెప్పవచ్చు. వివిధదేశాల కళాకారులు మరియు విద్యావేత్తలు పెద్దసంఖ్యలో ఈ పండుగలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో (ప్రస్తుతం లండన్లో ఉంటున్న) సల్మాన్ రష్దీని కూడా ఆహ్వానించటం జరిగింది. కాని హిందుస్తాన్లో ఉంటున్న అధికశాతం ముస్లిం సంఘాలు మాత్రం ఈ ఆహ్వానానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియజేస్తూ, రష్దీ రాకను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరాయి. ఎందుకంటే, అతడు (The Satanic Verses) అనే తన పుస్తకంలో, ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ను దూషించాడు కాబట్టి. అప్పుడు భారత ప్రభుత్వం రాజకీయ కారణాల వలన ముస్లింల ఈ అభ్యర్ధనను మన్నించి, సల్మాన్ రష్దీ భారతదేశ పర్యటనను రద్దుచేసేసింది. భారతీయ ముస్లింలు ఈ అభ్యర్ధనను భౌతికంగానైతే చేసారు. కాని, దాని వాస్తవికత ఆధారంగానైతే మాత్రం ఈ అభ్యర్ధన స్వయంగా ముహమ్మద్ ఆదర్శానికే(Model) వ్యతిరేకమైంది. బయటకు కనబడే ఈ విజయం, దాని ప్రతిఫలం(result)రిత్యా కేవలం ఒకఘోరమైన అపజయంతప్పా మరేమీకాదు. ఇటువంటి వ్యవహారాల్లో రుషీశ్వరుడైన ముహమ్మద్ ఆదర్శం ఏమిటంటే, వాటిని భావోద్వేగరహితంగా చూస్తూ, సమస్యను పట్టించుకోకుండా అవకాశాన్ని(opportunity) సద్వినియోగం(avail) చేసుకోవటం మాత్రమే.

రుషీశ్వరుడైన ముహమ్మద్ వారి ప్రారంభకాలంలో మక్కాలోని కాబాలో 360 విగ్రహాలు ఉండేవి. వాస్తవానికి ఇదొక పెద్ద సమస్యే. కాని దీనితోపాటు ఇక్కడున్న మరో పార్శ్వం ఏమిటంటే, ఈ విగ్రహాల కారణంగానే అతిపెద్ద సంఖ్యలో సందర్శకులు ఇక్కడకు వచ్చేవారు. ఇస్లామియా రుషీశ్వరుడు కాబాలోని విగ్రహాలను పెడచెవినపెట్టి, పట్టిచుకోకుండా ఆ సందర్శకులకు ఖురాన్ చదివి వినిపించేవారు. జైపూర్ సాహిత్య ఉత్సవంలో ముస్లింలు కూడా ఇలానే చేసి ఉండవలసింది. ఈ ఉత్సవంలో భారతీయులతోపాటు విదేశీయులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇలాంటి సందర్భంలో ముస్లింలు ఆ ఉత్సవ ప్రతికూల పార్శ్వాన్ని పట్టించుకోకుండా, దానిని ప్రజల సంస్కరణ అవకాసం(reformation Opportunity for people)గా ఉపయోగించుకోవలసింది. అక్కడ తమ ఒక పుస్తకదుకాణాన్ని ఏర్పాటుచేసి, ప్రజలకు ఖురాన్ అనువాదాలతో పాటు ఇతర ఇస్లామియా సాహిత్యాన్ని పంచవలసింది. ఆవిధంగా చేయటమే రుషీశ్వరుడైన ముహమ్మద్ ఆదర్శం.

# 15. రుషీశ్వరుని దూషణా సమస్య

సాధారణంగా ముస్లింల నమ్మకం ఏమిటంటే, రుషీశ్వరుడైన ముహమ్మద్ను గనుక ఒకవేళ ఎవరైన దూషిస్తే, ఇస్లామియా చట్టం(షరియత్)ప్రకారం అతణ్ణి హతమార్చేయాలనేది. ఒకవేళ వీరిని దీనికి సంబంధించిన ఆధారాన్ని చూపించండని అడిగితే, వెంటనే వారు ఫిఖ్హాకు సంబంధించిన ఆధారాన్ని చూపిస్తారు. ఇస్లామియా ఫిఖ్హా(షరియా శాసనాంగం)లో ప్రవక్తను దూషించేవానికి మరణదండన విధించాలనే విషయంలో ఏకాభిప్రాయం ఉందని వాదిస్తారు.

ఇటువంటి ఆధారాలు వాటంతటవే నిరాధారమైనవి. ఎందుకంటే, చివరాఖరి శాసనమనేది అతిపెద్ద శిక్షా(capital punishment)స్థాయిని కలిగిఉంటుంది. ఇటువంటి శాసనం నేరుగా ఖురాన్ మరియు హదీసుల నుండే గ్రహించబడాలి తప్పా, తరువాత తయారుచేయబడిన ఫిఖ్హానుండి మాత్రంకాదు. ఒక సర్వామోదయోగ్యమైన విషయమేమిటంటే, ఇస్లాంలో ప్రామాణిక మార్గాలు(Authentic Sources) కేవలం ఖురాన్ మరియు హదీసులే. మూడవది ఎంతమాత్రం ప్రామాణికం కాదు. ఇక ఫిఖ్హా విషయానికి వస్తే అది, పండితుల అభిప్రాయం మరియు ఊహపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి, పండితుల అభిప్రాయాలు వాటికవే ఎంతమాత్రం ప్రామాణిక శాసనాలు(చట్టాలు)గా చేలామణి కాజాలవు.

ఫిఖ్హా పుస్తకాల్లో ప్రవక్త దూషణ విషయంపై అనేక వాదనలు ఉన్నాయి. అవేకాకుండా ఈ అంశంపై వివిధ పుస్తకాలు నిరంతరం వ్రాయబడుతూనే ఉన్నాయి. వాటిలో కొన్ని పుస్తకాలను ఇక్కడ పేర్కొనటం జరిగింది:

1.తఖియుద్దీన్ అహ్మద్ బిన్ తైమియా(మ:క్రీ.శ.1328) "ప్రవక్తను దూషించే వానిపై నగ్న ఖడ్గం"

2.తఖియుద్దీన్ అబుల్ హసన్ అలి సుబ్కి (మ:క్రీ.శ.1355) "ప్రవక్తను దూషించే వానిపై ఒరలేని ఖడ్గం"

3.ఇబ్నె ఆబిదీన్ అల్-షామి "ప్రవక్త మరియు సహచరులను దూషించేవారికి శిక్షలు"

రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించే వారిని శిక్షించే విషయంలో సాధారణంగా ముస్లింలు అత్యంత సున్నితంగా ఉంటారు. కాని ఈ అంశంపై వ్రాయబడిన పుస్తకాల్లో మాత్రం ఎటువంటి సరైన ఆధారం కూడాలేదు.

ఈ సందర్భంగా మొదటిప్రశ్న ఏమిటంటే, ముహమ్మద్ను దూషించిన వ్యక్తిని హతమార్చేయండనే ఆజ్ఞ ఖురాన్లో ఎక్కడ ఉందనేది? ఖురాన్లో నూటపద్నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. అలాగే ఆరువేల పైచిలుకు వాక్యాలు ఉన్నాయి. కాని ఏఒక్క అధ్యాయంలోగాని, ఏఒక్క వాక్యంలోగాని ప్రవక్తను దూషించినవాణ్ణి చంపేయండనే ఆజ్ఞ ఒక్కటంటే ఒక్కటి కూడాలేదు.

ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించేవాళ్ళు ఖురాన్ నుండి కొన్ని వాక్యాలను చూపిస్తుంటారు. కాని అవి ఈ సిద్ధాంతంతో ఏమాత్రం సంబంధంలేని వాక్యాలు. ఉదాహరణకు, ఇబ్నె తైమియా తాను వ్రాసిన పుస్తకం "ప్రవక్తను దూషించే వానిపై నగ్న ఖడ్గం" లో కొన్ని ఖురాన్ వాక్యాలను ప్రస్తావించారు. అందులో ఒక వాక్యం:"ఎవరైతే దైవప్రవక్తను వేధిస్తారో, వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది"(9:61)అనేది.

ఖురాన్లో పేర్కొన్న ఈ వాక్యంలో ఏ శిక్షగురించైతే చెప్పటంజరిగిందో అది, ఖచ్చితంగా పరలోకానికి సంబంధించిన శిక్షేగాని, ఈ ప్రాపంచిక జీవితంలో విధించే శిక్షను గురించి మాత్రంకాదు. ప్రాపంచిక శిక్షకు మరియు పరలోక శిక్షకు మధ్యనున్న బేధాన్ని గుర్తించకపోవటం అత్యంత అజ్ఞానపూరితమైన విధానం. ప్రాపంచిక శిక్ష మానవుల న్యాయస్థానంలో విధించబడితే, పరలోక శిక్ష స్వయంగా ఆ పరమేశ్వరుని న్యాయస్థానంలోనే విధించబడుతుంది. ఈ రెండు శిక్షలు కూడా ఒకదానికొకటి అత్యంత భిన్నమైనవి. పరలోక శిక్షకు సంబంధించిన వాక్యాన్ని తీసుకొని, దానిని ప్రాపంచిక శిక్షకు ఆపాదించటం అనేది, నేరుగా అజ్ఞానపు నిర్వచనానికి పరాకాష్ట అని చెప్పవచ్చు.

ఇస్లామియాషరియత్(చట్టం)యొక్క రెండవ ప్రామాణం(source)సున్నత్(ప్రవక్త సాంప్రదాయం). కాని ఎవరైతే, "ప్రవక్తను దూషించేవారిని హతమార్చేయాలి" అని అంటారో వారు, ఈ హదీసుల భాండాగారం నుండి కేవలం ఒక్కటంటే ఒక్క హదీసును కూడా తమ వాదనకు సమర్ధనగా తీసుకురాలేకపోయారు. ఎప్పుడైతే హదీసుల భాండాగారంలో "ఎవరైతే మీ ప్రవక్తను దూషిస్తారో వారిని హతమార్చేయండి" అనే పదాలతో కూడిన ఉల్లేఖనం ఉంటుందో, అప్పుడు మాత్రమే ఈ సమస్య పరిష్కరింపబడుతుంది. కాని ఇటువంటి ఒక్క ఉల్లేఖనం కూడా ఈ హదీసు గ్రంథాల్లో ఎక్కడా లేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. అలాగే ఇప్పటివరకు కూడా ఏఒక్కరూ నిరూపించనూ లేదు.

ఇబ్నెతైమియా ఒకగొప్ప హదీసు పండితులు. అతని విషయంలో ఇమాం ముహమ్మద్ బిన్ అహ్మద్ జహబి(మ:క్రీ.శ.1348)ఏమన్నారంటే,"ఏ హదీసునైతే ఇబ్నెతైమియా ఎరుగరో, అదసలు హదీసేకాదు"

అని. కాని ఇబ్నెతైమియా ఈ కోణంలో(దూషణకర్తను హతమార్చాలి అనే కోణంలో)ఒక బలమైన హదీసును చూపించటంలో విఫలమైపోయారు.

ఇబ్నె తైమయా తన పుస్తకంలో, కేవలం ఒక ప్రవచనాన్ని హదీసు పేరుతో ప్రస్తావించారు. ఆ ప్రవచనం ఈవిధంగా ఉంది: "ఏ వ్యక్తైతే రుషీశ్వరుణ్ణి దూషిస్తాడో, ఆ వ్యక్తిని హతమార్చేయండి" (92వ పేజి)అని. ఈ ఊహాత్మక హదీసు విషయంలో స్వయంగా ఇబ్నెతైమియా తన పుస్తకంలో ఈవిధంగా వ్రాస్తున్నారు: "ఒకవేళ ఈ ప్రవచనం ప్రామాణికమైనదే అయితే, అప్పుడు, ప్రవక్తల్లో ఏఒక్క ప్రవక్తను దూషించినా, ఆ దూషణకర్తకు మరణదండన విధించటం తప్పనిసరి అయిపోతుంది". - (93వ పేజి)

పై ప్రస్తావిత పుస్తక రచయిత ఇబ్నెతైమియా క్రీ.శ.1328లో పరమపదించారు. ఈ పుస్తకం వ్రాయబడి దాదాపు 700సంవత్సరాలు గడిచాయి. కాని ఏఒక్క పండితుడు కూడా ఈ ప్రవచనం మూలమేమిటో ఇప్పటివరకు చెప్పలేకపోయాడు. అలాగే ఏ ప్రాతిపదికన ఈ ప్రవచనాన్ని ధృవీకరించాలో కూడా తెలుపలేదు. కాబట్టి ఇటువంటి పరిస్థితుల్లో, ఈ ప్రవచనం ఒక “బూటక ప్రవచనం” అని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఇలాంటి “బూటక ప్రవచనం” వలన ఏ విషయం కూడా నిరూపణ కాజాలదు.

ఈ వివరణ ద్వారా నిరూపితమైన విషయమేమిటంటే, ఏ వ్యక్తైతే మీ ప్రవక్తను దూషిస్తాడో, ఆ వ్యక్తిని హతమార్చేయండని ఖురాన్ హదీసుల్లో ఎక్కడా చెప్పబడలేదనేది. ఇలాంటి నిరాధారమైన ఆజ్ఞలకు ఖురాన్ హదీసుల్లో ఏమాత్రం చోటులేదు.

ముస్లింలు దేనినైతే "షత్మే రసూల్"(రుషీశ్వరుని దూషణ) అంటున్నారో, అటువంటి పరిస్థితే గనుక ఒకవేళ ఏర్పడితే అప్పుడు వారు ఏమిచేయాలి అనేఒక ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. దానికి జవాబు ఏమిటంటే, ఒకవేళ ఇటువంటి పరిస్థితులే గనుక ఏర్పడితే, అప్పుడు ముస్లింలు దానిని సైద్ధాంతిక సవాలుగా స్వీకరించి, సైద్ధాంతిక భాషలోనే సమాధానం ఇవ్వాలి. ఇస్లాంలో ఖిసాస్(ప్రతికార) విధానం ఉంది(2:179). దాని ప్రకారం, మాటకు మాటతో, కలానికి కలంతో మరియు పుస్తకానికి పుస్తకంతో జవాబు ఇవ్వాల్సి ఉంటుంది. ఈవిషయం రుషీశ్వరుడైన ముహమ్మద్ ప్రవర్తనలో మనకు కనబడుతుంది.

ఉదాహరణకు, ఒక ఉల్లేఖనంలో చెప్పబడిన విషయమేమిటంటే, ఒకరోజు, దైవేతరారాధకుల వంశానికి చెందిన ఒకవ్యక్తి, మదీనాలో రుషీశ్వరుడైన ముహమ్మద్ వద్దకు వచ్చాడు. అతడు తన వైఖరిని కవిత్వం రూపంలో వినిపించాడు. దీనినిబట్టి, ఈనాటి ప్రచురణా కాలానికి ముందు ఇటువంటి వ్యవహారాల్లో,

కవిత్వాల శైలి సర్వసాధారణంగా ఉండేదని అర్థమౌతుంది. బహుశా ఆనాడు ఈ కవిత్వాల విధానమే ఏకైక మాధ్యమంగా ఉండేది. ఉల్లేఖనంలో చెప్పినట్లు, ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ ఒక ప్రతినిధిని పంపించి హసాన్ బిన్ సాబిత్ అల్-అన్సారి(మ:క్రీ.శ.674)ని పిలిపించారు. ఆయన వచ్చినప్పుడు, ముహమ్మద్ ఈవిధంగా చెప్పారు: "ఓ హస్సాన్ లేవండి, ఈవ్యక్తి చెప్పినదానికి జవాబు ఇవ్వండి" అని(సీరత్ ఇబ్నె హిష్షాం 4వ భాగం, 227వ పేజి). అప్పుడు హస్సాన్ బిన్ సాబిత్ నిలబడి, అక్కడకు వచ్చిన కవికి కవిత్వ భాషలోనే సమాధానం ఇచ్చారు.

ఇటువంటి అనేక సంఘటనలు ఇస్లామియా రుషీశ్వరుని కాలంలో మనకు కనబడతాయి. దీనినిబట్టి, ఒకవేళ ఎవరైనా ఒకవ్యక్తి ఇస్లాంకుగాని లేక ప్రవక్తకుగాని వ్యతిరేకంగా ఏమైనా అంటే, దానికి జవాబు సరిసమానంగానే ఇవ్వాలని అర్థమౌతుంది. అంటే, మాటకు మాటతో, కలానికి కలంతోనే తప్పా, కలానికి ఖడ్గంతో జవాబు ఇవ్వటం ఇస్లాం విధానం కాదని కూడా తెలుస్తుంది. ఇటువంటి వ్యవహారం ఇస్లాం అనుయాయులకు కేవలం ఒక సైద్ధాంతిక సవాలేగాని, యుద్ధసవాలు మాత్రంకాదు. అలాగే మన వ్యతిరేకితో మాట్లాడి, అతనికి సంతృప్తి పరచటానికి కృషిచేయాలి. శాంతియుతంగా అతనికి జవాబును అందించాలి. బుద్ధిని సంతృప్తి పరచే పద్దతిని అవలంభించి, అతనిని ఎదుర్కోవాలి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో హింసాయుత విధానాన్ని ఏవిధంగానూ సమర్థించకూడదు.

# 16. సారాంశం

ఇప్పటివరకు గడచిన వాదన ప్రకారం, ఇస్లాం సంపూర్ణంగా శాంతిని కాంక్షించే ఒక మతమనే కాకుండా శాంతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించే మొట్టమొదటి మత విధానమని కూడా చెప్పటం అత్యంత సమంజసం అవుతుంది. అలాగే, ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్, ఇదేవిధానాన్ని అవలంభిస్తూ, వాస్తవార్థంలో ఒక శాంతియుత విప్లవాన్ని కూడా సాధించారని చెప్పవచ్చు.

ఈవిషయంలో ఇస్లామియా ప్రబోధనలు, ఒక సంఘటనతో మరింత తేటతెల్లమౌతున్నాయి. ఎప్పుడైతే రుషీశ్వరుడైన ముహమ్మద్, తబూక్ యుద్ధం(హిజ్రి 9వ సంవత్సరం)నుండి తిరిగివస్తూ, తన ముప్పై వేల సైన్యంతో మదీనాలో ప్రవేసించిన తరువాత ఈవిధంగా అన్నారు: "మనం ఇప్పుడు ఒక చిన్నజిహాద్(పరిశ్రమ)నుండి ఒక పెద్దజిహాద్(పరిశ్రమ) వైపునకు వచ్చాము" అని - ( కష్ఫుల్ ఖిఫా, 2వ సంపుటి, 345వ పేజి).

ఇక్కడ, పెద్దజిహాద్(పెద్ద పరిశ్రమ) మరియు చిన్నజిహాద్(చిన్న పరిశ్రమ)అంటే అర్థమేమిటంటే, చిన్న జిహాద్ అంటే, తాత్కాలిక జిహాద్(temporary struggle)అని అర్థం. అలాగే, పెద్దజిహాద్ అంటే, శాశ్వత జిహాద్(permanent struggle)అని అర్థం. శాశ్వత జిహాద్ అనేది ఒక భక్తునిలో ప్రతిరోజూ అమల్లో ఉంటుంది. ఈ ప్రస్తుత పరీక్షా జీవితంలో ఒక భక్తుడు ధర్మబద్ధమైన జీవితవిధానంపై స్థిరంగా ఉండాలి. ఎలాంటి కోపోద్రేకాల నుండైనాసరే తనకుతాను రక్షించుకుంటూ ఇస్లామియా (దైవధర్మ) సూత్రాలపై స్థిరంగా ఉండాలి. ఇదొక నిరంతర ప్రక్రియ. అందుకే దీనిని జిహాదే అక్బర్(పెద్ద పరిశ్రమ / permanent struggle)అని చెప్పటం జరిగింది.

ఇక జిహాదే అజ్గర్(చిన్నపరిశ్రమ / తాత్కాలిక జిహాద్)విషయానికి వస్తే, అదొక ఆత్మరక్షణా యుద్ధానికి మారుపేరు. అది, మినహాయింపు(exemption)గా ఎప్పుడైనా అనుకోకుండా జరిగే వ్యవహారం మాత్రమే. ఇస్లామియా జీవితంలో ఇది అవిభాజ్య భాగం ఎంతమాత్రం కాదు.

రుషీశ్వరుడైన ముహమ్మద్ కాలం, క్రీ.శ. ఏడవ శతాబ్దపు నాల్గుభాగాల్లో మొదటి భాగపు కాలమని చెప్పవచ్చు. ఆయనగారికి రుషీశ్వరపదవి క్రీ.శ.12,ఫిబ్రవరి,610లో లభించింది. క్రీ.శ.08,జూన్,632 న ఆయనగారు మదీనాలో ఈలోకం నుండి పరమపదించారు. దీనిప్రకారం ఆయనగారు 22సంవత్సరాల మూడు నెలలు రుషీశ్వర(దైవప్రవక్తా)పదవిలో కొనసాగారు. అయితే కేవలం నాల్గేనాల్గు యుద్ధాలు

ఈయన జీవితకాలంలో జరిగాయి. బద్ర్ యుద్ధం (హి[జి:2వ సం;), ఉహద్ యుద్ధం(హి[జి:3వ సం;), ఖైబర్ యుద్ధం(హి[జి:7వ సం;), హునైన్ యుద్ధం(హి[జి:8వ సం;). ప్రతి యుద్ధం కూడా కేవలం అర్ధరోజు మాత్రమే జరిగింది. అంటే, మొత్తంకలిపి కేవలం రెండురోజులు మాత్రమే అనేది.

రోజుల లెక్కనుబట్టి చూస్తే, ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ యొక్క ప్రవక్తా పదవికాలం దాదాపు 8,130 రోజులు. ఈ సుధీర్ఘ కాలంలో ఆయన మరియు అతని అనుచరులు కలసి 8,128 రోజులు నిరంతర శాంతియుత పరిశ్రమ(కృషి)లో నిమగ్నులై ఉన్నారు. కేవలం రెండేరెండు రోజులుమాత్రం ఆత్మరక్షణా నిరాయుధ యుద్ధంలో పాల్గొన్నారు. కాబట్టి, ఈ సందర్భంగా ఈవిధంగా చెప్పటం ఎంతైనా సమంజసమే అవుతుంది: "In Islaam peace is the rule, and war is a rare exception" (ఇస్లాంలో శాంతి తప్పనిసరి, యుద్ధమనేది ఒక అనివార్య మినహాయింపు మాత్రమే)అనేది.

# 17. కార్టూన్లను పట్టించుకోకండి

డెన్మార్క్ కు చెందిన ఒక పత్రిక(Jyllands Posten)లో ప్రచురితమైన ఒక కార్టూన్ను, ప్రవక్తను దూషించే సమస్యగా ఏవిధంగా ముస్లింలు మార్చేసి, హింసాత్మక చర్యలకు పాల్పడ్డారో, ఆ చర్యలతో ఇస్లాంకు ఏమాత్రం సంబంధంలేదు. ఆ కార్టూన్ కేవలం జర్నలిజానికి సంబంధించిన ఒక హాస్యం(జోక్) మాత్రమే. ఇటువంటి జోకులు ఆధునిక జర్నలిజం(పత్రికా రంగం)లో సర్వసాధారణమే. కాని ముస్లింలు దీనికి ప్రతిగా ఏ చర్యలనైతే చేపట్టారో, అవి కేవలం ద్వేషం మరియు హింస మాత్రమే. అయితే ఈ చర్యలే ప్రవక్తకు అసలైన దూషణ అని చెప్పవచ్చు.

రుషీశ్వరుడైన ముహమ్మద్ జీవిత చరిత్రను చూసినట్లైతే, ఆయన జీవితంలో ఇటువంటి ఘటనలు అనేకం జరుగుతూ ఉండేవి. కాని ఆయన మాత్రం ఇలాంటప్పుడు కేవలం ఒక విధనాన్ని అవలంభించేవారు. అదేమిటంటే, వాటిని పట్టించుకోకపోవటం(lookout). ఈ సందర్భంగా డెన్మార్క్ కార్టూన్ సమస్య ఉద్భవించినప్పుడు నేనొక వ్యాసాన్ని వ్రాసాను. అది ఆనాడే ఈక్రింది అంశంతో ప్రచురింపబడింది.

## Ignore cartoons

రుషీశ్వరుడైన ముహమ్మద్ ప్రబోధనల్లో ఒక ప్రబోధన ఏమిటంటే, "మీరు ఆ ప్రతీ పనికి కూడా దూరంగా ఉండండి, దేనిద్వారానైతే ఇస్లాం ప్రతిష్ట దెబ్బతింటుందో" అనేది. ప్రస్తుత యుగం భావప్రకటనా స్వేచ్ఛాయుగం. ఇటువంటి కాలంలో ఒక కార్టూన్ విషయంలో హంగామా సృష్టించటం వలన ప్రజల్లో, ఇస్లాం భావప్రకటనా స్వేచ్ఛకు వ్యతిరేకమైన మతం అనే అభిప్రాయం ఏర్పడిపోతుంది. ఇటువంటి పరిస్థితుల్లో కార్టూన్ వంటి సమస్యపై హంగామా సృష్టించటమనేది ఏవిధమైన మినహాయింపుతో కూడా సమంజసం కాదు. ఒకవేళ ముస్లింల మనోభావాలు దెబ్బతిన్నాసరే అప్పుడు కూడా వారు పరిపూర్ణమైన లక్షణాలతో వ్యవహరించవలసి ఉంటుంది. మనోభావాలు గాయపడటమనేది, ఈవిషయంలో వారికోసం ఎలాంటి మినహాయింపూ కాజాలదు.

# 18. దూషణ మరియు భ్రష్టత్వం

ఇస్లాంలో భ్రష్టునికి మరణదండన అనేది ఒక నిరాధార వ్యవహారం. ఎందుకంటే, ఈ ఆజ్ఞ ఇటు ఖురాన్లోగాని అటు హదీసులోగాని లేదు కాబట్టి. కాని ఫిఖ్హావేత్తలు మాత్రం స్వతహాగా ఇటువంటి సూత్రాలను చిత్రీకరించుకున్నారు. వాటిలో కొన్ని ఈవిధంగా ఉన్నాయి:

1.ప్రవక్తను దూషించినవాణ్ణి హరమార్చాలని.

2.భ్రష్టునికి కూడా మరణదండన విధించాలని. ఇంకా మొదలైనవి.

ఇటువంటి వ్యవహారాలు ఇస్లామియా ఆత్మ(spirit)కు వ్యతిరేకమైనవి. ఒకరు బలవంతం చేయగా (చట్టమైనా కావచ్చు)వారికి లొంగిపోయి అవలంభిస్తున్న ఇలాంటి విశ్వాసానికి ఇస్లాంలో ఏలాంటి ప్రాధాన్యతా లేదు. ఇస్లాం అనేది, స్వతంత్రంగా అవలంభించేది మాత్రమే. వ్యక్తిగతంగా తెలుసుకోవటమే అసలైన ఇస్లాం. స్వీయ పరిజ్ఞానం(self discovery)పై నడిచినప్పుడే దైవభక్తుడౌతాడు.

ఇస్లాం ప్రకారం, ఎక్కడైతే ఒకవ్యక్తి రుషీశ్వరుణ్ణి దూషించటంలోగాని లేక భ్రష్టత్వంలోగాని మునిగి ఉంటే, అప్పుడు ఆ వ్యక్తి విషయంలో శ్రేయోభిలాష ఏమిటంటే, అతనికోసం దైవానికి ప్రార్ధించటం మరియు ఆ వ్యక్తితో సంవాదం చేయటం. ఒకవేళ అతనిలో ఏవైనా సందేహాలున్నట్లైతే, వాటిని సైద్ధాంతిక జ్ఞానంతో సంవాదం చేసి, వాటిని దూరం చేయాలి. అతణ్ణి ఒక నేరస్తునిగా కాకుండా, ఒక వైద్యుడు తన రోగిని చూసినట్లు చూడాలి.

వాస్తవం ఏమిటంటే, ఫత్వా(తీర్పు)లు జారీచేసి ప్రజలను హతమార్చటం ఇస్లాం లక్ష్యంకాదు. దానికి బదులుగా, ప్రజల శ్రేయస్సు కాంక్షిస్తూ వారిని ఆ సర్వేశ్వరుని కారుణ్యపు సన్నిధానంలో తీసుకురావటానికి కృషిచేయటం మాత్రమే. నిస్సందేహంగా ఇటువంటి వ్యక్తుల వ్యవహారం(case), విషయ అవగాహనా లోపం(unawareness)మాత్రమే. సందేశదాత లేక సంఘసంస్కర్త యొక్క విధి ఏమిటంటే, ప్రజల అజ్ఞానాన్ని రూపుమాపి, వారి అంతరాత్మను (నైజాన్ని)జాగృత పరచటం మరియు వారు తమ సృష్టికర్తతో దగ్గరయ్యే అవకాశాన్ని కల్పించాలి. వారిలో పాశ్చాత్తాప భావాన్ని రగిలించాలి. తద్వారా వారు మరలా ఋజుమార్గంపై స్థిరపడటానికి అవకాశం ఉంది. ఇస్లాంలో, సాంఘిక నేరానికి(social crime)కు మరణదండన ఉందిగాని, సైద్ధాంతిక/విశ్వాసపర నేరానికి(conceptional crime)కు మాత్రం ఇస్లాంలో ఎలాంటి శిక్షాలేదు.

# 19. పరిస్థితులకన్నా ఉన్నతంగా ఎదిగి ఆలోచించాలి

ప్రజలు ఏవిధంగానైతే పూర్వపు రుషీశ్వరులతో ప్రవర్తించారో, అదేవిధంగా రుషీశ్వరుడైన ముహమ్మద్తో కూడా మక్కా ప్రజలు ప్రవర్తించారు(15:11). కాని రుషీశ్వరుడైన ముహమ్మద్ మాత్రం ప్రతికూల ఘటనలకు అనుకూల సమాధానాలనే ఎల్లప్పుడు ఇస్తుండేవారు. ఈసందర్భంగా ఒక ఉల్లేఖనం, ప్రవచన (హదీసు)గ్రంథాల్లో ఈవిధంగా చెప్పబడింది:"ఖురైషుల ఆగడాల నుండి మరియు వారి శాపనార్థాల నుండి ఆ సర్వేశ్వరుడు నన్ను ఏవిధంగా రక్షిస్తున్నాడో అనే విషయం మీకు ఆశ్చర్యం కలిగించటంలేదా? వారు నన్ను ముజమ్మం(ఖండనార్హుడు)అని శపిస్తున్నారు. వాస్తవానికి నేనైతే ముహమ్మద్నే"(ముహమ్మద్ అంటే, ప్రశంసనీయుడు అని అర్థం) -(బుఖరి, 3533వ ప్రవచనం).

దీనినిబట్టి అర్థమౌతున్న విషయమేమిటంటే, ఖురైష్ ప్రజలు దినదినాభివృధి చెందుతున్న తమ వ్యతిరేకతలో భాగంగా నా అసలు పేరును ఉచ్చరించటానికి కూడా ఇష్టపడటం లేదనేది. అయితే నాకు వ్యతిరేకంగా ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు, నా పేరును ప్రస్తావిస్తూ చెప్పాలనుకుంటున్నారు కాబట్టి, నన్ను వ్యతిరేకిస్తున్న ఆనందంలో, నా పేరును ముహమ్మద్ కు బదులుగా ముజమ్మం అని పెట్టేసారు. ముజమ్మం అంటే, "ఖండించదగినవాడు" అని అర్థం. ఈవిధంగా వారు నన్ను శపిస్తున్నారు. అయితే వీరి శాపనార్థాలైతే ముజమ్మంఅనే పేరుగల వ్యక్తికి తప్పకుండా తగులుతాయి. కాని ఎవరి పేరైతే ముహమ్మదో అతనికైతే ఈ శాపనార్థాలు ఏమాత్రం తగలవు (ఎందుకంటే, నేను ముజమ్మం కాదుకాబట్టి).

మహోన్నతఆలోచనకు ఇదొక సాటిలేని ఉపమానం. ఎందుకంటే, ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ స్వయంగా ఒక సంపూర్ణమైన అనుకూల(సకారాత్మక)ఆలోచనపై సుస్థిరంగా వుండే వ్యక్తి కాబట్టి. అందుకే ఆయనగారు, ఖురైషుల సమస్త చిల్లర వ్యవహారాలను ఒక సున్నితమైన శైలిలో సంహరించేసారు. ఇంకా ఆయనగారు ఏమన్నారంటే, "ఖురైషులు నా అసలు పేరుతో నన్ను ఏమీ అనకుండా, ముజమ్మం అనే పేరుతో తమ ఒక ఊహాత్మక వ్యక్తిని నిందిస్తున్నారు తప్పా, ఎవరికైతే అతని తల్లిదండ్రులు ముహమ్మద్ అని నామకరణం చేసారో అతణ్ణి మాత్రం వారు నిందించటంలేదు కదా" అని. రుషీశ్వరుని ఈ ఆదర్శాన్ని బట్టి, తన నిందారోపణల విషయంలో కోపోద్రేకులు కాకూడదని, నిందించేవాణ్ణి హతమార్చటానికి

ప్రయత్నించకూడదని తెలుస్తుంది. దానికి బదులుగా అతనితో సున్నితమైన పద్ధతిలో వ్యవహరించాలి. నిస్సందేహంగా అదొక అత్యంత నైతికపరమైన వ్యవహారమేగాని, చట్టపరమైన శిక్షా వ్యవహారం కాదు.

## ముహమ్మద్ అనుచర సంఘపు సైద్ధాంతిక పతనం

రుషీశ్వరుని ఒక ప్రవచనంలో ఈవిధంగా చెప్పబడింది:" నేను జీవించిన కాలం, నా సహచరుల కాలం మరియు వారి సహచరుల కాలం. ఈ తొలి మూడుకాలాలే ధర్మానికి ప్రామాణిక కాలాలు" - (బుఖారి, 3650వ హదీసు). ఈ హదీసు(ప్రవచనం)లో ఇస్లాంకు సంబంధించిన మూడు కాలాలను(periodsను) ప్రామాణిక కాలాలుగా పేర్కొనటం జరిగింది. వీటిని శ్రేయస్కర (సైద్ధాంతిక ఉపద్రవం లేని) యుగాలుగా కూడా పిలవటం జరిగింది. ఈ మూడు కాలాలంటే అర్థం, రుషీశ్వరుని కాలం, అతని సహచరుల కాలం, ఆ సహచరుల యొక్క సహచరుల కాలం. ఈ మూడు ప్రారంభపు కాలాల వ్యవధి రుషీశ్వరుని మరణం (హిజ్రి632)తరువాత సుమారు వంద సంవత్సరాల వరకు కొనసాగింది. ఆ తరువాత ప్రామాణిక శతాబ్దపు తరువాతి కాలం ప్రారంభమైపోయింది. ఇదేవిధంగా ఇస్లామియా చరిత్రలో ప్రామాణికమైన కాలాలు కేవలం ప్రారభపు మూడు కాలాలు మాత్రమే. ఆ తరువాత కాలాలకు ఇస్లాంలో ప్రామాణిక స్థాయి లభించలేదు.

ఈ అంశాన్ని మరింత నిర్ధారణ చేసినట్లైతే, ఈ మూడు కాలాల్లో ఇస్లాం సైద్ధాంతిక ప్రమాణంగా, యావత్తూ ఖురాన్ మాత్రమే ఉండేది. రెండవ ప్రమాణంగా హదీసు(ప్రవక్త ప్రవచనం) కూడా అందులో మిళితమై ఉండేది. ఎందుకంటె, హదీసనేది ఖురాన్ గ్రంథానికి వివరణ కాబట్టి. హదీసు లేకుండా ఖురాన్ను సరైనరీతిలో అర్థం చేసుకోలేము. దాదాపు వంద సంవత్సరాల తరువాత ఇస్లామియా చరిత్రలో ఒక సరిక్రొత్త యుగం ప్రారంభమైంది. దానిని ఫిఖ్హా(వ్యాఖ్యానాల) (interpretational age)కాలమని చెప్పవచ్చు. ఆ కాలంలో, సాసాని మరియు బాజంటైన్ సామ్రాజ్యాల్లోని ప్రాంతాలు జయించబడి, వాటికి అణుగుణంగా అక్కడి ప్రజలు ఇస్లాంలో ప్రవేశించటం ప్రారభమైపోయింది. ఆ తరువాత ఇస్లామియా చరిత్రలో, సామూహిక ఇస్లాం స్వీకరణ(mass conversion)అనే ఒక సరిక్రొత్త చిత్రం ఉనికిలోనికి వచ్చింది. ఈ నవముస్లింలు గతంలో పారశీ మతానికో లేక క్రైస్తవ మతానికో చెందినవాళ్ళు. ఆనాడు అన్నిమతాల్లో కూడా సంపూర్ణ ప్రాముఖ్యత అనేది కేవలం ఒక్క బాహ్యరూపాని(form)కి మాత్రమే ఇవ్వటం జరిగేది. ఎప్పుడైతే ఈ ప్రజలు ఇస్లామ్ను స్వీకరించారో, అప్పుడు వారు తమ పూర్వమతాలోచన

(mindset)ప్రకారం, ఇస్లాం యొక్క బాహ్యరూపం(form)ఏమిటో తెలుసుకోవటానికి కృషిచేయటం ప్రారంభించారు. అప్పుడే ఇస్లామియా చరిత్రలో ఫిఖ్హా అనే శాఖ ఉనికిలోనికి వచ్చింది.

ఈ కాలంలోనే హదీసుల సేకరణ మరియు వాటి సవరణ ప్రారంభమైంది. రూపం(form / structure) విషయంలో ప్రజలు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇవ్వటానికి ఫిఖ్హావేత్తలు హదీసులను పరిశీలించటం ప్రారంభించారు. రుషీశ్వరుడైన ముహమ్మద్, ఏవిధంగా ప్రార్ధన చేసేవారు అనే విషయాన్ని హదీసుల భాండాగారంలో అనేకమంది సహచరులు చెప్పిన సమాచారాన్నిబట్టి, వారి ఉల్లేఖనాల్లో వైవిధ్యం ఉందని ఫిఖ్హావేత్తలు గ్రహించారు. ఉదాహరణకు ఒక సహచరుని ఉల్లేఖనాలు "నమాజ్లో ఆమీన్(తథాస్తు!)అని మనసులో చెప్పుకోవాలి" అనే సిద్ధాంతానికి అనుకూలంగా ఉంటే, మరో సహచరుని ఉల్లేఖనాలు, "నమాజ్లో ఆమీన్(తథాస్తు!) అని బిగ్గరగా చెప్పాలి" అనే సిద్ధాంతానికి అనుకూలంగా ఉన్నాయి. హదీసు గ్రంథాల్లో ఇటువంటి అనేక భిన్నాభిప్రాయలు ఉన్నాయి.

ఇక్కడినుండే ముస్లిముల్లో మార్గభ్రష్టత్వం(derailment)ప్రారంభమైంది. "ధర్మంలో, ఆత్మ (spirit) ఒకటే ఉన్నప్పుడు, దాని అనుసరణ(application)లో మాత్రం భిన్నత్వం(diversity)ఉండవచ్చు. కాబట్టి, మీరు ఏ సహచరుని(సహబి-ఎ-రసూల్)ఉల్లేఖనాన్ని అనుసరిస్తారో దానిని అనుసరించండి. కాని మీరు మాత్రం ఆత్మ(spirit)కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వండి" అని ఫిఖావేత్తలు ముస్లింలతో చెప్పి ఉండవలసింది. కాని, ఫిఖ్హావేత్తలు మాత్రం, బాహ్యరూపం(form)(పద్దతి / విధానం) విషయంలో వారు స్వయంగా తీసుకున్న నిర్ణయం ఏమిటంటే, ఈ వివిధ ఉల్లేఖనాల్లో కేవలం ఏదో ఒక ఉల్లేఖనమే సరైనది అవుతుందనేది. కాబట్టే వారు, తమ ఈ ఆలోచన ప్రకారం, "ప్రాధాన్యత సూత్రం"(రాజెహ్ మరియు మర్జూహ్)అనే సూత్రాన్ని ఉనికిలోతెచ్చారు. వారు, వాదోపవాదాల తరువాత ఒక ఉల్లేఖనాన్ని (విధానాన్ని)అధికప్రాధాన్యతగలదిగానూ మరో ఉల్లేఖనాన్ని(విధానాన్ని)అల్పప్రాధాన్యతగలదిగానూ తీర్మానించారు. "ప్రాధాన్యత" అనే ఈ సూత్రం అందరిని ఏకాభిప్రాయానికి తీసుకురాదు. ఎందుకంటే, ఇమాం షాఫయి స్వయంగా ఈవిధంగా అంటున్నారు: "అన్నిరకాల వాదోపవాదాల(చర్చల)తరువాత కూడా, బహుశా అవతలి పక్షంవారి వాదనే నిజమయ్యే అవకాశం ఉంది"అని అన్నారు కాబట్టి.

ధర్మం విషయంలో, దాని ఆత్మ(spirit)కు ఇవ్వవలసిన ప్రాధాన్యతను దాని రూపానికి(form / structure)కు ఇచ్చే ఈ ఫిఖ్హావిధానం(Acadamical method), తరువాతి తరాలవారికి ఒక ఒరవడి వ్యవహారం(trendsetter)గా మారిపోయింది. ఆ తరువాత ధార్మిక అంశాలపై ఏ పుస్తకాలు

వ్రాయబడినా, దాదాపుగా అవన్నీకూడా ఒకే స్వరం(మిన్హాజ్)లో వ్రాయబడ్డాయి. ఇదే విధానం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. కాబట్టే, స్పష్టమైన ధర్మం, ఇప్పుడు అస్పష్టమైన ధర్మంగా మారిపోయింది.

ఒకవేళ మీరు ఫిఖ్హా పుస్తకాలను అధ్యయనం చేసినట్లైతే, మీరు వాటిలో ఇస్లాం సంబంధిత వివిధ ప్రబోధనలు చర్చకు వచ్చినట్లు గ్రహిస్తారు. కాని ఆచరణాత్మకంగా ఈ సమస్త ఫిఖ్హా వాదనలు కూడా ఇస్లాం ప్రబొధనల బాహ్యరూపం / ఆకారంపైనే కొనసాగుతాయి. ఫిఖ్హా యొక్క ఈ విధానం(patron), సూత్రబద్ధంగా కాకుండా పరిస్థితుల ప్రభావం(situational factor) ఆధారంగా తయారు చేయబడింది. ఒకవేళ మీరు ఖురాన్ను గనుక అధ్యయనం చేసినట్లైతే ఖురాన్లో పూర్తి ప్రాధాన్యత కేవలం ఇస్లాం యొక్క ఆత్మ(spirit)కే ఇవ్వటం జరిగిందనే విషయాన్ని తెలుసుకుంటారు. కాని ఎప్పుడైతే ఒక shift of emphasis(ప్రక్కదారి పట్టించే)వ్యవహారం ఎదురౌతుందో అప్పుడు, మొత్తం ప్రాధాన్యత ఆత్మకు బదులు, కేవలం బాహ్యరూపానికి / ఆకారానికి మాత్రమే ఇవ్వటం జరిగింది.

## ఖురాన్ పేట్రన్(patron)కి బదులు ఫిఖ్హా పేట్రన్(patron)

ఇక ఆ తరువాత ఈ ఫిఖ్హా వ్యవహారం పండితుల నడుమ మరింత సర్వసాధారణమైపోయింది. తరువాతి తరాల పండితులు కూడా ఇదేవిధానాన్ని ప్రామాణికంగా తీసుకున్నారు. వారు ఇదే ధోరణిలో ఆలోచిస్తూ, ఇదే ధోరణిలో గ్రంథాలను వ్రాయటం కూడా ప్రారంభించారు. చివరికి ఈ ఫిఖ్హా మార్గదర్శకత్వం (patron)ఎంతవరకు వెళ్ళిందంటే, తరువాతి కాలంలో వ్రాయబడిన ఏ ఒక్క పుస్తకం కూడా దీనికి అతీతంగా లేదు.

ఉదాహరణకు ఇబ్నెతైమియా(మ:క్రీ.శ.1328)వ్రాసిన పుస్తకం"ప్రవక్త నిందితునిపై నగ్నఖడ్గం" ఇదే శైలి (మిన్హాజ్)కి చెందిన ఒక పుస్తకం. రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించే వ్యక్తికి మరణదండన విధించాలని ఈ పుస్తకంలో ఇబ్నె తైమియా వ్రాశారు. ఈవిధంగా ఎందుకు వ్రాశారంటే, ఫిఖ్హా గ్రంథాల్లో ఆవిధంగా ఉందికాబట్టి. కాని ఖురాన్ గ్రంథంలో మాత్రం ఇటువంటి సూత్రం ఎక్కడా చెప్పబడలేదు. ఒకవేళ ఇబ్నె తైమియా గనుక ఫిఖ్హా పుస్తకాలకు అతీతంగా ఎదిగి, ఈ అంశంపై ఖురాన్ ఆత్మ(spirit) ప్రకారం ఆలోచించి ఉన్నట్లైతే, రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించే వ్యక్తిని ఒక సందేశగ్రహీతగా భావించి, అతనికి సందేశం ఇవ్వాలితప్పా హతమార్చటం కాదు అనే విషయాన్ని తన పుస్తకంలో వ్రాసి ఉండేవారు. దూషణకర్త, స్థూలదృష్టికైతే శత్రువుగా కనబడినప్పటికీ తన నైజం దృష్ట్యా అతడు కూడా ఒక

మనిషే. ఒకవేళ అతనికి ఇస్లాం ధర్మాన్ని జ్ఞానయుక్తమైన పద్దతిలో పరిచయం చేస్తే, బహుశా అతడు దాని వాస్తవికతను అర్థం చేసుకొని, తన శత్రుత్వాన్ని మిత్రుత్వంగా మార్చుకునే అవకాశం ఉంటుంది (41:34)

ఇటువంటిదే మరో ప్రముఖ పుస్తకం, షాహ్ వలియుల్లాహ్ దహెల్వి(మ:క్రీ.శ.1762)వ్రాసింది: "హుజ్జతుల్లహ్ అల్-బాలిఘ"(God's great arguement / The Conclusive Argument From God). ఈ పుస్తకం పేరును(title)స్వయంగా ఖురాన్లోని ఒక వాక్యం(6:149) నుండి తీసుకోవటం జరిగింది. కాని ఆచరణాత్మకంగా మాత్రం ఈ పుస్తకం, ఖురాన్ మార్గదర్శకత్వం(patron) తో వ్రాయబడలేదు. దానికి బదులుగా ఫిఖ్హా మర్గదర్శకత్వం(framework)లో వ్రాయబడింది. కాబట్టే, ఈ పుస్తకంలో చర్చించబడిన సమస్త విషయాలు కూడా ఫిఖ్హాశైలి(Acadamical method)పైనే ఆధారపడి ఉన్నాయి. ఉదాహరణకు ఈ పుస్తకంలో పందిపుల్ల(మిస్వాక్)నుండి మొదలు జిహాద్ వరకు గల అంశాల అధ్యాయాలు ఉన్నాయి. కాని ఇందులో ఆ సర్వేశ్వరుని సందేశ సమాచారం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. ఒకవేళ ఈ పుస్తక రచయిత ఖురాన్ అధ్యాయాలను గనుక పరిశీలనగా అధ్యయనం చేసిఉన్నట్లైతే, ఖురాన్లో ఆ సర్వేశ్వరుని సందేశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడిందనే విషయాన్ని గ్రహించి ఉండేవారు. ఎందుకంటే, ఖురాన్ యావత్తూ ఒక సందేశ గ్రంథం కాబట్టి.

## ప్రవక్తను తూలనాడే వ్యవహారం

యావత్ ఫిఖ్హావేత్తల ఏకాభిప్రాయం ఏమిటంటే, ఏ వ్యక్తైతే రుషీశ్వరుడైన ముహమ్మద్ను తూలనాడుతాడో -ఒకవేళ అది శైగలతోనైనా సరే- ఆ వ్యక్తికి తప్పనిసరి శిక్ష ఏమిటంటే, మరణదండన అనేది. ఈ విషయంలో కేవలం అతితక్కువ ఫిఖ్హావేత్తలు మాత్రమే మినహాయింపుదారులు. మరణదండనకు సంబంధించిన ఆజ్ఞలను జారీచేసిన పుస్తకాలను ఈ క్రింద పేర్కొనటం జరిగింది. గమనించగలరు.

1. రుషీశ్వరుని దూషణకర్తపై నగ్న ఖడ్గం - ఇబ్నెతైమియా

2. ప్రవక్తను ఎగతాళి చేసినవాడికి మరణదండనే శరణ్యం - తఖియుద్దీన్ అబుల్ హసన్

3."దూషణకర్త -శిక్షా నియమావళి " - ఇబ్నె ఆబిదీన్ అష్-షామి

ఈ సమస్యపై ఎవడైనా ఎప్పుడైనా ఏదైనా ఒక వ్యాసంగాని లేక ఒక పుస్తకంగాని వ్రాస్తే, వాడు, ఈపై పుస్తకాల నుండే విషయాన్ని తీసుకొని, రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించేవాడిని హతమార్చేయాలనే విషయాన్ని నిరూపించటానికి తీవ్ర కృషిచేస్తాడు. అంతేకాకుండా, బహుశా ఈ సమస్యపై ఫిఖ్హావేత్తల్లో ఏవిధమైన భిన్నాభిప్రాయం కూడా లేకుండా ఏకాభిప్రాయంతో ఉన్నారనేవిధంగా తన వ్యాసాన్ని/ పుస్తకాన్ని వ్రాస్తాడు.

అయితే ఇక్కడొక ప్రశ్న ఉదయించేదేమిటంటే, ప్రవక్తను దూషించినవాణ్ణి హతమార్చేయాలనే విషయమే షరియత్(ఇస్లామియా చట్టం)లో గనుక ఉన్నట్లైతే, ఈ వ్యవహారం ఇస్లాం ప్రారంభపు కాలంలో ఎందుకు లేదనేది? ఇస్లాం ప్రారంభపు కాలంలో అనేక మంది ప్రజలు రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించే ఘటనలు అనేకం ఆనాటి ఇస్లామియా చరిత్రలో ఉన్నాయి. కాని వారిని హతమార్చటం జరగలేదు. ఈ సందర్భంగా అత్యంత స్పష్టమైన ఒక ఉదాహరణ ఏమిటంటే, మదీనాకు చెందిన అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్నె సలూల్. ఇతడు రుషీశ్వరుడైన ముహమ్మద్ను బహిరంగంగా దూషించేవాడు. ఇతణ్ణి హతమార్చటానికి మాకు అనుమతి ఇవ్వండని ప్రజలు ఎంతగా పట్టుపట్టినప్పటికీ రుషీశ్వరుడైన ముహమ్మద్ అనుమతించ లేదు సరికదా అతణ్ణి క్షమించివేసారు. చివరికి అతడు తన సహజమరణాన్నే పొందాడు.

తన దూషితునికి మరణదండన విధించకపోవటానికి కారణాన్ని వివరిస్తూ,"రుషీశ్వరుడైన ముహమ్మద్ అతనికి మరణదండన విధించలేదు. ఎందుకంటే, అతణ్ణి హతమార్చినట్లైతే ప్రజలు ఇస్లాం విషయంలో భయాందోళనలకు గురైతారనే అనుమామనం ప్రవక్తవారికి ఉండేది. ఆనాడు ఇస్లాం బలహీనస్థితిలో ఉండేది కాబట్టి" అని ఇబ్నె తైమియా వ్రాసారు. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, ఇస్లాం ప్రారంభపు కాలంలో మరియు అబ్బాసియా పరిపాలనా కాలంలో ఏర్పడిన ఈ రెండు ఫిఖ్హాల్లో ఉన్న వ్యత్యాసం ఏమిటనేది?

మనందరికి తెలిసిన విషయం ఏమిటంటే, 1989 ఫిబ్రవరిలో ఇరాన్ మత నాయకుడు ఆయతుల్లాహ్ ఖుమైని, ప్రవక్తను దూషించిన కారణంగా Satanic Verses రచయిత సల్మాన్ రష్దీకి వ్యతిరేకంగా ఫత్వా(తీర్పు)ను జారీచేసారు. కాబట్టి ముస్లింల కర్తవ్యం ఏమిటంటే, సల్మాన్ రష్దీని హతమార్చేయటం. ఎప్పుడైతే ఈ ఫత్వా పత్రికల్లో ప్రచురించబడిందో, అప్పుడు, కేవలం ఈఒక్క వ్యాసరచయిత(మౌలనా వహీదుద్దీన్ ఖాన్)తప్ప, యావత్ ప్రపంచ ముస్లింలు ఈ ఫత్వాను సమర్ధించారు. ఈ సందర్భంగా అనేకానేక వాదనలు జరిగాయి. కాని ప్రపంచ ముస్లింలందరి సమర్ధన ఉన్నప్పటికీ సల్మాన్ సమ్మరణ

సాధ్యపడలేదు సరికదా తిరిగి ఈ ఫత్వా మరియు దానికి ముస్లింల మద్దతు కారణంగా ఇస్లాంధర్మం యావత్ ప్రపంచంలో అభాసుపాలైపోయింది. చివరికి దాని(ఇస్లాం)రూపం ఒక క్రూరమైన మతంగా మారిపోయింది.

ఈ ఆధునిక యుగంలో భావప్రకటనా స్వేచ్ఛను మానవుల అతిపెద్ద హక్కుగా భావించటం జరిగుతుంది. బహుశా అది వారి మతం అని చెప్పవచ్చు. కాబట్టే, ఈ యావత్ ఆధునిక ప్రపంచం ఈ ఫత్వా(తీర్పు)ను తమ మతం(భావప్రకటనా స్వేచ్ఛ)పై దాడిగా భావించి, పూర్తి బలంతో సల్మాన్ రష్దీకి రక్షణగా నిలబడి పోయింది. దీనితోపాటు ఆధునిక సమాచార వ్యవస్థ(మీడియా)ఈ వ్యవహారాన్ని ఎంతవరకు వ్యాపింప జేసిందంటే, ప్రపంచంలో మారుమూలన ఉన్న ప్రతిఒక్కరికి ఈ సమాచారం చేరిపోయింది. దీనినిబట్టి అర్థమౌతున్న విషయం ఏమిటంటే, రుషీశ్వరుడైన ముహమ్మద్ ఏ భయం(అనుమానం)తోనైతే మదీనాకు చెందిన అబ్దుల్లాహ్ బిన్ ఉబైను హతమార్చటానికి వెనుకాడారో, అదే భయం(అనుమానం) సల్మాన్ రష్దీకి వ్యతిరేకంగా ఇచ్చిన మరణదండన, ఫత్వా రూపంలో వేయిరెట్ల భారీఎత్తున ఇస్లాం అనుయాయులకు పనికొచ్చింది.

ఇప్పుడు మనం ఈ రెండు పరస్పర భిన్న ఉదాహరణలను పరిశీలిద్దాం. రుషీశ్వరుడైన ముహమ్మద్ ఉదాహరణ చూపించేదేమిటంటే, ప్రవక్త దూషణ ఎంతటి తీవ్రమైనది అయినప్పటికీ, ఒకవేళ దూషితుణ్ణి హతమార్చినట్లైతే దాని పర్యవసానం ఏమౌతుందనేది చూడటం జరుగుతుంది. మరణశిక్ష ద్వారా ఉత్పన్నమయ్యే ప్రతికూల పర్యవసానాలపై ఒకవేళ తమ పట్టులేనప్పుడు ఇస్లాం అనుయాయులు మరణదండనా చర్యను చేపట్టకూడదు. ఈ వ్యవహారాన్ని ఆ సర్వేశ్వరుని నిర్ణయానికే వదిలేయాలి. అయితే దీనికి భిన్నంగా ఫిఖ్హావేత్తల ఉదాహరణ చెప్పేదేమిటంటే, ప్రవక్తను దూషించిన వ్యక్తిని వెంటనే హతమార్చేయాలి అనేది.

అయితే ఇప్పుడొక ప్రశ్న ఏమిటంటే, ఆధునిక కాలపు ముస్లింలు ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ ఉదాహరణతో ఎందుకని మార్గదర్శకత్వం పొందలేకపోయారు? వీరి దృష్టంతా కేవలం ఫిఖ్హావేత్తల సిద్ధాంతాలపైనే ఉండిపోయింది? అనేది. ఫిఖ్హావేత్తల అనుసరణలో వీరందరు ఏకమై దూషణకర్తకు మరణశిక్ష అనే సిద్ధాంతానికి ధ్వజవాహకులైపోయారు.

ఈ ప్రశ్నకు జవాబు ఏమిటంటే, కేవలం "గ్రుడ్డి అనుసరణ"(తఖ్లీద్)అనేది మాత్రమే. ఆధునిక కాలంలోని ముస్లింలు సార్వత్రికంగా నిర్ణయించుకున్న విషయం ఏమిటంటే, రుషీశ్వరుడైన ముహమ్మద్ అనుచర

సంఘానికి, నేరుగా ఖురాన్ మరియు సున్నత్ల(ప్రవక్త సాంప్రదాయాల)నుండి విషయ వివరణా / అన్వయింపు ద్వారాలు మూసుకుపోయాయి అనేది. ఇప్పుడు వారికోసం కేవలం నిర్ణయింపబడిన (established)నిర్వచనాల ద్వారాలు మాత్రమే తెరుచుకొని ఉన్నాయి అనేది. మరోవిధంగా చెప్పాలంటే, ఇప్పుడు ముస్లింలు ఖురాన్ మరియు సున్నత్ల నుండి ప్రత్యక్షంగా తమ సమస్యల పరిష్కారాన్ని గ్రహించలేరు. వారు కేవలం ఫిఖ్హావేత్తల ఫత్వా(తీర్పు)లను మాత్రమే తెలుసుకొని సంపూర్ణ భావోద్వేగంతో వాటిపై సుస్థిరంగా ఉండిపోవటం ఒక్కటే వారికున్న ఏకైకమార్గం. కాబట్టే వారు, సల్మాన్ రష్దీ విషయంలో అదే చేసారు.

గతంలో చెప్పినట్లు, ఎప్పుడైతే ఇస్లాం అనుయాయులు సంపూర్ణ అధికారంతో విరాజిల్లుతుండేవారో, అప్పుడే ఈ ఫిఖ్హా జననం కూడా జరిగింది. వారికి, పరిస్థితులపై ఎంతటి పట్టు(control)ఉండేదంటే, ఏదైనా ఒకజాతి నుండి తిరుగుబాటు వాసనలు గనుక వచ్చినట్లైతే, అక్కడున్న ఖలీఫా కేవలం ఒక్క బెదిరింపు లేఖ వ్రాసిన వెంటనే అవతలి పక్షం అధైర్యానికిలోనై కూర్చుండిపోయేది.

కాని ఆధునిక కాలంలో పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు ఇస్లాం అనుయాయులకు గతంలో మాదిరిగా పరిస్థితులపై పట్టు(ఆధిపత్యం)లేదు. అంతేకాకుండా వారికి వ్యతిరేకంగా అనేక ప్రతికూల పరిస్థితులు కూడా ఏర్పడిపోయాయి. ఉదాహరణకు, స్వేచ్ఛాయుత ఆధునిక యుగంలో మహోన్నత శ్రేయపు(summum bonum)స్థాయికి చేరిపోవటం, అలాగే భావప్రకటనా స్వేచ్ఛను పవిత్రమైన హక్కుగా పరిగణించటం. ఇదేవిధంగా ఆధునిక ప్రసార మాధ్యమం(media)ఉనికిలోనికి రావటం మొదలైనవి. అన్నట్లు ఈ మీడియాను వేడివేడి వార్తల(hot-news)ప్రజావేదిక(people agency)గా చెప్పవచ్చు.

మారిపోయిన ఈ సరిక్రొత్త పరిస్థితుల కారణంగానే, యావత్ ప్రపంచ ముస్లింల మద్దతు ఉన్నప్పటికీ సల్మాన్ రష్దీని ఏమీ పీకలేకపోయారు. అంతే కాకుండా ఇస్లాం అభాసుపాలై పూడ్చలేనంత స్థాయిలో నష్టపోయింది. అలాగే, (దేవుడు రక్షించుగాక!) ఆధునిక మానవుని దృష్టికి ఇస్లాం ఒక ఉగ్రవాద మతంగా కనబడుతుంది. తన అనుయాయులకు అది మతమౌఢ్యాన్ని(fanaticism)న్ని నూరిపోస్తుందని కూడా ఆధునికుడు భావిస్తున్నాడు. అయితే ఈవిధంగా జరగటానికి ప్రధాన కారణం ఏమిటంటే, మారిపోయిన ఈ ఆధునిక కాలంలోకూడా,  తమ అధికార ప్రాబల్యపు కాలంనాటి స్వకల్పిత ఫిఖ్హాను(ధర్మశాసనాన్ని) హుకుం(ఆజ్ఞ)గా జారీచేయటం మాత్రమే అని చెప్పవచ్చు.

సల్మాన్ రష్దీ విషయంలో ఆధునిక కాలంలోని ముస్లింలు ఒకవేళ “సంపూర్ణ మేధోమదన”(ఇజ్తిహాదే ముతల్లఖ్)విధానాన్ని గనుక అవలంభించి ఉన్నట్లైతే(అంటే, బుద్ధిజ్ఞానాలతో వ్యవహరించి ఉన్నట్లైతే), ఖురాన్ మరియు సున్నత్ల నుండి వారు మార్గదర్శకత్వాన్ని పొందిఉండేవారు. ఈ సమస్యకు పరిష్కారం, మరణశిక్ష కాదుగాని శాంతియుత పద్ధతుల్లో సందేశ / సంస్కరణా కార్యాన్ని చేపట్టటం మాత్రమే అనేది కూడావారు గ్రహించి ఉండేవారు. కాని, తమ అంధానుకరణా నైజం(తఖ్లీద్)కారణంగా తమ పూర్వపు నాయకత్వ కాలంలో నిర్మితమైన ఫిఖ్హా అనే చట్రం(fikhhaa frame)లో చిక్కుకుపోయారు. అందుకే, "రుషీశ్వరుని దూషణకర్తకు మరణదండన" అనే ఫిఖ్హా పుస్తకాల్లోని అధికారదర్పపు రాజాజ్ఞ వీరికి కనబడింది.

# డైరి నుండి కొన్ని విషయాలు

## 18, ఫిబ్రవరి,1989

న్యూఢిల్లి నుండి వెలువడే ఆంగ్లపత్రిక టైంస్ ఆఫ్ ఇండియా 18,ఫిబ్రవరి,1989 నాటి తన సంపాదకీయంలో సాతానిక్ వర్సెస్ రచయిత సల్మాన్ రష్దీ విషయంలో Satanic fall-out అనే మకుటంతో ఒక వ్యాసాన్ని ప్రచురించింది.

ఈ వ్యాసంలో ఇరాన్ మతనాయకుడు ఆయతుల్లాహ్ ఖుమైని, సల్మాన్ రష్దీని హతమార్చేయమని ముస్లింలకు జారీచేసిన ఫత్వా(తీర్పు)ను విమర్శించటం జరిగింది. పత్రిక ఎడిటర్ దిలీప్ పీట్గావంకర్ తన ఎడిటోరియల్లో వ్రాస్తూ..."విదేశీప్రాంతంలో ఉంటున్న ఒక విదేశీయుణ్ణి హతమార్చేయండని ఇచ్చిన ఈ ఫత్వా, ఉగ్రవాదం(Terrorism)తో సమానం"అని అంటూ, ఆయన మరో విలువైన విషయాన్ని ప్రస్తావించారు. అదేమిటంటే,"మొందువైఖరి, అసహనం మరియు దూకుడుతో కూడుకున్న ఆయతుల్లాహ్ ఖుమైని యొక్క ఈ ధర్మనిర్వచనానికి ఇస్లాంధర్మంతో ఏమాత్రం సంబంధంలేదు"అని. (Islam can't be equated with the Ayatullah's rigid, intolerant and aggressive interpretation of it).

దీనినిబట్టి అర్థమౌతున్న విషయం ఏమిటంటే, ఖుమైనియత్వం వేరు, ఇస్లాం వేరు అనేది. నిస్సందేహంగా వాస్తవం కూడా ఇదే. కాని టైంస్ ఆఫ్ ఇండియా సంపాదకుని నోటనుండి వెలువడిన ఈ వాస్తవం సమర్థించే విషయమేమిటంటే, ఈ దేశంలో కొందరు పక్షపాతంతో జీవించే వ్యక్తులతోపాటు అధికశాతం ప్రజలు పక్షపాతానికి మరియు మతతత్వానికి అతీతంగా ఎదిగి ఆలోచించేవారు కూడా జీవిస్తున్నారనేది.

## 6, మార్చ్, 1989

రుషీశ్వరుణ్ణి దూషించిన వ్యక్తిని హతమార్చాలనే సిద్ధాంతాన్ని ఆ తరువాతి ముస్లిం పండితులు తయారు చేసుకున్నారు. ఈ సిద్ధాంతాన్ని సమర్ధించే ఒక్క వాక్యం కూడా ఖురాన్ మరియు హదీసు మూలాల్లో లేదు. ఈ వ్యవహారమంతా కూడా కేవలం ఊహాత్మకం మరియు స్వయంకల్పితం మాత్రమే. స్వయంగా

రుషీశ్వరుడైన ముహమ్మద్ జీవితంలోనే అనేకమంది అరబ్బులు ఆయనను ఎగతాళి చేసేవారు. కాని ఆయన మాత్రం వారిని హతమార్చలేదు. ఒకవేళ ఆయనే గనుక వారిని హతమార్చి ఉంటే, ఇస్లాం అనే చరిత్రే ఉండేదికాదు. ఎందుకంటే, ఎగతాళి చేసిన ఈ ప్రజలే ఆ తరువాత ఇస్లాం స్వీకరించి, దానిని బలోపేతం చేసారు కాబట్టి.

ఇబ్నుల్ ఖయ్యిం తన పుస్తకం "జాదుల్ మఆద్"(5వ అధ్యాయం, 61వ పేజి)లో ఈ సిద్ధాంతాన్ని చర్చిస్తూ, 'పూర్వపు అరబ్బులో, రుషీశ్వరుడైన ముహమ్మద్ న్యాయవిధానంపై ఆగ్రహం వెలిబుచ్చిన అనేక మంది ప్రజలు ఉండేవారు. కాని ఆయన మాత్రం వారిని హతమార్చలేదు. దీనికి కారణం ఏమిటంటే, వారిని హతమార్చే అధికారం ఆయనకు ఉంది. ఇలాంటి వారిని శిక్షించటానికి లేక వారిని స్వతంత్రులు చేయటానికి కూడా ఆయనకు అధికారం ఉండేది. కాని రుషీశ్వరుడైన ముహమ్మద్ అనుయాయులకు అతని(ముహమ్మద్)హక్కును స్వీకరించటాన్ని రద్దుపరచటం సమంజసం ఎంతమాత్రం కాదు.

ఇబ్నుల్ ఖయ్యిం వారి ఈ సమర్ధన అత్యంత బలహీనమైంది. వాస్తవమేమిటంటే, ఇటువంటి సమర్ధనను ఒకవేళ షరియత్లో ప్రముఖమైనదిగా అంగీకరించినట్లైతే, అప్పుడు, షరియత్ యొక్క యావత్ వ్యవస్థ కూడా నిర్వీర్యమైపోయి ఉండేది.

## 14, సెప్టెంబర్, 2007

ఈరోజు హిజ్రి 1428 రంజాన్ నెల మొదటి తారీకు. హదీసులో ఉపవాసం విషయంలో ఈవిధంగా చెప్పబడింది:"ఎవడైతే తాను అసత్యాన్ని మాట్లాడటం మరియు అసత్యాన్ని అనుసరించటం వదులుకోడో, ఆ వ్యక్తి తన అన్నపానియాలను వదలుకోవటమనేది, సర్వేశ్వరుని దృష్టిలో పనికిరానివిగా మారిపోతాయి. (బుఖారి, హదీసు నెం:1903)

ఈ హదీసులో చెప్పబడిన “అసత్యాన్ని మాట్లాడటం” మరియు “అసత్యాన్ని అనుసరించటం” అంటే, realistic approachను కోల్పోవటమని అర్థం. అలాగే, అసత్యం ప్రాతిపదికగా తన ఆచరణా ప్రణాలికను రూపొందించటమని కూడా అర్థం. ఉదాహరణకు, ప్రవక్తను దూషించాడని ఒకవ్యక్తిపై కల్పిత ఆరోపణ చేసి, అతణ్ణి హతమార్చేయండనే ఫత్వా (తీర్పు)ను జారీచేయటం. అలాగే, అమెరికాను ఇస్లాంకు

శత్రువుగా తీర్మానించి, దానికి వ్యతిరేకంగా చేసే ప్రతి హింసాయుత కార్యాన్ని కూడా ఇస్లాం పరిరక్షణగా తీర్పునిచ్చి సమంజసమైందిగా భావించటం మొదలైనవి.

## 18, ఫిబ్రవరి, 2013

రుషీశ్వరుడైన ముహమ్మద్ను తూలనాడటం లేక దూషించటమనేది, మరణదండనార్హమైన నేరం అనే సిద్ధాంతాన్ని నేను వ్యక్తిగతంగా తప్పు అని భావిస్తున్నాను. ఈ సిద్ధాంతం ఇటు ఖురాన్లోగాని, అటు హదీసులోగాని లేదు. అబ్బాసి కాలంలోని ఫిఖ్హావేత్తలు ఈ సిద్ధాంతాన్ని రూపొందించారు. నేను వ్యక్తిగతంగా ఈ సిద్ధాంతాన్ని ఫిఖ్హాపరమైన బిద్దత్ (శాస్త్రంపేరుతో శాస్త్రులు ఒకక్రొత్త విషయాన్ని శాస్త్రంలో ప్రవేశపెట్టటం)అంటాను.

ఈ వ్యవహారం యొక్క మరోకోణం ఏమిటంటే, రుషీశ్వరుణ్ణి దూషించటమంటే, ముహమ్మద్ను దూషించటం కాదు. స్వయంగా ఫిఖ్హావేత్తల ప్రకారం, దీని సంబంధం ఆ సర్వేశ్వరునితో మరియు యావత్ దైవసందేశహరులతో అలాగే ముహమ్మద్తో కూడా ఉంది. కాని ముస్లింలు మాత్రం ఈ వ్యవహారాన్ని కేవలం ముహమ్మద్ దూషణగా చిత్రీకరించేసారు. దేవుని విషయంలో అత్యంత దారుణమైన మాటలు చెప్పబడుతున్నప్పటికీ ఏఒక్క ముస్లిం కూడా దీనిపై రగిలిపోడు. అలాగే స్వయంగా ముస్లింలపైనే అనేక దారుణాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ దీనిపై కూడా ఏఒక్క ముస్లిం స్పందించడు. ముస్లింలు కేవలం ఇస్లామియా రుషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించినప్పుడే అసాధారణ రీతిలో రగిలిపోతారు. ఫిఖ్హా ప్రకారం, ఇలాంటి పోకడ నిస్సందేహంగా మూర్ఖత్వమే ఔతుంది. ముస్లింల ఈ ప్రవర్తన ఇస్లామియా ప్రవర్తన ఎంతమాత్రం కాదు. ఇదొక స్వయంకల్పిత షరియతేగాని, ఇస్లామియా షరియత్ మాత్రం కాదు.

## 17, ఏప్రిల్, 2006

లాహోర్ నుండి వెలువడే మాసపత్రిక "ముహద్దిస్"లో మార్చ్17, 2006న "ప్రవక్త దూషణ - రుషీశ్వరుని ప్రకటన"అనే మకుటంతో ఒక వ్యాసాన్ని ప్రచురించటం జరిగింది.

ఈ వ్యాసాన్ని వ్రాసినవారు హదీసు పండితులు మౌలానా ముహమ్మద్ అలి జాబాస్ గారు. ప్రవక్త దూషణ విషయంలో ఆయనగారు తన వ్యాసంలో ఒక హదీసును ఈవిధంగా పొందుపరిచారు:"రుషీశ్వరుణ్ణి దూషించిన వానిని హతమార్చాలి, అలాగే రుషీశ్వరుని సహచరులను దూషించిన వానికి కొరడాదెబ్బలు కొట్టాలి"-(నగ్నఖడ్గం 41వ పేజి). ఈ హదీసును ఆయన ఇబ్నె తైమియా వ్రాసిన పుస్తకం "ప్రవక్త దూషితునిపై నగ్నఖడ్గం"92వ పేజి నుండి నకలు చేసారు. నేను ఈ హదీసును ఇబ్నె తైమియా పుస్తకం నుండి తీసాను. అప్పుడు తెలిసిందేమిటంటే, ఈ హదీసు సహాసిత్తాలో(హదీసు భాండాగారానికి సంబంధించిన ఆరు ప్రామాణిక గ్రంథాల్లో)లేదనేది. పచ్చిపచ్చి ఉల్లేఖనాలతో నిండియున్న కొన్ని పుస్తకాల నుండి తీసిన రెఫరెన్సులతో ఆయనగారు తన వ్యాసాన్ని నింపేసారు. అంతేకాకుండా ఇబ్నె తైమియా స్వయంగా ఈ హదీసును బలహీనమైన ఉల్లేఖనంగా పరిగణించారు(ప్రవక్త దూషితునిపై నగ్నఖడ్గం,ఇబ్నె తైమియా 93వ పేజి) ఇటువంటి పరిస్థితుల్లో ఈ హదీసును తీసుకొని రుషీశ్వరుణ్ణి దూషించిన వ్యక్తికి మరణదండన విధించండని ఫత్వా(తీర్పు)ఇవ్వటమనేది, స్వయంగా అదొక క్షమించరాని ధైర్యం (దూకుడు వ్యవహారం)అని చెప్పవచ్చు.

## ఆధునిక భావజాలం మరియు ఇస్లాం

ఆధునిక భావజాలం(modern mind)యొక్క ఒక ఆధునిక సమస్య ఏమిటంటే, ఇస్లామియా ప్రాచీన విధానం, ఆధునిక ప్రపంచంతో విభేదిస్తుందనేది. ఈ కారణంగానే ఇస్లాం ఆధునిక ప్రపంచానికి అభావం (misfit)గా మారిపోయింది.

ఉదాహరణకు: ఆధునికుల ఆలోచన ప్రకారం, ఎప్పుడైతే ఆధునిక కాలంలోని ప్రభుత్వాలు ప్రజాస్వామ్య (democracy/government of the people)సూత్రాలపై తమ పాలనను సాగించాలని భావిస్తున్నాయో, అప్పుడు ఇస్లాం, తన ప్రాచీన చట్టాధారితమైన పాలనను స్థాపించాలని భావిస్తుందనేది.

అలాగే, "భావప్రకటనా స్వేచ్ఛను ఈ ఆధునిక ప్రపంచం షరతులులేని హక్కుగా భావిస్తున్న తరుణంలో, ఇస్లాం ఆ భావప్రకటనా స్వేచ్ఛను అంగీకరించదు. ఎప్పుడైతే ఈ ఆధునిక కాలంలో ఏదైనా ఒక చట్టాన్ని పవిత్రమైందిగా భావించటంలేదో, అప్పుడు సామూహిక జీవనం కోసం ఇస్లాంలో ఏ చట్టాలైతే ఉన్నాయో, వాటిని పవిత్రమైనవిగానూ మరియు వైవిధ్యమైనవిగానూ భావించటం జరుగుతుంది. ఇస్లాం తన

అనుయాయుల కోసం ఒక ప్రత్యేక గుర్తింపు(identity)ని ఏర్పరచుకోండని ఆజ్ఞాపిస్తుంది, కాని ఇటువంటి ధృక్పథం ఆధునిక కాలంలో ఒక వింతైన ధృక్పథం. ఇస్లాంలో జాతీయత(nationhood)ను మతం ఆధారంగా నిర్ణయించటం జరుగుతుంది, కాని ఆధునిక కాలంలో దేశాధారిత జాతీయత (homeland-based nationality)ఆధారంగా నిర్ణయించటం జరుగుతుంది. ఇలాంటివే ఇంకా మొదలైనవి" అని ఆధునిక ప్రపంచం భావిస్తుంది.

ఇస్లాం విషయంలో ఇటువంటి సమస్త ఆలోచనలు కూడా కేవలం ఒక అపోహపై ఆధారపడిన విషయాలు మాత్రమే. అయితే వీటికి కారణం కేవలం, ముస్లింలను మరియు ఇస్లామును వేరు చేయకపోవటమే. ఆధునిక కాలంలో దేని ఆధారంగానైతే ఇస్లాంకు చెందిన ఏ విషయాలనైతే అనుమానించటం జరుగుతుందో, అవన్నికూడా కేవలం ముస్లింల మదినుండి జనించినవి మాత్రమేతప్పా, ఇస్లామియా ప్రబోధనలతో వాటికి ఏమాత్రం సంబంధంలేదు.

ఈ సమస్త విషయాలు కూడా, తరువాతి కాలంలోని ముస్లింలు స్వయంగా కల్పించుకొని వాటికి ఇస్లాం అనే లేబిల్ ను తగిలించుకున్న విషయాలే. మరోవిధంగా చెప్పాలంటే, ఈ సమస్త విషయాలు కూడా కేవలం గ్రంథంలో చేయబడిన వ్యాఖ్యానాలేగాని, గ్రంథమూలంలో చెప్పబడిన విషయాలైతే మాత్రం కావు. ఉదాహరణకు, ఋషీశ్వరుడైన ముహమ్మద్ను దూషించిన వ్యక్తికి మరణశిక్ష అనే సిద్ధాంతాన్ని తరువాతి కాలంలోని ముస్లిం ఫిఖ్హావేత్తలు(షరియా శాసనాంగకర్తలు)కల్పించిందేతప్పా, ఖురాన్ మరియు సున్నత్ (ప్రవక్త ఆచరణ)లో వీటి జాడే(adderess)లేదు.

## సమాచార వైఖరా? బలవంతపు వైఖరా?

"మీరు ప్రజలకు హితబోధ చేయండి. ఎందుకంటే, మీరు కేవలం హితబోధ చేసేవారు మాత్రమే. మీరు ప్రజలపై ఏవిధంగానూ కాపలాదారులు కారు" అని ఖురాన్ గ్రంథం(88:21-22)లో చెప్పబడింది. ఇదేవిధంగా, "మీరు ప్రజలకు బలవంతం చేసేవారు కారు. ఎవరైతే నా సందేశాన్ని వినటానికి ఇష్టపడతారో వారినే మీరు ఈ ఖురాన్తో హితబోధ చేయండి" అని (50:45)లో కూడా చెప్పటం జరిగింది. ఋషీశ్వరుడైన ముహమ్మద్ ఎప్పుడైనా ఎవరైనా తన ఒక సహచరుణ్ణి ఎక్కడికైనా పంపినప్పుడు ఈవిధంగా

చెప్పేవారని అబూమూసా ఈవిధంగా చెప్పారు:"శుభవార్తను ఇవ్వండి, ద్వేషించకండి. సులువును కలుగజేయండి, ప్రజలను ఇబ్బందులకు గురిచేయకండి"అని బోధించేవారు (ముస్లిం, 1732వ హదీసు)

అన్నట్లు, ఇటువంటి ఖురాన్ వాక్యాలు మరియు హదీసులు సంస్కరణా సందేశకార్యపు హద్దులను నిర్ణయిస్తున్నాయి. దీనినిబట్టి, ఒక సంస్కరణా సందేశదాత "సమాచారం(convey)పరిధి"లో ఉంటూ సందేశాన్ని ఇవ్వాలిగాని, "బలవంతపు పరిధి"లో అతడు ప్రవేశించకూడదని అర్థమౌతుంది. అతని కోసం సమంజసమైన పద్ధతి ఏమిటంటే, నచ్చజెప్పి బుజ్జగించే సమస్త మాధ్యమాలను కూడా అతడు ఉపయోగించవచ్చు. కాని, ధర్మం పేరుతో ధర్నాలు హర్తాళ్ళుగాని, నిరసన-ప్రదర్శనలుగాని చేసి, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే హక్కు మాత్రం లేదు(అబూదావూద్, 2629వ హదీసు). ఉదాహరణకు రుషీశ్వరుని దూషణా వ్యవహారాన్నే తీసుకోండి. దీనిపై ముస్లింలు భారీఎత్తున ఏ నిరసన ప్రదర్శనలైతే చేపట్టారో, వాటిని ఇస్లామియా ప్రబోధనలు ఏమాత్రం అంగీకరించవు. ఇక్కడొక సంస్కరణా సందేశదాతకు చేయవలసిన పని ఏమిటంటే, అతడు రుజువులతో సహా రుషీశ్వరుని జీవిత చరిత్రను మరియు అతని సందేశాన్ని ప్రజలకు అందించాలి. "రుషీశ్వరుని దూషణ" అనే ఘటన, అతని సందేశాన్ని శాంతియుత పద్దతుల్లో ప్రజల ముందు ఉంచటానికి ఒకగొప్ప అవకాశాన్ని మీకు అందిస్తుంది.

కాని, కొందరు "ప్రవక్త దూషణ వ్యతిరేక ఉద్యమం" అయితే నడిపారు. వారు దీనికి వ్యతిరేకంగా రోడ్లపై వచ్చి ధర్నాలు చేసారు. ప్రవక్తను దూషించినవాని ఊహాత్మక దిష్టిబొమ్మ (effigy)ను తయారుచేసి దానిని తగలబెట్టారు. దుకాణాలను మూయించారు. అయితే ఇటువంటి ఉద్యమాలు సమంజసం కాజాలవు. ఇవి, "సమాచారం(convey)పరిధి" దాటి, "బలవంతపు పరిధి"లో ప్రవేశించటమే అవుతుంది. ఇటువంటి చేష్టలు, ప్రజలు ఆ సర్వేశ్వరుని నుండి మరియు అతని ధర్మం నుండి దూరం కావటానికి కారణభూతం అవుతాయి. అలాగే, ఈ చేష్టలు దైవసందేశ అవకాశాలను హతం చేసేస్తాయి. దీని వాస్తవికత ఆధారంగా ఇదొక విధ్వంశకర కార్యమేగాని ధర్మపరిరక్షణా కార్యం మాత్రంకాదు.

## శిక్ష దైవసంబంధితమైంది

రుషీశ్వరుడైన ముహమ్మద్ను ఖురాన్ గ్రంథంలో దైవసందేశహరుడు(3:46)అని చెప్పటం జరిగింది. ఈ సందేశ ఉద్యమాన్ని నిర్వర్తించటానికిగాను ఆయనకు ఏ హితోపదేశాలైతే ఇవ్వబడ్డాయో, వాటిలో ఒక

హితోపదేశాన్ని ఈ పదాలతో చెప్పటం జరిగింది:"ఏ విషయానికి సంబంధించిన ఆజ్ఞ అయితే నీకు ఇవ్వబడిందో, దానిని నీవు ప్రజల ముందు ప్రకటించేయ్. దైవేతరారాధకులకు దూరంగా ఉండు. ఈ ఎగతాళి చేసేవారికి బుద్ధిచెప్పటానికి నీ తరపున మేమున్నాము" (15:94-95)

ఈ వాక్యాన్ని, దాని అవతరణా ఉద్దేశ్యంతో చూసినట్లైతే అర్థమౌతున్న విషయమేమిటంటే, ఒక సంస్కరణా సందేశదాత తన పూర్తి ఏకాగ్రతను కేవలం సందేశంపై మాత్రమే కేంద్రీకరించాలనేది. ఆ తరువాత సందేశగ్రహీతల నుండి ప్రతికూల కార్యాచరణ ఎదురౌతుంది. వారు సందేశదాతలను అవహేళన చేస్తారు, దూషణ-దుర్భాషలాడుతారు, ప్రజల దృష్టిలో నీచంగా చూపటానికిగాను అవమానకరమైన మరియు అపహాశ్యంతో కూడుకున్న పదాలను ఉపయోగిస్తారు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక సంస్కర్త (దాయి), ప్రతికార చర్యలకు దూరంగా ఉంటూ, ఏకపక్షంగా తన ప్రత్యర్థులకు దూరంగా ఉండాలి. తన సందేశ(సంస్కరణా)కార్యాన్ని మరింత సహేతుకం చేయటానికి కృషిచేయాలి. చివరికి అతను, ఇటువంటివారి సంస్కరణ కోసం తన ప్రభువుతో ప్రార్థించాలి. "ఓ సర్వేశ్వరా! నీవు నా ఈ వ్యతిరేకులను నాకు సహకరించేవారిగా మలిచేయి. నీవు వీరిని నీ కారుణ్యపు ఛాయల్లో తీసుకో" అని ప్రార్థించాలి. ఆ తరువాత అవహేళన చేసేవారి వ్యవహారాన్ని ఆ సర్వేశ్వరుని నిర్ణయానికే సంపూర్ణంగా వదలివేయాలి. సంస్కర్త(దాయి)యొక్క పని కేవలం శాంతియుతంగా సందేశాన్ని అందించటమేతప్పా, ప్రజలను శిక్షించటంకాదు-(88:21-22)

వాస్తవానికి, స్వేఛను దుర్వినియోగం చేయటంలో భాగమే ఈ దూషణా-దుర్భాషణలనేవి. వీటిస్థితి, శిక్షార్హమైన గంభీర నేరాలు(cognizable offense)మాత్రంకావు. దీనర్థం ఏమిటంటే, దూషణకర్తకు శాంతియుత ప్రబోధన చేయాలేగాని అతణ్ణి నేరస్తునిగా పరిగణించి శారీరక శిక్షను విధించకూడదు. ఈవిషయంలో గుణపాఠం నేర్పే(ప్రబోధన చేసే)బాధ్యత సందేశదాత (సంస్కర్త)కు సంబంధించినదైతే, శిక్షఅనేది దైవసంబంధితమైంది. ఒకవేళ సందేశదాతగనుక దూషణకర్తను శిక్షించటానికి కృషిచేసినట్లైతే, అప్పుడతడు దేవుడు చేయవలసిన పనిని తన చేతుల్లో తీసుకోవటానికి కృషిచేస్తున్నట్లు అర్థం. ఈవిధంగా చేయటం నిస్సందేహంగా ఒక మహానేరానికి ఒడిగట్టటం వంటిదే.

# క్షమా దయాగుణాల ఆజ్ఞ

ఖురాన్ గ్రంథంలోని 45:14లో ఒక వాక్యం ఈ పదాలతో చెప్పబడింది: ప్రవక్తా! విశ్వాసులతో ఇలాచెప్పు "సర్వేశ్వరుని తరపునుండి చెడ్డరోజులు వస్తాయని భయపడనివారి చేష్టలను క్షమించండి. స్వయంగా ఆ సర్వేశ్వరుడు ఒకవర్గం వారికి, వారి సంపాదనకు ప్రతిఫలం ఇవ్వటానికి" అని.

ఈ ఖురాన్ వాక్యాన్ని వ్యాఖ్యానిస్తూ వ్యాఖ్యానకర్త శ్రీ ఖుర్తబి ఈవిధంగా చెబుతున్నారు:"ఖురైషుకు చెందిన ఒకవ్యక్తి, ఉమర్ బిన్ ఖత్తాబ్ ను దూషిస్తూ ఎగతాళి చేసినప్పుడు, ఉమర్ తనను దూషించిన వ్యక్తిని బంధించికొట్టాలని భావించారు. ఆ నేపధ్యంలో ఈ హితోపదేశం చేయటం జరిగింది.

ఖురాన్లోని ఈవాక్యం మరియు ఇతర వాక్యాలద్వారా తెలుస్తున్న విషయమేమిటంటే, దూషణా-దుర్భాషణల వ్యవహారం చట్టపరమైన శిక్షలకు(legal punishment)కు సంబంధించిన వ్యవహారం కాదనేది. ఎవరైనా ఒకవ్యక్తి,(దేవుడు క్షమించునుగాక!)ఆ సర్వేశ్వరుణ్ణి అపహాస్యం చేసినా, రుషీశ్వరుణ్ణి అపహాస్యం చేసినా, ప్రవక్త సహచరులను అపహాస్యం చేసినా, అలాగే ఖురాన్ గ్రంథాన్ని అపహాస్యం చేసినా, ఏమైనాసరే, ఆ వ్యక్తిని ఈ కారణాల వలన చట్టపరమైన నేరస్తునిగా జమకట్టి, శిక్షను విధించ కూడదు. ఈవిషయంలో శిక్షకు సంబంధించిన వ్యవహారమంతా కేవలం ఆ దేవునిదే. ఆ సర్వేశ్వరుడు తన జ్ఞానం మేరకు ఇటువంటివారికి ఏ శిక్ష విధించాలో ఆశిక్ష విధిస్తాడు. ఇటువంటి విషయాల్లో ఏ వ్యక్తినైనా శిక్షించటమంటే, ఇస్లాం ధర్మాన్ని పరిరక్షిస్తున్నామనే ముసుగులో, ఇస్లాంధర్మంతో దారుణమైన శతృత్వం వహిస్తున్నట్లు అర్థం.

దూషణా-దుర్భాషణల వ్యవహారంలో ముస్లింలు చేయవలసిన కర్తవ్యం ఏమిటంటే, వారు ఇటువంటి దూషణలకు పాల్పడిన వ్యక్తి విషయంలో ఆ సర్వేశ్వరుణ్ణి ప్రార్థించాలి, ఆ వ్యక్తితో కలిసి అతనికి హితబోధ చేయాలి, అతనికి రుజువులు చూపించి, సంతృప్తి పరచటానికి కృషిచేయాలి, అతని సంస్కరణకు శాంతియుత ప్రయత్నాలు చేయాలి, ఆ వ్యక్తిని శారీరకంగా శిక్షించే బాధ్యతను తమ చేతుల్లో తీసుకోకూడదు. విశ్వాసిపాత్ర ఈలోకంలో కేవలం ఒక సంస్కర్త పాత్రేగాని,(88:21-22)తలారి పాత్ర కానేకాదు.

# రుషీశ్వరుని అవమానం

రుషీశ్వరుడైన ముహమ్మద్, హి(జి,జిల్ఖాద 6వ తేదీన ఉమ్రాతీర్థం నిమిత్తం మదీనా నుండి మక్కాకు బయలు దేరారు. ఆయనతోపాటు సుమారు 15 వందల మంది సహచరులు కూడా బయలుదేరారు. ఆయనగారు మక్కాకు దగ్గరలో ఉన్న హుదైబియా ప్రాంతానికి చేరుకున్నప్పుడు తెలిసిన విషయం ఏమిటంటే, అప్పటికి దైవేతరారాధకులుగా ఉన్న మక్కా వాసులు తమను మక్కాలోనికి ప్రవేశించకుండా నిలువరించటానికి నిర్ణయించుకున్నారనేది. కాబట్టి ఆయనగారు తన సహచరులతో హుదైబియాలోనే ఆగిపోయారు.

ఆ తరువాత మక్కావాసులతో చర్చలు ప్రారంభమయ్యాయి. ఆ సందర్భంలో మక్కావాసులు వివిధ రకాలుగా రెచ్చగొట్టుడు చేష్టలుచేస్తూ ఉండేవారు. కాని ఆయన మాత్రం కోపోద్రేకాలకు గురికాకుండా ఓర్పుసహనాలు కలిగి వారితో చర్చలను కొనసాగించారు. చివరికి ఇరుపక్షాల నడుమ ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కూడా ఏకపక్షమైందిగానే కుదిరింది. మక్కావారు పెట్టిన ప్రతి షరతును ఆయనగారు అంగీకరించారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రవక్తవారు మక్కాలో ప్రవేశించకుండా ఈ సంవత్సరం ఉమ్రాతీర్థం చేయకుండానే వెనుకకు వెళ్ళిపోవాలి, అలాగే ఒకవేళ ఎవరైనా ఒక మక్కావాసి ముస్లింగా మారి, మదీన వచ్చేస్తేగనుక అతనిని తిరిగి మక్కాకు పంపివేయాలి, ఒప్పందంలో "ముహమ్మదుర్ రసూలుల్లాహ్"(దైవసందేశహరుడు ముహమ్మద్)అనే పదాన్ని తొలగించి, దానికి బదులు, "ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్"(అబ్దుల్లాహ్ కుమారుడు ముహమ్మద్)అనే పదాన్ని వ్రాయమని చెప్పటం మొదలైనవి.

ఇప్పుడొక పరిస్థితి కూడా ఏర్పడింది. అదేమిటంటే, రుషీశ్వరుడైన ముహమ్మద్, ఈ మక్కావాసుల ప్రతిపాదనలను ఎట్టిపరిస్థితుల్లో కూడా అంగీకరించకూడదు అనేది. ఎందుకంటే, ఒకవేళ ఇప్పుడు వీర ప్రతిపాదనలను గనుక ఒప్పుకుంటే, రాబోయేరోజుల్లో అవి మరింత భయంకరంగా ఉంటాయి. ఈరోజు ఉమ్రాతీర్థం చేయకుండా నిరోధించారు, రేపు హజ్ తీర్థం చేయకుండా ఆపుతారు. ఈరోజు మక్కాలో ప్రవేసించకుండా చేసారు, రేపు మదీనాలోకూడా రాకుండా చేస్తారు. ఈరోజు నవముస్లింలను తిరిగి పంపేయమంటున్నారు, రేపు పురాతన ముస్లింలను కూడా తిరిగి పంపేయమంటారు. ఈరోజు దైవ సందేశహరుడు అనే పదాన్ని తొలగించమంటున్నారు, రేపు దేవుడనేపదాన్నే చెరిపేయమంటారు. ఇలా మొదలైనవి షరతులుగా పెడతారు.

కాని, మక్కావాసుల ఇన్నిరకాల మొండివైఖరుల తరువాత కూడా రుషీశ్వరుడైన ముహమ్మద్, పైవిధంగా ఆలోచించలేదు. ఆయనగారు ఈ ఆలోచనలను మాయగాడి (సాతానుని)ప్రేరేపణలుగా భావించి, వాటిని అశ్రద్ధ చేసేసారు. మక్కావాసుల ప్రతి షరతును ఒప్పుకొంటూ, మదీనా తిరుగుప్రయాణం చేసారు. చారిత్రక సాక్ష్యం ఏమిటంటే, ఆయనగారి ఈ"తిరుగుప్రయాణం" మహోన్నత "చర్య"గా ప్రసిద్ధిగాంచింది. ఆ తరువాత సర్వేశరుని సహాయం అందనే అందింది. అంతే, కేవలం రెండు సంవత్సరాల కాలవ్యవధిలోనే మక్కా ఆయన ఆధీనంలో రావటమే కాకుండా, మక్కావాసులు కూడా ఆయనగారి ప్రాణస్నేహితులు అయిపోయారు.

ఆధునిక కాలంలో కూడా ముస్లింలకు ఇటువంటి పరిస్థితులు ఎదురౌతున్నాయి. పైన పేర్కొన్న ప్రతిపాదనలవంటి ప్రతిపాదనలే ఇప్పుడు కూడా ముస్లిమేతర వర్గాల నుండి ప్రతిపాదించబడుతున్నాయి. ఇప్పుడు రుషీశ్వరుడైన ముహమ్మద్ రెండవసారి తన సాంప్రదాయ భాషలో ముస్లింలతో, "నేను మీకోసం దైవమార్గదర్శకుణ్ణి. మీరు అదే చేయండి, ఏదైతే నేను చేసానో" అని వెలుగెత్తి ప్రకటిస్తున్నారు. కాని, ముస్లింలు మాత్రం రుషీశ్వరుని ఈ ఆదేశాన్ని పెడచెవిన పెడుతున్నారు. వారు అసత్య నాయకుల మాటలను అనుసరిస్తున్నారు తప్పా, ముహమ్మద్ మాటలను కాదు.

ఎప్పుడైతే ఇటువంటి పరిస్థితులు ఎదురౌతాయో అప్పుడు, నామమాత్రపు నాయకులు ముస్లింలతో, "చూడండీ! మీరు ఏమాత్రం తగ్గకూడదు, ఒకవేళ మీరు తగ్గితే మరిన్ని మార్పులు జరిగిపోతాయి. చూడండీ, మీరు వారితో ఏమాత్రం రాజీపడకూడదు. ఒకవేళ మీరు రాజీపడితే వారు మరింత ధైర్యవంతులైపోయి మీతో మరింత కఠినంగా ప్రవర్తిస్తారు"అని ముస్లింలను రెచ్చగొడతారు. ఇటువంటి సందర్భాల్లో ముస్లింలు రుషీశ్వరుడైన ముహమ్మద్ ఆదర్శాన్ని ప్రక్కనపెట్టేసి, తమ నాయకుల పిలుపుపై పరుగులు తీస్తారు.

నిస్సందేహంగా ఇదే రుషీశ్వరుని అసలైన దూషణ. ఎప్పుడైతే రుషీశ్వరుడైన ముహమ్మద్ ఒకవైపు పిలుస్తుంటే, మరోవైపు అసత్యపు నాయకులు తమ అసత్యపు నినాదాలవైపునకు ఆహ్వానిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో, ముస్లింలు ప్రవక్త పిలుపును పెడచెవినపెట్టి, నాయకుల పిలుపువైపునకు పరుగెత్తటానికి మించిన రుషీశ్వరుని దూషణ మరొకటి ఏముంటుంది?

ఇది రుషీశ్వరుని దూషణకు సంబంధించి దేవుని ధరణిపై ఈరోజు జరుగుతున్న అత్యంత దారుణమైన ఘటన. రుషీశ్వరుని దూషణకు పాల్పడేవారు ఎవరోకాదు, ఎవరైతే ఈ దూషణ నుండి ఇతరులను నిరోధించటానికి తమ చేతుల్లో జెండాలు పట్టుకున్నారో వారే ఈ అసలైన దూషణకర్తలు.

ముస్లింలు తెలుసుకోవలసిందేమిటంటే, ప్రస్తుత పరిస్థితుల్లో వారి ఈ కార్యాచరణ, అజ్ఞానానికి(ఏమరుపాటుకి)తలబిరుసుతనం తోడయిందని గ్రహించాలనేది. ఇక ఎవరి విషయంలోనైతే ఈ అజ్ఞానానికి తలబిరుసుతనం తోడౌతుందో, వారు ఆ సర్వేశ్వరుని దృష్టిలో కేవలం తమ నేరాన్ని మరింతగా పెంచుకుంటున్నారుతప్పా, ఏమాత్రం తగ్గించుకోవటంలేదు.

## రుజువా? లేక శిక్షా?

ఖురాన్ అనేది ఇస్లాంలో అత్యంత ప్రామాణికమైంది(source book). ఖురాన్లో, దండనార్హమైన కొన్ని నేరాలను(punishable crime) ప్రస్తావించటం జరిగింది. ఖురాన్లో ఎక్కడైతే ఇలాంటి నేరాల ప్రస్తావన వచ్చిందో, అక్కడే వాటికి విధించవలసిన శిక్షల ప్రస్తావన స్పష్టమైన పదాలతో చేయటం జరిగింది.

ఆ నేరాల్లో ఒక నేరానికి సంబంధించిన ఉదాహరణ ఒకటుంది, దానిని ఇస్లాంలో "ఖజ్ఫ్" అంటారు. దానికి ఈవాక్యాన్ని చూడండి:"ఎవరైతే శీలవంతులైన స్త్రీలపై నిందమోపి, తరువాత నలుగురు సాక్షులను తీసుకురాకపోతే, అప్పుడు వారికి ఎనభై కొరడాదెబ్బలు కొట్టండి"(24:4)

ఖురాన్లోని ఈ వాక్యం ద్వారా తెలిసేదేమిటంటే, ఒక పవిత్రమైన స్త్రీ శీలంపై ఎవడైనా ఒకవ్యక్తి నిరాధార నిందారోపణ చేసినట్లైతే, ఖురాన్ దృష్టిలో అది ఎంతటి నేరమంటే, ఆ నేరం న్యాయస్థానం ద్వారా నిరూపింపబడి, శారీరక శిక్ష(physical punishment)విధించేటంతటిది. ఈవిషయంలో ఎప్పుడైతే ఖురాన్ ఒకనేరాన్ని ప్రస్తావించిందో, వెంటనే ఆ నేరానికి నిర్ణయించిన శిక్షను కూడా ప్రస్తావించింది (చూపించింది).

ఇప్పుడు మరోకోణంలో చూద్దాం. ఖురాన్లో చెప్పబడినట్లు, పూర్వకాలంలో ఆ సర్వేశ్వరుడు ప్రతిజాతిలో మరియు ప్రతిప్రాంతంలో తన సందేశహరులను పంపుతూ వచ్చాడు(23:44). ఖురాన్లో మరింతగా చెప్పబడిన విషయమేమిటంటే, ఈ యావత్ సందేశహరులతో వారివారి సమకాలీకులు అదేరకమైన

ప్రతికూల ప్రవర్తనను తీవ్రతర స్థాయిలో కొనసాగించారు, దేనిప్రస్తావన అయితే ఖురాన్లోని ఈ ప్రస్తావిత వాక్యంలో శీలవంతులైన స్త్రీల సందర్భాన్ని పురస్కరించుకొని చెప్పబడిందో. "దాసుల విషయం ఎంతో విచారకరం, ఏ సందేశహరుడు వారివద్దకు వచ్చినా వారు మాత్రం అతనిని ఎగతాళే చేసారు" (36:30)

ఖురాన్లోని సుమారు రెండువందల పైచిలుకు వాక్యాల్లో చెప్పబడిన విషయమేమిటంటే, రుషీశ్వరుల సమకాలీకులు నిరంతరం అవే చర్యలకు పాల్పడ్డారు ఏదైతే ఈరోజుల్లో "ప్రవక్తకు అవమానం"అని పిలవబడుతుందో. ఒకజాతి తనకాలపు రుషీశ్వరుణ్ణి అసత్యవాది(40:24) అంటే, మరోజాతి తనకాలపు ప్రవక్తను వెర్రివాడు(15:6)అని పిలిచేది. అలాగే ఇంకొొకజాతి తన సందేశహరుణ్ణి అబద్ధీకుడు (16:101)అని నిందించేది. ఇకవేరే జాతీయులు తనకాలంలోని దైవప్రవక్తను అవివేకుడు(7:66)గా పిలిచేవారు. ఇంకొందరు వారి ప్రవక్తను ఎగతాళి చేసేవారు(36:30) ఈవిధంగా రకరకాలుగా బాధించేవారు. ఖురాన్లో అనేకచోట్ల ఇటువంటి నిందారోపణా ఘటనల ప్రస్తావన వచ్చింది. కాని, ఇలా ప్రతికూలంగా ప్రవర్తించినవారిని కొరడాలతో కొట్టండని గాని, వారిని హతమార్చేయండనిగాని ఖురాన్లో ఎక్కడా ప్రస్తావించలేదు.

దీనినిబట్టి అర్థమౌతున్నదేమిటంటే, రుషీశ్వరుని దూషణనేది శిక్ష(దండన)కు సంబంధించిన అంశం కాదు. అదొక సంవాదానికి సంబంధించిన అంశం. అంటే, ఏవ్యక్తైతే "ప్రవక్త దూషణ"కు పాల్పడతాడో, అతణ్ణి శారీరకంగా శిక్షించటం జరగదుగాని, అతని బుద్ధిని తట్టిలేపే విధంగా అతనితో రుజువులు అనే భాషలో మాట్లాడటం జరుగుతుంది. మరోవిధంగా చెప్పాలంటే, "ప్రవక్త దూషణకర్తలకు" రుజువుల భాషలో విషయాన్ని వివరించి, వారిని సంస్కరించటానికి కృషిచేయాలేగాని, వారిని చంపటంగాని లేక కొరడాదెబ్బలు కొట్టటంగాని చేయకూడదు.

ఈ సందర్భంగా ఖురాన్లోని ఈ వాక్యాన్ని చూడండి:"వారి హృదయాల్లో ఏదైతే ఉందో, అది సర్వేశ్వరునికి బాగా తెలుసు. అయితే నీవు వారితో దూరంగా ఉండు మరియు వారికి హితబోధ చేస్తూఉండు. మరియు వారి హృదయాలకు హత్తుకునేవిధంగా వారితో మాట్లాడు" - (4:63)

ఈ వాక్యానికిగల అర్థం ఏమిటంటే, ఎవరైతే రుషీశ్వరునికి వ్యతిరేకంగా ప్రతికూల ప్రవర్తన కలిగి ఉంటారో, వారిని శిక్షించటం సర్వేశ్వరుని పని. ఎందుకంటే, ఆయనే వారి హృదయాల స్థితిని గ్రహించ గలడు కాబట్టి. అయితే మీ బాధ్యత ఏమిటంటే, మీరు వారి చేష్టలను పట్టించుకోకుండా వారితో

శ్రేయోభిలాషతో కూడుకున్న హితబోధను వారికి చేయండి. వారి ఆలోచనను తట్టిలేపేవిధంగా సమర్థవంతమైన విధానంలో వారికి హితబోధ చేయండి.

ఇలాంటి ఒక ఉదాహరణే ఖురాన్లోని 88వ అధ్యాయం. దీనికి సంబంధించిన వాక్యాల అనువాదం ఈవిధంగా ఉంది: "అయితే వీరు ఒంటెలను చూడరా అవి ఎలా సృష్టించబడ్డాయో? ఆకాశాన్ని చూడరా అది పైకి ఎలా ఎత్తబడిందో? సరే అయితే (ఓ ప్రవక్తా!) నీవు హితబోధ చేస్తూ ఉండు. నీవు కేవలం హితబోధ చేసేవాడవు మాత్రమే. వారిని ఏవిధంగానూ బలవంతం చేసేవాడవు కావు. కాని ఎవరైతే ముఖాన్ని త్రిప్పుకుంటాడో, వాడికి ఆ సర్వేశ్వరుడు భారీ శిక్ష విధిస్తాడు. వీరు చివరికి మా వైపునకేకదా తిరిగి రావలసింది. ఆ పై లెక్క చూడవలసిన బాధ్యత మా మీదనే ఉంది" - (88:17-26)

రుషీశ్వరునికి బోధించబడుతున్న ఖురాన్ యొక్క ఆ శైలి ఏమిటనేది, ఈ పైవాక్యాల ద్వారా మనకు తెలుస్తుంది. ఆ శైలి ఏమిటంటే, ప్రజలకు విషయాన్ని రుజువుల ద్వారా వివరించాలనేది. ధర్మం యొక్క సత్యతను వారు తమ బుద్ధి ఆధారంగా గ్రహించి, దానిపై సంతృప్తిపడేలా కృషిచేయాలి. మన సంబోధితుని ప్రతికూల ప్రవర్తన తరువాత కూడా, సందేశం యొక్క ఇదే అనుకూల శైలి చివరాఖరివరకు కొనసాగాలి. వారిపై కాపలాదారునిగా ఉంటూ, వారిని శిక్షించటమనేది ఒక సందేశదాత(సంస్కర్త)పనికాదు. ఆ తరువాత ఇక శిక్షా-బహుమానాల వ్యవహారమైతే కేవలం ఆ సర్వేశ్వరునికి సంబంధించినదే. తీర్పుదినం రోజున ఆయన ప్రతిఒక్కరిని నిలబెట్టి, వారివారి కర్మలనుబట్టి, వారిని శిక్షించటంగాని లేక బహూకరించ టంగాని చేస్తాడు.

ఈ వ్యవహారంలో రెండవ అతిముఖ్యమైన కోణం ఏమిటంటే, ఏ వ్యక్తైతే రుషీశ్వరునికి వ్యతిరేకంగా దూషణ చేసాడో, అతనిని ఆవిధంగా చేయకుండా నిరోధించండనీ, ఒకవేళ అతడు ఆగకపోతే అతణ్ణి కఠినంగా శిక్షించండని ఖురాన్లో ఎక్కడా చెప్పబడలేదనేదే ఆ కోణం. దీనికి బదులుగా విశ్వాసులకు ఖురాన్, తమ ప్రత్యర్థులను దూషించవద్దని ఆదేశిస్తుంది. ఈవిషయంలో ఖురాన్ సంబంధిత వాక్యం చూడండి: "ఆ సర్వేశ్వరుణ్ణి కాక వీరు ఎవరినైతే ఆరాధిస్తున్నారో వారిని మీరు దూషించకండి. లేదంటే వారు, అజ్ఞానం కారణంగా హద్దులుమీరి ఆ సర్వేశ్వరుణ్ణే దూషిస్తారు" - (6:108)

ఖురాన్లోని ఈవాక్యం ద్వారా తెలిసేదేమిటంటే, విశ్వాసులనేవాళ్ళు మీడియా వాచ్(media watch)ను ఏర్పాటుచేసి, తాము అనుమానిస్తున్నట్టు, ఎవరు దూషణల చర్యల్లో మునిగివున్నారు? వారిని ఏలా హతమార్చేయాలి? అనే రంధ్రాణ్వేషణ చేసుకుంటూ కూర్చోకూడదని అర్థమౌతుంది. దీనికి భిన్నంగా

ఖురాన్ బోధ ఏమిటంటే, విశ్వాసులనేవాళ్ళు, ప్రజలు కోపోద్రేకులై దైవధర్మాన్ని మరియు రుషీశ్వరుణ్ణి దూషించటానికి కారణభూతమయ్యే ఏ చర్యలనుండైనా సరే చివరాఖరి వరకు దూరంగా ఉండాలనేదే ఆ బోధన. అయితే ఖురాన్ హితబోధ ప్రకారం, ఈ వ్యవహారానికి సంబంధించిన బాధ్యతను స్వయంగా విశ్వాసులే తమపై వేసుకోవాలిగాని, ఇతరులపై వేసేసి, వారిని శిక్షించాలని మాత్రం అర్థించకూడదు.

దీనిప్రకారం చూసినట్లైతే ఆధునిక కాలపు ముస్లింల ప్రవర్తన ఖురాన్ ప్రబోధనకు పూర్తి వ్యతిరేకంగా కనబడుతుంది. ముస్లింలు చేసేది ఏమిటంటే, ఎప్పుడైనా ఒకవ్యక్తి ఒక ప్రసంగం ద్వారానో లేక ఒక వ్యాసం ద్వారానో ప్రవక్తను నిందించినట్లైతే, వారు వెంటనే కోపోద్రేకులైపోయి, ఆ వ్యక్తికి వ్యతిరేకంగా నిరసన-ప్రదర్శనలు చేపట్టి, "ఈవిధంగా దూషించేవాళ్ళందరి తలలను నరికేయండ"ని ఆదేశిస్తారు. (Behead all those who insult the Prophet).

ఎవరైతే ఈలాంటి రెచ్చగొట్టుడు ప్రదర్శనలు చేస్తూ, తమ ఊహాత్మక "ప్రవక్త అవమాన నేరస్తుల"కు మరణదండన విధించాలని నినదిస్తారో, వారే అసలైన "ప్రవక్త దూషణకర్తలు". వారి ఈ హింసాత్మక కార్యాచరణ కారణంగా జరిగిన తీవ్రపరిణామాలు ఏమిటంటే, ఇస్లాం నాగరికతకన్నా మునుపటి మతమని, స్వతంత్ర ఆలోచనలను ఇస్లాం అంగీకరించదని, సైద్ధాంతిక నేరాన్ని(thought-crime)ను ఇస్లాం అంగీకరిస్తుందని, ఇస్లాం ఒక ఉగ్రవాద మతం అని ఆధునిక మానవుడు భావించటం ప్రారంభించాడు. ఆధునిక కాలంలోని ఇస్లాం యొక్క ఈ ప్రతికూల ప్రతిమ(negative image)కు పూర్తిబాధ్యత కేవలం ముస్లింలదే. ఈవిధంగా ఇస్లాం స్వరూపాన్ని పాడుచేయటమనేది, నిస్సందేహంగా అన్నినేరాల్లోకెల్ల అత్యంత పెద్దనేరమే ఔతుంది.

## అభిప్రాయ బేధపు వ్యవహారం (Case of Difference of Opinion)

రుషీశ్వరుని దూషణ(blasphemy)అనే ఆలోచనే ఇస్లాంలో ఒకవింత విషయం. ఖురాన్ హదీసుల్లో దీని ఆజ్ఞలేదు. ముహమ్మద్ తరువాతి కాలంలో కొందరు పండితులు స్వయంగా ఈ ఆలోచనను ప్రవేశపెట్టి, దానిని ఇస్లామియా చట్టంలో ఒక భాగంగా మలచేసారు. రుషీశ్వరుడైన ముహమ్మద్కు సర్వేశ్వరుని సందేశపు ఆజ్ఞనే ఇవ్వటం జరిగింది. అంటే, దైవసందేశాన్ని ప్రజలకు అందించటం. ఖురాన్లో రుషీశ్వరుని విషయంలో ఈ పదాలు ఉపయోగించటం జరిగింది:"నీవు వారికి జ్ఞాపకం చేయ్. నీవు కేవలం జ్ఞాపకం

చేసేవాడివి మాత్రమే. నీవు ప్రజలపై కాపలాదారుడవు కావు"-(88:21-22). ఇదే బాధ్యత ముహమ్మద్ అనుచర సంఘానికి కూడా ఇవ్వబడింది. ఏ వ్యక్తైతే రుషీశ్వరుని దూషణకు పాల్పడతాడో, ఆ వ్యక్తికి మరణదండన విధించాలనే సిద్ధాంతానికి ఇస్లామియా జీవితచక్రంలో తావులేదు. దూషణ యొక్క అసలైన వాస్తవికత, అభిప్రాయ బేధం(difference of opinion)అనేదానితో ముడిపడి ఉంటుంది.

ఈ ప్రపంచంలో, మానవ స్వతంత్రత(స్వేచ్ఛ)అనే ప్రాతిపదికన అభిప్రాయ బేధమనే వ్యవహారం కొనసాగుతూ ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో, ఏ వ్యక్తినైతే ముస్లింలు స్వయంగా దూషణకర్త అంటున్నారో, ఆ దూషణ అనేది దాని వాస్తవికత ఆధారంగా అభిప్రాయ బేధానికి సంబంధించిన ఒక వ్యవహారమే(case)గాని, దూషణకు సంబంధించిన వ్యవహారం మాత్రం కాదు. ఇటువంటి వ్యక్తికి రుజువుల భాషలో విషయాన్ని వివరించటానికి కృషిచేయాలి. ఒకవేళ ఎవరైనా ఒకవ్యక్తి మీతో విభేదిస్తుంటే, అతనితో శాంతియుత సంవాదం చేసే హక్కు మీకు ఉంటుందేగాని, అతనిని చంపే హక్కు మాత్రం మీకు ఉండదు. ఆ వ్యక్తి నేరస్తుడు(criminal)కాడు. అతని వ్యవహారం, దేవుడు ప్రసాదించిన స్వేచను దుర్వినియోగపరిచే వ్యవహారం(misuse of freedom)గా పరిగణింపబడుతుంది. ఎవరైతే ఇటువంటివాళ్ళను హతమార్చమని ప్రకటిస్తారో, వారు స్వయంగా తప్పుడు వ్యక్తులు అవుతారుగాని, ఆ ఊహాత్మక దూషణకర్త మాత్రం తప్పుడు వ్యక్తి కాజాలడు.

ముహమ్మద్ అనుచర సంఘం యొక్క ఉద్యమం శాంతియుత ఉద్యమం. ఒకవేళ ఎవరైనా ఒకవ్యక్తి తన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నాడంటే, ఆ వ్యవహారం ఆ సర్వేశ్వరునికి సంబంధించిన వ్యవహారమే (case)గాని, మరోవ్యక్తికి దీనితో సంబంధంలేదు. ఎవరైతే, ఇటువంటివారిని "ప్రవక్త దూషణకర్త" అని ముద్రవేసి, హతమార్చాలనుకుంటారో, వారు స్వయంగా మానవ పరిధిదాటి, దేవుని పరిధి(పట్టు)లో ప్రవేశించే ప్రయత్నం చేస్తున్నారని అర్థం.

## కారుణ్యమూర్తి కార్యాచరణ విధానం

మక్కా విజయం తరువాత చాలామంది స్త్రీలు రుషీశ్వరుడైన ముహమ్మద్ వద్దకు వచ్చి ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు. వారిలోనే ఒకామే అబూసుఫియాన్ భార్య అయిన హిందా. ఉహద్ యుద్ధంలో హంజావారి మృతదేహాన్నుండి కాలేయాన్ని తీసి నమిలేసిన స్త్రీనే ఈమె. ఈమె అనేకమంది స్త్రీలను తనతోపాటు

తీసుకువచ్చింది. "ఒకవేళ నేను ముహమ్మద్ ముందు మాట్లాడితే ఆయన నన్ను పసిగట్టేసి, నన్ను హతమార్చేస్తారు" అని చెప్పింది. (తఫ్సీర్ అల్-తబ్రి, 23వ అధ్యాయం, 341వ పేజి)

కాబట్టే ఆమే, ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రమాణంచేసే సమయంలో తన ముఖాన్ని ముసుగుతో కప్పుకుంది. కాని ఆమె ఉన్నతవర్గానికి చెందిన స్త్రీ కాబట్టి, తన పెద్దరికం కారణంగా మాట్లాడకుండా ఉండలేక పోయింది. ప్రమాణస్వీకారం చేయిస్తూ రుషీశ్వరుడైన ముహమ్మద్ ఆ స్త్రీలతో, "మేము మా సంతానాన్ని హత్యచేయము" అని చెప్పండని వారిచేత చెప్పించారు. (తఫ్సీర్ ఇబ్నె అబిహాతిం, 18871వ హదీసు)

అప్పుడు హిందా సహనాన్ని కోల్పోయి, అహంకారపూరితంగా మాట్లాడింది. ఆమె చెప్పిన పదాలను వివిధ ఉల్లేఖనాల్లో ఈవిధంగా చెప్పటం జరిగింది: హిందా మాట్లాడుతూ, “మీరు వారుని బద్ర్ యుద్ధంలో హతమార్చేసారు. కాబట్టి మీకూ తెలుసు, వారికీ తెలుసు. మేము వారిని చిన్నతనంలో పోషించాము, పెద్దయ్యాక మీరు వారిని హతమార్చేసారు. మీరు స్వయంగా వారి తండ్రులను చంపుతూ, వారి సంతానం విషయంలో మాకు హితబోధ చేస్తున్నారు" అని హిందా రుషీశ్వరుడైన ముహమ్మద్తో చెప్పింది.-(తఫ్సీర్ ఇబ్నె అబిహాతిం, 18872-18874 హదీసులు)

హిందా గతంలోకూడా రుషీశ్వరుడైన ముహమ్మద్ గొప్పతనం విషయంలో అహంకారపూరితంగా ప్రవర్తించింది. ప్రస్తుత ప్రస్తావిత ఘటనలోనైతే ఆమె బాహాటంగానే ప్రవక్తను అవమానించింది. ఆధునిక కాలంలోని నామమాత్రపు ముస్లిం నాయకులు ఏ స్వయంకల్పిత ఇస్లాం వివరణైతే చేసి ఉంచారో, అదే ఇస్లామ్ను ఒకవేళ రుషీశ్వరుడైన ముహమ్మద్ కూడా అనుసరించి ఉంటే, అప్పుడు ఆయనగారు హిందాను వెంటనే హతమార్చేసి ఉండేవారు. కాని ఆయన మాత్రం ఆమెచేత ప్రమాణం చేయించి, ఇస్లాంధర్మంలో ప్రవేశింపజేసారు.

ఈనాడు ముస్లింలు పోగొట్టుకున్న అతిపెద్ద వస్తువు ఏదైనా ఉందంటే అది, కారుణ్యమూర్తి యొక్క కారుణ్యపు కార్యాచరణ విధానం మాత్రమే అనేది.

సమాప్తం!

ఖురాన్లోని సుమారు రెండువందల పైచిలుకు వాక్యాల్లో చెప్పబడిన విషయమేమిటంటే, రుషీశ్వరుల సమకాలీకులు నిరంతరం అవే చర్యలకు పాల్పడ్డారు ఏదైతే ఈరోజుల్లో "ప్రవక్తకు అవమానం"అని పిలవబడుతుందో. ఒకజాతి తనకాలపు రుషీశ్వరుణ్ణి అసత్యవాది(40:24)అంటే, మరోజాతి తనకాలపు ప్రవక్తను వెర్రివాడు(15:6)అని పిలిచేది. ఇంకొకజాతి తన సందేశహరుణ్ణి అబద్ధీకుడు(16:101) అని నిందిస్తే, ఇక వేరేజాతీయులు తమకాలంలోని దైవప్రవక్తను అవివేకుని(7:66)గా పిలిచేవారు. ఇంకొందరు, వారి ప్రవక్తను ఎగతాళి చేసేవారు(36:30). ఈవిధంగా రకరకాలుగా రుషీశ్వరులను బాధించేవారు. ఖురాన్లో అనేకచోట్ల ఇటువంటి నిందారోపణా ఘటనల ప్రస్తావన వచ్చింది. కాని, ఇలా ప్రతికూలంగా ప్రవర్తించినవారిని కొరడాలతో కొట్టండనిగాని, వారిని హతమార్చేయండనిగాని ఖురాన్లో ఎక్కడా ప్రస్తావించలేదు.

దీనినిబట్టి అర్థమౌతున్నదేమిటంటే, రుషీశ్వరుని దూషణ అనేది, శిక్ష(దండన)కు సంబంధించిన అంశం కాదు. అదొక సంవాదానికి సంబంధించిన అంశం. అంటే, ఏవ్యక్తైతే "ప్రవక్త దూషణ"కు పాల్పడతాడో, అతణ్ణి భౌతికంగా శిక్షించటం జరగదుగాని, అతని బుద్ధిని తట్టిలేపే విధంగా అతనితో రుజువులు అనే భాషలో మాట్లాడటం జరుగుతుంది. మరోవిధంగా చెప్పాలంటే, "ప్రవక్త దూషణకర్తలకు" రుజువుల భాషలో విషయాన్ని వివరించి, వారిని సంస్కరించటానికి కృషిచేయాలేగాని, వారిని చంపటంగాని లేక కొరడాదెబ్బలు కొట్టటంగాని చేయకూడదు.

ఈ సందర్భంగా ఖురాన్లోని ఈ వాక్యాన్ని చూడండి:"వారి హృదయాల్లో ఏదైతే ఉందో, అది సర్వేశ్వరునికి బాగా తెలుసు. అయితే నీవు వారితో దూరంగా ఉండు మరియు వారికి హితబోధచేస్తూ ఉండు. మరియు వారి హృదయాలకు హత్తుకునే విధంగా వారితో మాట్లాడు"-(4:63)

https://linktr.ee/maulanawahiduddinkhan

www.cpsglobal.org
info@cpsglobal.org

www.goodwordbooks.com
info@goodwordbooks.com